www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 13-4-2025 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 358 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: పాడ్యమి పూర్తి, నక్షత్రం: చిత్త రా.9.11 తదుపరి స్వాతి, వర్జ్యం: తె.3.29-5.17, దుర్ముహూర్తం: సా.4.48-5.37, అమృతఘడియలు: మ.1.58-3.46, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.04, సూర్యాస్తమయం: 6.27 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 13-4-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

రాష్ట్రపతికీ గడువు

గవర్నర్ పంపే బిల్లులపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలి: సుప్రీం కోర్టు

దేశచరిత్రలో తొలిసారి రాష్ట్రపతికి గడువు నిర్దేశించిన సర్వోన్నత న్యాయస్థానం

- జాప్యమైతే కారణాలు రాష్ట్ర ప్రభుత్వాలకు తెలపాలి
- గవర్నర్లకే కాదు రాష్ట్రపతికి కూడా సంపూర్ణ వీటో అధికారం ఎంతమాత్రమూ లేదు
- బిల్లులో రాజ్యాంగ విరుద్ధ అంశాలున్నట్టు భావిస్తే 'సుప్రీం'కు పంపి సలహా తీసుకోవాలి
- శ్రీలంకలో ఇదే విధానం అమలులో ఉంది
- గడువులోగా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకపోతే.. రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టుల్ని ఆశ్రయించవచ్చు
- రాజ్యాంగపరమైన అంశాలు ఇమిడి ఉన్న బిల్లులపై ముందే కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలి
- కేంద్రం అడిగే ప్రశ్నలకు వేగంగా సమాధానాలిచ్చి, సూచనల్ని పరిగణనలోకి తీసుకోవాలి
- తమిళనాడు x గవర్నర్ కేసులో సుప్రీం పూర్తి తీర్పు





జస్టిస్ జేబీ పార్దీవాలా



జస్టిస్ మహదేవన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: గవర్నర్లు పంపే బిల్లులపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ సాక్షాత్తూ రాష్ట్రపతికి గడువు నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. అంతకుమించి ఆలస్యమైతే.. జాప్యానికి సహేతుక కారణాలను సైతం నమోదు చేసి, సంబంధిత రాష్ట్రాలకు ఆ విషయాన్ని తెలపాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. ఒకవేళ.. ఏదైనా బిల్లు రాజ్యాంగవిరుద్ధంగా ఉందని రాష్ట్రపతి భావిస్తే, ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా దానిపై సుప్రీంకోర్టు సలహా తీసుకోవచ్చని సూచించింది. అలాగే.. గవర్నర్లు పంపే బిల్లులపై నిర్దేశిత గడువులోగా రాష్ట్రపతి ఏ చర్యా తీసుకోకపోతే, రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టులను ఆశ్రయించి, రాష్ట్రపతికి వ్యతిరేకంగా రిట్ ఆఫ్ మాండమస్ జారీ చేయాల్సిందిగా కోరుతూ రిట్‌పిటిషన్లు దాఖలు చేయొచ్చని పేర్కొంది. అదే సమయంలో.. గవర్నర్లు పంపే బిల్లులపై రాజ్యాంగంలోని 201వ అధికరణ ప్రకారం రాష్ట్రపతి వ్యవహరించాలని.. రాష్ట్రాలు సైతం కేంద్రం అడిగే ప్రశ్నలకు వేగంగా సమాధానాలు ఇచ్చి సహకరించాలని, కేంద్ర ప్రభుత్వం చేసే సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇలా రాష్ట్రపతికి ఒక అంశంలో నిర్ణయం తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ తీర్పునివ్వడం దేశ చరిత్రలోనే

మిగతా 12వ పేజీలో...

గవర్నర్ ఆమోదం లేకుండానే.. 10 బిల్లులు చట్టాలయ్యాయి!

గెజిట్ ప్రకటించిన తమిళనాడు ప్రభుత్వం

తిరోగమనంలో రాహుల్ గాంధీ?



జన్యుపరమైన లోపాలేవో కాంగ్రెస్ పార్టీని పట్టిపీడిస్తున్నాయి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కాంగ్రెస్ పార్టీ జవసత్వాలు కోల్పోవడానికి ఆ పార్టీ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమా?

> ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించడానికి నిరాకరిస్తూ తుప్పు పట్టిన భావజాలాన్నే కొనసాగించడం వల్లనే కమ్యూనిస్టు పార్టీలు దెబ్బతింటున్నాయన్న విషయం కమ్యూనిస్టులకు తప్ప అందరికీ అర్థమవుతోంది. విచిత్రంగా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా కమ్యూనిస్టులు వాడిన పడికట్టు పదాలనే వాడుతోంది. ప్రజలకు దూరమైన కమ్యూనిస్టులను అనుకరించాలని అనుకోవడమే ఆ పార్టీ భావ దారిద్ర్యంగా కనిపిస్తోంది.

ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, నాయనమ్మ ఇందిరా గాంధీ అనుసరించిన విధానాలను కూడా రాహుల్ గాంధీ అధ్యయనం చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను, పోకడలను ఆకళింపు చేసుకొని అందుకు అనుగుణంగా పార్టీకి దిశానిర్దేశం చేయవలసిన రాహుల్ గాంధీ ఇప్పుడు తిరోగమనంలో పయనిస్తున్నారు.

> ఒక సమర్థుడికి, ఒక మంచి వాడికి మధ్య పోటీ పెడితే ప్రజలు సమర్థుడినే ఆదరిస్తారు. రాహుల్ గాంధీని ప్రజలు మంచివాడుగానే గుర్తిస్తున్నారు గానీ సమర్థుడిగా అంగీకరించడం లేదు. ఈ ఇరువురిలో ప్రధాని మోదీనే సమర్థుడిగా గుర్తించి ఆదరిస్తున్నారు.

దళిత, మైనారిటీలకు అండగా నిలబడటం వేరు, ఆ వర్గాలకు మాత్రమే పరిమితమైన పార్టీగా కుదించుకుపోవడం వేరు. ఈ తేడాను రాహుల్ గాంధీ గుర్తించాలి.

> బాబాయ్ హత్య, కోడికత్తి, గులకరాయి వంటి కుట్ర సిద్ధాంతాలను తెరమీదకు తెచ్చి జగన్మోహన్ రెడ్డి గతంలో లాభపడ్డారు. ఇప్పుడు మళ్లీ అదే చేస్తున్నారు.

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ

2లో..

సిద్ధార్థలో 'శంకర్‌దాదాలు'!



మెడికల్ కాలేజీలో మాస్ కాపీయింగ్.. సప్లిమెంటరీ పరీక్షల్లో ఇతర ప్రైవేటు కాలేజీ విద్యార్థులకు స్లిప్‌లు

- అంతా బడా వ్యక్తుల పిల్లలే.. ఎగ్జామినేషన్ సిబ్బంది సహకారం.. ఇన్విజిలేటర్ల చేతివాటం
- సబ్జెక్టును బట్టి రేట్లు.. ఎంబీబీఎస్ విద్యార్థుల నుంచి లక్షలు వసూలు.. పారా మెడికల్, నర్సింగ్ వారి నుంచి ఒక్కో పరీక్షకు 1000.. పరీక్ష రాసిన తర్వాత జవాబుపత్రాలూ మార్పిడి
- ఆరోగ్య శాఖ అధికారులకు పలు ఫిర్యాదులు.. తాజా తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురు విద్యార్థులు

13

ఇంటర్‌లో భారీగా పెరిగిన ఉత్తీర్ణత

- ద్వితీయ సంవత్సరంలో 83 శాతం మంది
- ప్రథమ సంవత్సరంలో 70% మంది పాస్
- గత పదేళ్లతో పోలిస్తే ఈ ఏడాదే అత్యధికం
- టాప్‌లో కృష్ణా... అట్టడుగున అల్లూరి జిల్లా
- రెండు సంవత్సరాల్లోనూ బాలికలదే పైచేయి
- సత్తా చాటిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలు

14

అది రోడ్డు ప్రమాదమే

పాస్టర్ ప్రవీణ్ మృతిపై పోలీసుల స్పష్టీకరణ

- ప్రమాద సమయంలో పనిచేయని బుల్లెట్ హెడ్‌లైట్..
- హైవే పక్కన కంకరపైకి వెళ్లడంతో స్కిడ్ అయిన బైకు
- ఆయనపై పడిన బుల్లెట్
- ఏ వాహనమూ ఢీ కొట్టలేదు
- 100 మందిని విచారించాం
- 400 సీసీ ఫుటేజీల పరిశీలన
- దర్యాప్తుపై ప్రవీణ్ కుటుంబ సభ్యులకు నమ్మకం
- ఏలూరు ఐజీ అశోక్ వెల్లడి

13

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

జగన్‌రెడ్డి పాలనను ప్రజలు మరచిపోలేరు కనుకే ఆయన మళ్లీ అధికారంలోకి వస్తారన్న భావన వస్తేనే ఉలిక్కిపడుతున్నారు. కూటమి శ్రేణులు కూడా ఈ కారణంగానే సొంత ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అరాచకంగా ప్రవర్తించిన వారిపై ఇంకెప్పుడు చర్యలు తీసుకుంటారు? అని నిలదీస్తున్నారు. కూటమి శ్రేణులు, తెలుగు తమ్ముళ్ల ఆవేదనలో అర్థం లేకపోలేదు. పోలీసుల అదుపులో ఉన్న తెలుగుదేశం కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ దాడికి ప్రయత్నించడం, శుక్రవారం నాడు సీఐడీ విచారణకు హాజరైన మాజీ మంత్రి జోగి రమేశ్ మాట్లాడిన విధానం గమనిస్తే తెలుగు తమ్ముళ్ల ఆక్రోశంలో అర్థం ఉందని అంగీకరించక తప్పదు. నాడు చంద్రబాబు కుటుంబాన్ని, పవన్ కల్యాణ్ కుటుంబాన్ని, మరెందరో మహిళలను అవమానించిన వారిని ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి సత్కరించగా, ఇప్పుడు జగన్ భార్య భారతి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్ అనే సొంత పార్టీ కార్యకర్తను ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు చేయించారు. ఇద్దరి మధ్య ఉన్న ఈ తేడాను ప్రజలు అర్థం చేసుకోలేరా?

తిరోగమనంలో రాహుల్‌గాంధీ?

అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి ఏమైంది? జన్యుపరమైన లోపాలేవో ఆ పార్టీని పట్టిపీడిస్తున్నాయి. స్వాతంత్ర్య సముపార్జనలో అగ్ర భాగాన ఉండి, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిన ఆ పార్టీ నాయకత్వం ఇప్పుడు వెలవెలబోవడానికి కారణమేమిటి? కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కాంగ్రెస్ పార్టీ జవసత్వాలు కోల్పోవడానికి ఆ పార్టీ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమా? ఈ తరం ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీని తీర్చిదిద్దడంలో, విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతోందా? ప్రపంచీకరణ వైపు ప్రజలు చూస్తున్న ఈ రోజుల్లో కమ్యూనిస్టుల భావజాలాన్ని అందిపుచ్చుకోవడమే ఆ పార్టీకి శాపంగా మారిందా? వరుస ఓటములతో పార్టీ భవిష్యత్తు మసకబారిన సమయంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు గుజరాత్‌లో ఇటీవల నిర్వహించిన సదస్సులో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగం విన్నవారికి ఆ పార్టీకి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకం కలగడం లేదు. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ ఎందుకు వెనుకబడుతున్నారు? అని ప్రశ్నించుకుంటే, ప్రజలు ఏమి కోరుకుంటున్నారు? వారి ఆలోచనలలో వచ్చిన మార్పు ఏమిటి అన్నది పసిగట్టకపోవడమే కారణంగా కనిపిస్తోంది.

కమ్యూనిస్టులు అలా... కాంగ్రెస్ ఇలా...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో బలంగా ఉండిన కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా బలహీనపడిపోవడానికి కారణమేమిటి? ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించడానికి నిరాకరిస్తూ తుప్పు పట్టిన భావజాలాన్నే కొనసాగించడం వల్లనే కమ్యూనిస్టు పార్టీలు దెబ్బతింటున్నాయన్న విషయం కమ్యూనిస్టులకు తప్ప అందరికీ అర్థమవుతోంది. సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టులనే తీసుకుందాం! ఒకప్పుడు దోపిడీకి గురైన ప్రజలు మావోయిస్టులను ఆశ్రయించి, ఆదరించేవారు. ఇప్పుడు సమాజంలో శ్రమ దోపిడీ అనే మాట పెద్దగా వినపడటం లేదు. ఫలితంగా మావోయిస్టుల అవసరం జనానికి లేకుండా పోయింది. ప్రపంచీకరణ కారణంగా కష్టపడే వారికి ఉపాధి అవకాశాలకు కొదవ ఉండటం లేదు. జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయి. ఫలితంగా మావోయిస్టులు బలహీనపడుతున్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యుద్ధంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ శాంతి చర్చల మంత్రం జపిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మావోయిస్టులు చరిత్ర పుటలకే పరిమితం అవుతారు. కమ్యూనిస్టుల పరిస్థితి కూడా ఇంచుమించుగా ఇలాగే ఉంది. దళిత, మైనారిటీ సంక్షేమం కోసం పోరాడటమే తమ లక్ష్యంగా భావించిన కమ్యూనిస్టులు కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమయ్యారు. యువ తరానికి పూర్తిగా దూరమయ్యారు. సమస్యలు ఎదురైనప్పుడు కమ్యూనిస్టులను ఆశ్రయించిన దళిత, మైనారిటీలు ఎన్నికల సమయంలో మాత్రం వారికి ముఖం చాటేసేవారు. 'బూర్జువా' పార్టీలకే ఓటు వేసేవారు. ఈ పరిణామాన్ని గుర్తించి, తమ విధానాలను సంస్కరించుకోవడానికి నిరాకరించిన కమ్యూనిస్టులు ఇప్పుడు ఇలా మిగిలారు. విచిత్రంగా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా కమ్యూనిస్టులు వాడిన పడికట్టు పదాలనే వాడుతోంది. ప్రజలకు దూరమైన కమ్యూనిస్టులను అనుకరించాలని అనుకోవడమే ఆ పార్టీ భావదారిద్ర్యంగా కనిపిస్తోంది.

కాంగ్రెస్... నాడు, నేడు

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తర్వాత కాంగ్రెస్ నాయకత్వం అనుసరించిన విధానాలు ఏమిటి? ఇప్పుడు ఆ పార్టీ యువ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? అని ప్రశ్నించుకుంటే పొంతనే ఉండటం లేదు. తొలి తరం కాంగ్రెస్ నాయకత్వం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించింది. ఆ తర్వాత దశలో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రైవేటీకరణను ప్రోత్సహించారు. ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే పేదల సంక్షేమం చేపట్టవచ్చని నమ్మారు. అయితే, కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ ముస్లిం మైనారిటీలను సంతృప్తిపరచడానికే ప్రాధాన్యం ఇచ్చేదన్న అభిప్రాయం ఉండేది. ఈ కారణంగా మెజారిటీ ప్రజలు క్రమంగా ఆ పార్టీకి దూరమవుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గుజరాత్ సదస్సులో మాట్లాడుతూ... సమాజంలో బడుగు బలహీనవర్గాలను కలుపుకొంటే దళిత, మైనారిటీల జనాభా 90 శాతం ఉండగా, దేశ సంపదలో 90 శాతం మాత్రం పది శాతం ఉన్న కార్పొరేట్ శక్తుల చేతిలో ఉందని విమర్శించారు. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగి, మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్న పార్టీ నాయకుడి నోట ఇటువంటి మాటలు రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒకప్పుడు కమ్యూనిస్టులు ఇటువంటి వ్యాఖ్యలు చేసేవారు. ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, నాయనమ్మ ఇందిరా గాంధీ అనుసరించిన విధానాలను కూడా రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. దళిత, మైనారిటీలతో పాటు బడుగు, బలహీనవర్గాల వారి అభ్యున్నతిని కాంక్షించని వారు ఉండరు. అలాగే ఆ వర్గాలవారు రాజకీయంగానూ ఎదగాలని ఏ పార్టీ అయినా కోరుకుంటుంది. ప్రధానమంత్రి మోదీ స్వయంగా తాను బీసీని అని చెప్పుకోవడం దేనికి సంకేతం? కాంగ్రెస్‌లో ఒకప్పుడు బ్రాహ్మణులు అధికంగా కనిపించేవారు. ఉత్తరాది రాష్ట్రాలలో బ్రాహ్మణ నాయకత్వమే ఉండేది. కాలక్రమంలో బ్రాహ్మణులు కనుమరుగై ఇతర అగ్ర వర్ణాలవారు నాయకత్వం వహించే స్థితికి ఎదిగారు. ఇప్పుడు క్రమంగా బడుగు బలహీనవర్గాలవారు నాయకత్వ స్థానాలను అందుకుంటున్నారు. ఇదొక సహజ ప్రక్రియ. బ్రాహ్మణ ఆధిపత్యం పోవడానికి ఎవరూ కారణం కాదు. అలాగే బడుగు బలహీనవర్గాల వారు నాయకత్వ స్థానాల్లోకి రావడానికి కూడా ప్రత్యేకంగా ఎవరూ కారణం కాదు. సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులే ఇందుకు కారణం. గ్రామాలలో భూమి ఎవరి ఆధీనంలో ఉంటే వారికే రాజకీయ అధికారం లభించడం సహజమని అంటారు. ఒకప్పుడు భూమి బ్రాహ్మణుల వద్ద ఉండేది. వారు పట్టణాలకు వలస వెళ్లిన తర్వాత ఇతర అగ్ర వర్ణాల చేతుల్లోకి భూమి వెళ్లింది. దీంతో రాజ్యాధికారం వారికి దక్కింది. ఇప్పుడు క్రమంగా భూమి బలహీనవర్గాలు, దళితుల చేతుల్లోకి వెళుతోంది. ఈ క్రమంలో అతి త్వరలోనే రాజ్యాధికారం బలహీనవర్గాలు, దళితులకు అందబోతోందని అనుకోవాలి. ఈ పరిణామం పరిపక్వం చెందక ముందే సామాజిక న్యాయం పేరిట కొన్ని పార్టీలు రాజకీయ విన్యాసాలు చేసి విఫలమయ్యాయి. తెలుగు రాష్ట్రాలలో ఇది చూశాం. సామాజిక న్యాయం పేరిట బీసీలకు, దళితులకు ఎన్నికల్లో టికెట్లు ఇచ్చినంత మాత్రాన విజయం వరించదు. 2014 ఎన్నికల్లో తెలంగాణలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్న తెలుగుదేశం పార్టీ బీసీ నినాదాన్ని అందిపుచ్చుకుంది. బీసీ సంఘాల నాయకుడు ఆర్.కృష్ణయ్యను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. అయినా అగ్రవర్ణానికి చెందిన కేసీఆరే అధికారంలోకి వచ్చారు. ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రి పదవి కోసం కేసీఆర్–రేవంత్‌రెడ్డి మధ్యనే పోటీ జరిగింది. ఎన్నికల్లో నిజానికి ఫలానా ఫార్ములానే పని చేస్తుందని చెప్పలేం. ఎన్నికల సమయానికి ఉన్న పరిస్థితులను బట్టి ప్రజలు ఓటేస్తారు. ఉత్తరాదిలో ఉన్నంతగా దక్షిణాదిలో కులాల ప్రాబల్యం కనిపించదు. సామాజిక న్యాయంతో పాటు పేదలు–పెత్తందారుల మధ్య యుద్ధం అని ప్రకటించిన జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో ఘోరంగా ఓడిపోయారు కదా? ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఒకప్పుడు బ్రాహ్మణుల ఆధిపత్యం ఉన్నప్పుడు వారు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండేవారు. కాల క్రమంలో ఆ వర్గంవారు భారతీయ జనతా పార్టీ వైపు జరిగారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను, పోకడలను ఆకళింపు చేసుకొని అందుకు అనుగుణంగా పార్టీకి దిశానిర్దేశం చేయవలసిన రాహుల్‌గాంధీ ఇప్పుడు తిరోగమనంలో పయనిస్తున్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలకు అనుగుణంగా వ్యూహ రచన చేస్తూ భారతీయ జనతా పార్టీని విజయపథంలో నిలబెడుతున్నారు. '75 ఏళ్ల వయసులో కూడా ప్రధాని మోదీ యువతను ఆకర్షించడానికి కారణం ఏమిటి? 50లలో నేను యువతను ఎందుకు ఆకర్షించలేకపోతున్నాను?' అని రాహుల్ గాంధీ ఆత్మపరిశీలన చేసుకోవాలి కదా! ఒక సమర్థుడికి, ఒక మంచివాడికి మధ్య పోటీ పెడితే ప్రజలు సమర్థుడినే ఆదరిస్తారు. రాహుల్‌గాంధీని ప్రజలు మంచివాడుగానే గుర్తిస్తున్నారు గానీ సమర్థుడిగా అంగీకరించడం లేదు. ఈ ఇరువురిలో ప్రధాని మోదీనే సమర్థుడిగా గుర్తించి ఆదరిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ మెజారిటీ ప్రజలకు చేరువ అవుతుండగా, కాంగ్రెస్ పార్టీ దూరమవుతోంది. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా, యువతరం మనోభావాలతో పొంతన లేకుండా రాహుల్‌గాంధీ ఆలోచనలు ఉండటం కాంగ్రెస్ పార్టీకి శాపంగా పరిణమిస్తోంది.

కాలానుగుణంగా మారాలి...

ప్రపంచీకరణ వల్ల ప్రజల ఆలోచనలు మారిపోయాయి. ప్రపంచ మానవాళి మెరుగైన జీవితాలను కోరుకుంటోంది. కార్పొరేట్ శక్తులకు ఈ పరిణామం సహజంగానే ఉపకరిస్తోంది. వ్యవసాయాన్ని నమ్ముకున్నవారు కూడా తమ పిల్లలు వ్యవసాయం చేయాలని కోరుకోవడం లేదు. చిన్నదో పెద్దదో పట్టణాలు, నగరాల్లో ఉద్యోగాలు చేయాలని కోరుకుంటున్నారు. గ్రామాల్లో నివసించడానికి కూడా ఇష్టపడటం లేదు. ఈ క్రమంలో కార్పొరేట్ రంగానికి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ మాట్లాడటం వలన ప్రయోజనం ఏమిటో తెలియదు. బడుగు బలహీనవర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందించాలన్నా ఆర్థికాభివృద్ధి సాధించాలి కదా? దేశంలో కార్పొరేట్ రంగం అభివృద్ధి చెంది, పన్నుల రూపంలో ప్రభుత్వాలకు ఆదాయం సమకూరినప్పుడే సంక్షేమ పథకాలను అమలు చేయగలమన్న ప్రాథమిక సూత్రాన్ని రాహుల్‌గాంధీ విస్మరిస్తే ఎలా? దేశంలో కమ్యూనిస్టు పార్టీల పరిస్థితి కళ్లెదుటే కనిపిస్తున్నప్పటికీ... ఆయన అవే విధానాలను అందిపుచ్చుకోవడం కాంగ్రెస్ పార్టీకి మేలు చేయదు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? ఎన్నికల్లో ఆయన విజయాలు అందుకోవడానికి కారణం ఏమిటి? అని అధ్యయనం చేయకుండా కాలం చెల్లిన పాత చింతకాయ పచ్చడి వంటి నినాదాలను అందిపుచ్చుకోవడం అవివేకం అవుతుంది. ఈ వర్గం, ఆ వర్గం అన్న తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీకి యువ నాయకత్వం ఉండి కూడా యువతరం ఎందుకు తమకు దూరమవుతోందో గుర్తించే ప్రయత్నం చేయాలి కదా? గుజరాత్ ప్లీనరీలో ఈ దిశగా చర్చలు జరపకుండా ప్రధాని మోదీని తిట్టిపోయడం వల్ల ప్రయోజనం ఏమిటి? కాంగ్రెస్ పార్టీ చరిత్ర ఏమిటి? స్వాతంత్ర్య పోరాటంలో ఆ పార్టీ పాత్ర గురించి నేటి తరంలో ఎంత మందికి తెలుసు? ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల బలిదానాల గురించి కూడా తెలియదే! పార్టీకి దూరమైన మెజారిటీ ప్రజలతో కనెక్టయ్యే ప్రయత్నం చేయకుండా, కాంగ్రెస్ పార్టీ అందరిదీ అన్న భావనకు దూరంగా జరిగిపోవడమే ఆ పార్టీకి శాపమైంది. అందరి పార్టీగా ఉండాల్సిన పార్టీని కొందరి పార్టీగా రాహుల్ గాంధీ మార్చుతున్నారన్న అభిప్రాయం కూడా ఉంది. ప్రధాని మోదీ ఇందుకు పూర్తి భిన్నమైన మార్గాన్ని అనుసరిస్తున్నారు. ముస్లిం మైనారిటీల పట్ల భారతీయ జనతా పార్టీ వివక్ష చూపుతున్నదన్న అభిప్రాయం ఉన్నప్పటికీ మెజారిటీ ప్రజలకు చేరువవడంలో ఆ పార్టీ సక్సెస్ అయింది. ఇటీవల నిర్వహించిన కుంభమేళానే ఇందుకు నిదర్శనం. ఈ రాష్ట్రం, ఆ రాష్ట్రం అన్న తేడా లేకుండా, మైనారిటీలను మినహాయిస్తే అన్ని వర్గాల ప్రజలు కుంభమేళాలో పాల్గొన్నారు. ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంలో ప్రధాని మోదీ సక్సెస్ అయ్యారు. ఈ కారణంగానే భారతీయ జనతా పార్టీ మతతత్వ విధానాలను అనుసరిస్తుందన్న విమర్శ ఉన్నప్పటికీ మెజారిటీ ప్రజలు ఆ పార్టీ వైపే చూస్తున్నారు. మెజారిటీ ప్రజలు అంటే అందులో బడుగు బలహీనవర్గాలవారు కూడా ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు, రాజకీయ నాయకుల ఆలోచనా ధోరణులు మారుతున్నాయి. 'అమెరికా ఫస్ట్' అన్న నినాదంతో ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెజారిటీ అమెరికన్లను ఆకర్షించగలిగారు. వివిధ దేశాల్లో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు, ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించి రాహుల్‌గాంధీ తనను తాను సంస్కరించుకోని పక్షంలో ఆ పార్టీ సమీప భవిష్యత్‌లో అధికారంలోకి రాలేదు. ప్రపంచ దేశాల అనుభవాలను అటుంచితే మన దేశంలో వచ్చిన, వస్తున్న మార్పులనైనా అధ్యయనం చేసే ప్రయత్నం ఆయన వెంటనే చేయాలి. దళిత, మైనారిటీలకు అండగా నిలబడటం వేరు, ఆ వర్గాలకు మాత్రమే పరిమితమైన పార్టీగా కుదించుకుపోవడం వేరు. ఈ తేడాను రాహుల్‌గాంధీ గుర్తించాలి. ప్రజల ఆలోచనలకు దూరంగా వెళ్లిపోవడం వల్ల కమ్యూనిస్టుల వలె కాంగ్రెస్ కూడా బలహీనపడిపోయే ప్రమాదం ఉంది.

> **దళిత, మైనారిటీలకు అండగా నిలబడటం వేరు, ఆ వర్గాలకు మాత్రమే పరిమితమైన పార్టీగా కుదించుకుపోవడం వేరు. ఈ తేడాను రాహుల్‌గాంధీ గుర్తించాలి. ప్రజల ఆలోచనలకు దూరంగా వెళ్లిపోవడం వల్ల కమ్యూనిస్టుల వలె కాంగ్రెస్ కూడా బలహీనపడిపోయే ప్రమాదం ఉంది.**



సెంటిమెంటు అస్త్రం

కాంగ్రెస్ పార్టీ విషయం అలా ఉంచి, తెలుగునాట చోటుచేసుకుంటున్న పరిణామాల విషయానికి వద్దాం! ఆంధ్రప్రదేశ్‌లో జగన్ అండ్ కో, తెలంగాణలో కేసీఆర్ అండ్ కో తమ పాత కుయుక్తులతో అటు కూటమి ప్రభుత్వాన్ని, ఇటు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణలో కేసీఆర్ అండ్ కో మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రగిలించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును వాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, చంద్రబాబుకు మధ్య ఉన్న అనుబంధాన్ని తెలంగాణ సెంటిమెంటును రగిలించేందుకు వాడుకోవాలని చూస్తున్నారు. కంచ గచ్చిబౌలి వివాదమైనా, మరొకటైనా చంద్రబాబును బూచిగా చూపించే ప్రయత్నం మొదలెట్టారు. ఆ భూములు సెంట్రల్ యూనివర్సిటీకి దక్కినా, ప్రభుత్వానికి దక్కినా చంద్రబాబుకు గానీ, మరొకరికిగానీ ఒరిగేదేమీ ఉండదు. అయినా తెలంగాణకు నష్టం జరగబోతోందంటూ పిచ్చి ప్రచారం మొదలుపెట్టారు. ఈ క్రమంలో 'ఆంధ్రా' పత్రికలు అంటూ మీడియాకు ప్రాంతీయ తత్వాన్ని అంటగట్టే ప్రయత్నం మొదలెట్టారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన మీడియానే అప్పుడూ ఉంది – ఇప్పుడూ ఉంది. ఇంతకాలంగా తెలంగాణ సెంటిమెంట్ ద్వారా ఆర్థికంగా, రాజకీయంగా లాభపడిన కేసీఆర్ కుటుంబం ఇప్పుడు మళ్లీ అదే పాత అస్త్రాన్ని బయటకు తీస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు తమ దురహంకార పోకడలను తెలంగాణ సమాజం తిరస్కరించి ఇంట్లో కూర్చోబెట్టిన వాస్తవాన్ని గుర్తించకుండా మళ్లీ సెంటిమెంట్‌పై ఆధారపడాలనుకోవడం ఆశ్చర్యంగా ఉంది. భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ప్రతిరోజూ మూడు నాలుగు గంటలపాటు సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు, వ్యాఖ్యలను చూస్తున్నారు. యూట్యూబ్‌లో మనం ఎటువంటి వీడియోలు చూస్తే అటువంటివే మనకు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా తమకు అనుకూలంగా ఉండే పోస్టులను చూసుకుంటూ వారు మురిసిపోతున్నారు. సోషల్ మీడియాలో ప్రచారం పొందినంత మాత్రాన ఒరిగేది ఏమీ ఉండదు అనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. హైదరాబాద్‌లో చిన్న హోటల్ నడుపుకొన్న కుమారి ఆంటీకి సోషల్ మీడియాలో విశేష ప్రచారం లభించింది. తర్వాత ఆమె పరిస్థితి ఏమిటి? ఈ కోవలోనే బర్రెలక్క, జ్యోతిష్యుడు వేణుస్వామి, పూసలమ్మే మోనాలిసా, అలేఖ్య పచ్చళ్లు... ఇలా చెప్పుకొంటూ పోతే ఎంతో మందికి సోషల్ మీడియాలో విశేష ప్రచారం కల్పించారు. ఇప్పుడు వారి అడ్రస్ వెదుక్కోవాల్సిన పరిస్థితి. సోషల్ మీడియాతో అట్లుంటది అని కేసీఆర్, కేటీఆర్ తెలుసుకుంటే వారికే మంచిది. రాష్ట్రం విడిపోయి పదేళ్లు దాటింది. ఇప్పుడు మళ్లీ తెలంగాణ సెంటిమెంటును రాజేయాలని అనుకోవడం కూడా విఫలయత్నమే అవుతుంది. తనను నెత్తిన పెట్టుకున్న తెలంగాణ సమాజమే గత ఎన్నికల్లో తనను కిందకు విసిరేయడానికి కారణం ఏమిటో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోకుండా సెంటిమెంటును తిరిగి రగిలించాలనుకుంటే అది వారి ఇష్టం. కేసీఆర్ కుటుంబంపై తెలంగాణ ప్రజలు ఇంకా ఆగ్రహంగానే ఉన్నారన్నది వాస్తవం. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా నేల విడిచి సాము చేస్తే ఆయాసమే మిగులుతుంది.

> **కార్పొరేట్ రంగానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ మాట్లాడటం వలన ప్రయోజనం ఏమిటో తెలియదు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? ఎన్నికల్లో ఆయన విజయాలు అందుకోవడానికి కారణం ఏమిటి? అని అధ్యయనం చేయకుండా కాలం చెల్లిన పాత చింతకాయ పచ్చడి వంటి నినాదాలను అందిపుచ్చుకోవడం అవివేకం అవుతుంది. ఈ వర్గం, ఆ వర్గం అన్న తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీకి యువ నాయకత్వం ఉండి కూడా యువతరం ఎందుకు తమకు దూరమవుతోందో గుర్తించే ప్రయత్నం చేయాలి కదా? గుజరాత్ ప్లీనరీలో ఈ దిశగా చర్చలు జరపకుండా ప్రధాని మోదీని తిట్టిపోయడం వల్ల ప్రయోజనం ఏమిటి? కాంగ్రెస్ పార్టీ చరిత్ర ఏమిటి? స్వాతంత్ర్య పోరాటంలో ఆ పార్టీ పాత్ర గురించి నేటి తరంలో ఎంత మందికి తెలుసు? ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల బలిదానాల గురించి కూడా తెలియదే! పార్టీకి దూరమైన మెజారిటీ ప్రజలతో కనెక్టయ్యే ప్రయత్నం చేయకుండా, కాంగ్రెస్ పార్టీ అందరిదీ అన్న భావనకు దూరంగా జరిగిపోవడమే ఆ పార్టీకి శాపమైంది.**

మళ్లీ అవే కుట్రలు...

ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే... మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గతంలో తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమలు చేసిన కపట నాటకాలకు, కుట్ర సిద్ధాంతాలకు మళ్లీ తెర తీశారు. తన స్వభావానికి ఏ మాత్రం సరిపడవని తెలిసి కూడా ఆయన నోటివెంట ఇటీవలి కాలంలో విలువలు, విశ్వసనీయత, పత్రికా స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులు వంటి పదాలు వినిపిస్తున్నాయి.

బాబాయ్ హత్య, కోడికత్తి, గులకరాయి వంటి కుట్ర సిద్ధాంతాలను తెరమీదకు తెచ్చి గతంలో లాభపడ్డారు. ఇప్పుడు మళ్లీ అదే చేస్తున్నారు. సత్యసాయి జిల్లా పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తలను తాను ప్రయాణించిన హెలికాప్టర్‌పైకి ఉద్దేశపూర్వకంగా ఉసిగొల్పి విండ్ షీల్డ్‌కు నష్టం చేయించారు. కూటమి ప్రభుత్వం జగన్‌కు హాని తలపెట్టిందని ఆ వెంటనే ప్రచారం మొదలెట్టారు. అధికారంలోకి రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన పరిణామాలను, కుట్ర సిద్ధాంతాలను పరిశీలిస్తే జగన్‌రెడ్డి వల్ల ఎవరికైనా హాని ఉంటుందేమోగానీ.. ఇతరుల వల్ల ఆయనకు ఎటువంటి హానీ ఉండదని చెప్పవచ్చు. గొడ్డలి వేటు వల్ల ఒళ్లంతా గాయాలై రక్తం మడుగులో వివేకానంద రెడ్డి శవంగా పడివున్నప్పటికీ గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేసినవారు మున్ముందు ఇంకెన్ని నాటకాలకు తెరలేపుతారో వేచి చూడాలి. సత్యసాయి జిల్లా పర్యటన సందర్భంగా పోలీసులను బట్టలూడదీసి నిలబెట్టి, ఉద్యోగాలు లేకుండా చేస్తానని జగన్‌రెడ్డి బెదిరించడం కూడా వివాదాస్పదం అయింది. రాజకీయ నాయకులు అధికారంలో లేనప్పుడు... అధికారులను, పోలీసులను 'మేం అధికారంలోకి వస్తే' అని బెదిరించడం పరిపాటే. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇలా బెదిరించినప్పుడు ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. అందుకు ఆయన ట్రాక్ రికార్డ్ కారణం. అదే జగన్‌రెడ్డి విషయంలో తేలికగా తీసుకోలేని పరిస్థితి. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఎదురైన అనుభవాలు ఇందుకు కారణం. ఈ కారణంగానే జగన్‌రెడ్డి 2.0 పాలన వస్తుందంటే భయపడే వారి సంఖ్య అధికంగా ఉంటోంది. జగన్‌రెడ్డి పాలనను ప్రజలు మరచిపోలేరు కనుకే ఆయన మళ్లీ అధికారంలోకి వస్తారన్న భావన వస్తేనే ఉలిక్కిపడుతున్నారు. కూటమి శ్రేణులు కూడా ఈ కారణంగానే సొంత ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అరాచకంగా ప్రవర్తించిన వారిపై ఇంకెప్పుడు చర్యలు తీసుకుంటారు? అని నిలదీస్తున్నారు. కూటమి శ్రేణులు, తెలుగు తమ్ముళ్ల ఆవేదనలో అర్థం లేకపోలేదు. పోలీసుల అదుపులో ఉన్న తెలుగుదేశం కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ దాడికి ప్రయత్నించడం, శుక్రవారం నాడు సీఐడీ విచారణకు హాజరైన మాజీ మంత్రి జోగి రమేశ్ మాట్లాడిన విధానం గమనిస్తే తెలుగు తమ్ముళ్ల ఆక్రోశంలో అర్థం ఉందని అంగీకరించక తప్పదు. నాడు చంద్రబాబు కుటుంబాన్ని, పవన్ కల్యాణ్ కుటుంబాన్ని, మరెందరో మహిళలను అవమానించిన వారిని ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి సత్కరించగా, ఇప్పుడు జగన్ భార్య భారతి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్ అనే సొంత పార్టీ కార్యకర్తను ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు చేయించారు. ఇద్దరి మధ్య ఉన్న ఈ తేడాను ప్రజలు అర్థం చేసుకోలేరా? కిరణ్ ముఖానికి పోలీసులు ముసుగు ఎందుకు వేశారో తెలియదు. కొన్ని కేసులలో విచారణ ప్రక్రియలో భాగంగా జరిగే 'ఐడెంటిఫికేషన్ పరేడ్'లో నిందితులను సాక్షులు గుర్తించాల్సి ఉంటుంది. అందుకే... అంతకుముందు వారిని ముసుగు వేసి తెస్తారు. ఇక్కడ కిరణ్ తాను తప్పు చేశానని స్వయంగా అంగీకరించినందున ముసుగు అవసరం లేదు. పోలీసుల ఓవరాక్షన్ ఇది. గోరంట్ల మాధవ్‌తో పాటు అరెస్టు చేసిన వారికి కూడా అనవసరంగా ముసుగులు వేశారు. ఇలా చేయడం గుంటూరు పోలీసుల తప్పిదమే. చేబ్రోలు కిరణ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని ఆక్షేపించని తెలుగు తమ్ముళ్లు... పోలీసులు ఆయన ముఖానికి ముసుగు వేసి అవమానించడాన్ని మాత్రం జీర్ణించుకోలేకపోయారు. దీంతో పార్టీ నాయకత్వంపై తిరగబడినంత పని చేశారు. దీన్ని బట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్ల నుంచి ఎంత ఒత్తిడి ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చు. జగన్ పాలనలో చోటుచేసుకున్న దుశ్చర్యలే ప్రస్తుత వైషమ్యాలకు కారణం!


దార్శనిక ఆర్థికవేత్త అంబేడ్కర్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదు, దార్శనిక ఆర్థికవేత్త కూడా. మన కేంద్ర బ్యాంకు అంటే ఆర్బీఐ (భారత రిజర్వ్ బ్యాంక్) వ్యవస్థాపనకు ఆయన అర్థశాస్త్ర విద్వత్తు విశేషంగా దోహదం చేసింది. భారతదేశానికి ఒక కేంద్ర బ్యాంక్ (ఇదే తదనంతర కాలంలో ఆర్బీఐగా మారింది) నేర్పాటు చేయాలని 1926లో బ్రిటిష్ వైస్రాయి లార్డ్ రీడింగ్‌కు సిఫారసు చేసిన రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్ (హిల్టన్ యంగ్ కమిషన్‌గా సుప్రసిద్ధమైనది) మన దేశంలో పర్యటించినప్పుడు ఆ కమిషన్ సభ్యులు ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ పరిశోధనా గ్రంథం 'ది ప్రాబ్లెమ్ ఆఫ్ రూపీ'ని ప్రమాణంగా తీసుకోవడం గమనార్హం. భారతదేశానికి ఒక కేంద్ర బ్యాంకు ఏర్పాటు ఆవశ్యకతను వారు ఆ పుస్తకం ఆధారంగా నొక్కి చెప్పారు.

అంబేడ్కర్ మేధో కృషిలో అంతర్భాగంగా ఉన్న సుస్థిరాభివృద్ధి సూత్రాలు ఆయన ఆర్థిక దార్శనికతకు మరొక విశిష్ట తార్కాణం. ఆయన రచనలు, ఉపన్యాసాలు, ఉద్యమాలకు సైతం ఆ దార్శనికత ఒక స్ఫూర్తిగా ఉన్నది. ప్రత్యేకించి ఆయన అర్థశాస్త్ర పరిశోధనలను వర్తమాన భారతదేశం అధ్యయనం చేయవలసిన అవసరమున్నది. నేటి వికసిత్ భారత్ లక్ష్యాలకు ఆయన ఆలోచనలు సమతూకంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ విద్యతో చైతన్యాన్ని, సాధికారతను సాధిస్తారని ఆయన నినదించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికై సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధిపై దృష్టి సారించి ఆయన పరిశోధనలు చేశారు. వెనుకబడిన వర్గాల వారి హక్కుల పరిరక్షణకు ప్రపంచ వేదికల మీద ఉపన్యసించారు. ఎదురైన ప్రతి ప్రశ్నకు దీటుగా సమాధానం చెప్పారు. వీటిని గ్రంథస్థం చేశారు. అలా వెలుగు చూసిన గ్రంథమే 'అన్నిలేషన్ ఆఫ్ క్యాస్ట్' (కుల నిర్మూలన). కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి కామర్స్, పొలిటికల్ ఎకానమీలలో ఆయన డాక్టరేట్ డిగ్రీలు పొందారు. దక్షిణాసియా నుంచి ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ డిగ్రీ పొందిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. అంతేకాదు ఆయన బహుభాషా కోవిదుడు. ఇంగ్లీషు, పాళీ, సంస్కృతం, హిందీ, మరాఠీ, బెంగాలీ, కొంకిణి భాషల మీద సాధికారత ఉన్న విద్వజ్ఞుడు. భారతీయ ప్రాచీన సాహిత్యాన్ని ప్రగాఢంగా అధ్యయనం చేశారు. కనుకనే బ్రిటీష్ పాలకుల ముందు భారతీయ సమాజాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించగలిగారు.

రిజర్వ్ బ్యాంక్ వ్యవస్థాపనకు స్ఫూర్తినిచ్చిన తన పరిశోధనా గ్రంథాలు 'ది ప్రోబ్లమ్ ఆఫ్ రూపీ', 'నేషనల్ డివిడెండ్ ఆఫ్ ఇండియా'లో భూ సంస్కరణలు, బంగారం విలువను నిర్ధారించే ప్రమాణాలు, ద్రవ్య విధానాలు మొదలైన అంశాలను అంబేడ్కర్ విపులంగా చర్చించారు.

> **భారతదేశానికి ఒక కేంద్ర బ్యాంక్ (ఇదే తదనంతర కాలంలో ఆర్బీఐగా మారింది) ఏర్పాటు చేయాలని 1926లో బ్రిటిష్ వైస్రాయి లార్డ్ రీడింగ్‌కు రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్ సిఫారసు చేసింది. డాక్టర్ అంబేడ్కర్ పరిశోధనా గ్రంథం 'ది ప్రాబ్లెమ్ ఆఫ్ రూపీ' ఆధారంగానే కమిషన్ ఆ నిర్ణయానికి వచ్చింది.**



పౌరుల ప్రాథమిక హక్కుల రక్షణ విషయమై రాజ్యాంగపరిషత్తు సమావేశాల్లో ఆయన సమగ్రంగా చర్చించారు. ముసాయిదా కమిటీ అధ్యక్షునిగా బ్రిటీష్ పాలకులను, నాటి జాతీయ కాంగ్రెస్, ఇతర సభ్యులను ఒప్పించి ప్రాథమిక హక్కులకు హామీపడుతున్న అధికరణలు, నిబంధనలను పొందుపరచగలిగారు. అసమానతలను రూపుమాపడానికి ఉపాధి, విద్యా రంగాల్లో, ఎస్సీ, ఎస్టీ కులాలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన పట్టుబట్టి సాధించారు. ఈ స్ఫూర్తితోనే బీసీలకు, మహిళలకు, మైనారిటీలకు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. రాజ్యాంగంలో 15 అధికరణ మతం, జాతి, కులం, లింగం, జన్మస్థలం ఆధారంగా వివక్షను నిషేధిస్తుంది. 1951 తొలి రాజ్యాంగ సవరణ చట్టం తీసుకొచ్చి మహిళలు, వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాల, తెగల అభివృద్ధి కోసం ప్రత్యేక నిబంధనలు తీసుకురావడానికి రాష్ట్రానికి అధికారం ఇచ్చారు. ఇవన్నీ చూస్తుంటే అంబేడ్కర్ ఈ దేశ ప్రజలకు మంచి భవిష్యత్తును నిర్మించేందుకు ఎంత దూరదృష్టితో ఆలోచించారో స్పష్టమవుతుంది. డాక్టర్ అంబేడ్కర్ భారతీయ ఆర్థికశాస్త్రాన్ని కొత్త సామాజిక, రాజకీయ దృక్పథంతో సమున్నతం చేశారు. సమ్మిళిత ఆర్థికాభివృద్ధి సాధనలో రాజ్యం పాత్రను, రాజ్యాంగ పద్ధతుల ప్రాధాన్యాన్ని సమగ్రంగా వివరించారు. నియంతృత్వ పాలనను, హింసాత్మక పద్ధతులను గట్టిగా వ్యతిరేకించారు.

ప్రత్యేకించి నిమ్నకులాలవారు ప్రజాస్వామ్య పంథా అనుసరించాలని అంబేడ్కర్ నొక్కి చెప్పారు. మహారాష్ట్రలో వామపక్ష తీవ్రవాద భావజాలంతో 1972లో వచ్చిన దళిత్ పాంథర్స్ ఉద్యమం నిలబడలేదు. మానవతావాదం, వ్యక్తి స్వేచ్ఛలకు ఎక్కడా భంగం వాటిల్లకూడదని ఆయన హెచ్చరించారు. 1947లో 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' పేరు మీదుగా బ్రిటిష్ ప్రభుత్వానికి సమర్పించిన మెమోరాండంలో భారతదేశ ఆర్థిక అభివృద్ధికి ప్రయోజనాత్మక వ్యూహ రచన చేశారు. ప్రైవేట్ సంస్థలకు మార్గాలను మూసివేయకూడదని గట్టిగా చెప్పారు. దీనికి తగిన విధంగా ప్రజల ఆర్థిక జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. సంపద సమాన పంపిణీ బాధ్యతను రాజ్యం చేపట్టాలన్నారు. వర్గరహిత సమాజాన్ని ఆశించారు. రాజ్యరహిత సమాజాన్ని నిరసించారు. ఈ విషయంలో ఆయన ప్రపంచ మేధావుల మెప్పుపొందారు. వ్యవసాయరంగ సమస్యల పరిష్కారానికి శాస్త్రీయమైన సూచనలు చేశారు. రైతు సహకార సంఘాలను ఏర్పాటు చేసి భూ కమతాలను ఏకీకృతం చేయాలన్నారు. దీంతో వ్యయాన్ని తగ్గించి, ఉత్పత్తి పెంచవచ్చని అన్నారు. వ్యవసాయ రంగంలోని మిగులు శ్రామికులను పారిశ్రామిక రంగంలో ఉపయోగించుకోవాలని ఆయన పదేపదే చెప్పారు. పారిశ్రామికీకరణ పురోగతి వ్యవసాయ రంగంపై భారాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఈ రెండు రంగాల వృద్ధి ఆధారంగా మూడో రంగం అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు అంబేడ్కర్ నిర్దేశించిన దారిలోనే పయనిస్తున్నాయి.

▪ డాక్టర్ జీకేడీ ప్రసాదరావు
ఫ్యాకల్టీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం
(రేపు అంబేడ్కర్ జయంతి)


Built so strong, the stars followed.
Kia Syros rated 5-star safe by BNCAP.
BHARAT NCAP
BHARAT NEW CAR ASSESSMENT PROGRAMME
BHARAT NCAP
30.21/32.00 (Adult Occupant Protection)
44.42/49.00 (Child Occupant Protection)
Experience the ultimate blend of structural strength and intuitive safety.
Syros
Movement that inspires
Introductory price starts at ₹8 99 900*
Kia Syros
Evolved by the future
At Kia, safety isn't just a feature, it's our promise. The new Syros raises the bar with a bold design, cutting-edge technology, first-of-its-kind features and advanced safety. And now with a 5-star BNCAP rating, it goes on to prove that the new Syros is not just built to impress, but is a complete package.
Enhanced Protection
Safety, reimagined
ADAS~ Level 2.0
6 Airbags Standard
Robust 20 Standard Safety Features
Smart Dashcam with Dual Camera
360 Degree Camera with Blind View Monitor
Innovative Technology
Future, reimagined
Dual Pane Panoramic Sunroof
FIRST-IN-SEGMENT
2nd Row Seat Reclining & Sliding with Seat Ventilation (Seats Only)
BEST-IN-SEGMENT
76.20 cm (30") Trinity Panoramic Display Panel
FIRST-IN-SEGMENT
Kia Connect 2.0** with Over-the-Air (OTA) Software Updates and Other 80+ Connected Car Features
Harman Kardon Premium 8 Speakers Sound System
Electric Parking Brake with Auto Hold
Book now
Call 1800 108 5000
093195 91407
Visit www.kia.com
Kia Syros
Terms & Conditions Apply. *Ex-showroom price all India. Segment is defined as vehicle with length between 3 990 mm – 3 999 mm and height - 1 680 mm. **Kia Connect 2.0 comes with 3 years free subscription. Kia Connect 2.0 features may vary depending on the variant, device compatibility, software and network availability in the vehicle. ~Advanced Driver Assistance System (ADAS) is not a substitute for human eye and driver vigilance. It is an assistance feature that enhances driving experience and safety. Effectiveness of ADAS may vary based on actual situation and all objects around vehicle may not be detected. The driver shall remain responsible for safe, vigilant, and attentive driving. The product & feature images shown in this advertisement are for representation purposes only. Color, features and specifications as shown may not be part of standard fitment and may vary or differ slightly depending on models/variants from the one shown in this advertisement. Model shown is subject to availability and may not be available across all variants. Kia India Pvt. Ltd. (Formerly known as Kia Motors India Private Limited) reserves the right to make any changes with respect to the trims, colors, specifications, other details of any model as mentioned or to discontinue any model without prior notice. For more details visit your local Kia dealership. Kia India Pvt. Ltd. urges you to follow traffic rules, these are meant to keep you safe on roads. We do not endorse vandalism or illegal activities related to road safety. Safety is a top priority, and we urge responsible behavior regarding traffic regulations and road safety.
FOR INFORMATION CONTACT: ANDHRA PRADESH: VIJAYAWADA: SIMHA KIA, PH: 8688836501, CASA KIA, PH: 8345959595, ANANTAPUR: MGB KIA, PH: 8333929195, BHIMAVARAM: SIMHA KIA, PH: 8688836542, CUDDAPPAHA: HOSHI KIA, PH: 9100773485, GUNTUR: SIMHA KIA, PH: 8688836566, KAKINADA: KANTIPUDI KIA, PH: 7799740208, KURNOOL: MGB KIA, PH: 8500963906, NELLORE: HOSHI KIA, PH: 8688829718, RAJAHMUNDRY: KANTIPUDI KIA, PH: 7799740208, TIRUPATI: HOSHI KIA, PH: 8688829739, VISHAKHAPATNAM: LAKSHMI KIA, PH: 7997815777, ONGOLE: SANKAR KIA, PH: 8886624966, SIMHA KIA: KUNCHANAPALLI, PH: 7799981582, TELANGANA: HYDERABAD: LANDMARK KIA, MEDIPALLY, PH: 9281428303, BOWENPALLY, PH: 9347997583, AUTOMOTIVE KIA, KONDAPUR, PH: 7995699908, NAGOLE, PH: 7995999404, RC PURAM, PH: PH: 6309908117, AS RAO NAGAR, PH: 6309908118, CAR KIA, FINANCIAL DISTRICT, PH: 7330888041, JUBILEE HILLS, PH: 7997858880, GACHIBOWLI: PH: 7799906846, MALIK KIA, KUKATPALLY, PH: 7399346666, HIMAYATHNAGAR, PH: 7995999340, 7399386666, PROSPERA KIA, MALAKPET, PH: 08047361555, KARIMNAGAR: MALIK KIA, PH: 7730911111, KHAMMAM: AUTOMOTIVE KIA, PH: 6309908189, MAHBUBNAGAR: AUTOMOTIVE KIA, PH: 6309908110, NALGONDA: AUTOMOTIVE KIA, PH: 6309908183, NIZAMABAD: SUNRISE KIA, PH: 7995939995, SECUNDERABAD: AUTOMOTIVE KIA, PH: 7995999146, WARANGAL: MALIK KIA, PH: 9703433333, MANCHERIAL: SUNRISE KIA, PH: 7416662030
INNOCEAN-018/25







రావయ్యా అంజని తనయా!



చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'విశ్వంభర. యూవీ క్రియేషన్స్ బేనర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ భారీ బడ్జెట్‌తో గ్రాండియర్‌గా నిర్మిస్తున్నారు. చిత్రబృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టింది. హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం 'విశ్వంభర' నుంచి తొలి గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. సీతారాముల కల్యాణం నేపథ్యంలో సాగే గీతమిది. 'రామ రామ' అంటూ మొదలైన ఈ గీతం శ్రీరాముని పట్ల హనుమంతుడికి ఉన్న అచంచలమైన ప్రేమ, భక్తిని వివరిస్తూ సాగుతుంది. ఎంఎం కీరవాణి స్వరకల్పన చేయగా, శంకర్ మహదేవన్, లిప్సిక ఆలపించారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ పాటలో చిరంజీవి సంప్రదాయ దుస్తుల్లో సరికొత్త లుక్‌తో ఎనర్జిటిక్‌గా కనిపించారు. ఆయన స్టెప్పులు గ్రేస్‌ఫుల్‌గా ఉన్నాయి. ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. కునాల్ కపూర్ కీలకపాత్ర పోషిస్తున్నారు.



కల్యాణ్‌రామ్ కెరీర్‌లో గొప్ప చిత్రమిది

ఎన్టీఆర్

'మా అన్న కల్యాణ్‌రామ్ నటించిన 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమా కార్యక్రమానికి అతిథిగా వచ్చినందుకు ఆనందంగా ఉంది. ప్రతి సారీ అభిమానులను కాలర్ ఎగరేయమని నేను చెబుతుంటాను. కానీ ఈసారి కల్యాణ్ రామ్ అన్నను కాలర్ ఎగరేయమని చెబుతున్నాను. ఆయన సినీ జీవితంలో మైలురాయిగా నిలిచిపోయే చిత్రం ఇది' అని జూనియర్ ఎన్టీఆర్ అన్నారు. కల్యాణ్‌రామ్ హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 18న విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ 'నేను ఈ సినిమా చూశాను. ప్రేక్షకుడిగా ఎంజాయ్ చేశాను. విజయశాంతి గారు లేకపోతే ఈ చిత్రం లేదు. క్లైమాక్స్‌లో 20 నిమిషాలు ప్రేక్షకుల కళ్లలో నీళ్లు తిరుగుతాయి. అన్నయ్య, విజయశాంతి గారివల్లే ఈ సినిమా ఇంత గొప్పగా వచ్చింది' అని అన్నారు. కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ 'ఈ సినిమా గురించి ఇప్పుడు మాట్లాడడం కన్నా సక్సెస్‌మీట్‌లో మాట్లాడడం సమంజసం అనుకుంటున్నాను. కొన్ని సినిమాలే మనసులో నిలిచిపోతాయి. ఇది కూడా అలాంటి సినిమా అవుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. విజయశాంతి మాట్లాడుతూ 'ఇందులో ఒక తల్లి పడే ఆరాటం, కొడుకు చేసే పోరాటం ఆకట్టుకుంటుంది. చాలా సంవత్సరాల నుంచి మంచి సినిమా చేయమని అభిమానులు అడుగుతున్నారు. అలాంటి పాత్ర కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఈ సినిమా అవకాశం వచ్చింది. షూటింగ్ సమయంలోనే సూపర్‌హిట్ అవుతుందనే నమ్మకం కలిగింది. మాతృమూర్తులందరికీ ఈ సినిమా అంకితం' అని అన్నారు. నిర్మాత అశోక్ వర్ధన్ ముప్పా మాట్లాడుతూ 'ఈ చిత్రం కోసం కల్యాణ్‌రామ్ రెండేళ్లు కష్టపడ్డారు. విజయశాంతి గారి నటన ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ' అని చెప్పారు. ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ 'ఈ చిత్రంలో ఒక బాధ్యతాయుతమైన పాత్రలో కల్యాణ్‌రామ్ నటించారు' అని తెలిపారు.

జాన్వీ కపూర్‌కు ఖరీదైన కానుక



బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కార్ల కలెక్షన్స్‌లో మరో లగ్జరీ కారు చేరింది. జాన్వీ స్నేహితురాలు, ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార్ మంగళం బిర్లా పెద్ద కుమార్తె అనన్య బిర్లా రూ.5 కోట్ల విలువైన లంబోర్ఘిని కారును కానుకగా ఇచ్చారు. ఈ కారు శుక్రవారం ఉదయం జాన్వీ నివాసానికి చేరుకుంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కారుతోపాటు మరో గిఫ్ట్ ప్యాక్‌ను కూడా అనన్య పంపించారు. దానిపై 'ప్రేమతో నీ అనన్య' అని రాసి ఉంది. కాగా, ఇటీవలె అనన్య బ్యూటీ ప్రొడక్ట్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టినట్లు ప్రకటించారు. ఈ బ్రాండ్‌కు జాన్వీ కపూర్ ప్రచారకర్తగా వ్యవహరించనున్నట్లు సమాచారం. తన బ్రాండ్ కోసం జాన్వీ సహకరిస్తున్నందుకు కానుకగా అనన్య ఖరీదైన కారును బహూకరించారని బాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి.



మధురానుభూతినిస్తుంది


'దీయా' ఫేమ్ పృథ్వీ అంబర్ ప్రధానపాత్రలో సాయిరాజేశ్ మహదేవ్ తెరకెక్కించిన చిత్రం 'డియర్ ఉమ'. సుమయ రెడ్డి హీరోయిన్‌గా నటించి నిర్మించారు. ఈ నెల 18న సినిమా విడుదలవుతోంది. కమల్ కామరాజు, సప్తగిరి, అజయ్ ఘోష్, ఆమని తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇటీవలె విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్ ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత, హీరోయిన్ సుమయ రెడ్డి మాట్లాడుతూ "మంచి కంటెంట్‌తో చేసిన విభిన్నమైన ప్రయత్నం ఇది. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని అన్నారు. "ప్రేక్షకులకు మధురానుభూతినిచ్చే సినిమా ఇది" అని హీరో పృథ్వీ అంబర్ చెప్పారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటా

హృతిక్ రోషన్



హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వార్-2'. కియారా అద్వానీ హీరోయిన్. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న హృతిక్ రోషన్ సినిమా విశేషాలను వివరిస్తూ ఎన్టీఆర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జూనియర్ ఎన్టీఆర్‌తో పనిచేయడం వల్ల ఎన్నో కొత్త విషయాలు నేర్చుకొన్నాను. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటా. 'వార్-1'తో పోల్చితే రెండో భాగం భారీగా ఉంటుంది. ఈ చిత్ర నిర్మాణం సులభంగా పూర్తయ్యింది. నిర్మాత ఆదిత్య చోప్రా, దర్శకుడు అయాన్ ముఖర్జీ వల్లే ఇది సాధ్యమైంది. ఈ మూవీ చేసినందుకు చాలా గర్వంగా ఉంది' అని పేర్కొన్నారు.

ఇరు కనులు కలిసి మురిసే



రాజేంద్ర ప్రసాద్, అర్చన కాంబినేషన్‌లో రూపేశ్, ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా పవన్ ప్రభ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'షష్టిపూర్తి'. మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేశ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'ఇరు కనులు కలిసి మురిసే.. మొదటి చూపులో..' అనే గీతాన్ని హీరో రవితేజ ఆవిష్కరించారు. రెహమాన్ రాసిన ఈ పాటకు ఇళయరాజా సంగీతం అందించారు. ఎస్పీ చరణ్, విభావరి ఆలపించారు.

మాట నిలబెట్టుకున్నాం

\- ప్రదీప్



'ఫస్ట్ ఫ్రేమ్ నుంచి లాస్ట్ ఫ్రేమ్ వరకూ ప్రేక్షకుల పెదాల మీద నవ్వు ఉంటుందని ప్రామిస్ చేశాం. దాన్ని నిలబెట్టుకున్నాం. ఆడియన్స్ థియేటర్‌లో నవ్వుతుంటే ఆనందంతో మా కడుపు నిండిపోయింది. మమ్మల్ని నమ్మి థియేటర్‌కు వస్తున్న ప్రేక్షకులకు థాంక్స్' అన్నారు ప్రదీప్ మాచిరాజు. ఆయన హీరోగా నటించిన 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం విడుదలైన సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. సినిమా విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. తమ జీవితాల్లో ఇది మరుపురాని రోజు అని పేర్కొన్నారు. మంచి తెలుగు సినిమా చూసి నవ్వుకుందాం అని భావించే వారికి ఆయన ఈ సందర్భంగా థియేటర్‌కు రండంటూ ఆహ్వానం పలికారు. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు దర్శక ద్వయం నితిన్, భరత్ కృతజ్ఞతలు తెలిపారు. 'కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మంచి సమ్మర్ ఎంటర్‌టైనర్. అందరూ ఫ్యామిలీతో థియేటర్‌కు రండి. కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు' అని మైత్రీ మూవీ మేకర్స్ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి చెప్పారు.

కడుపుబ్బా నవ్వించే చిత్రం



నూతన నటుడు పవన్‌కల్యాణ్ తెరంగేట్రం చేస్తున్న చిత్రం 'పురుష'. ఈ సినిమాను వీరు ఉలవల దర్శకత్వంలో బత్తుల కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాను ప్రారంభించారు. 'మళ్లీరావా', 'జెర్సీ' ఫేమ్, దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కామెడీ ప్రధానంగా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ తెలిపారు.





ఇంటర్‌లో ఉయ్యూరు 'విశ్వశాంతి' విజయకేతనం



తుమ్మలచర్ల హారిక

ఉయ్యూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మొదటి, రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉయ్యూరులోని విశ్వశాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్టు విద్యాసంస్థ ప్రతినిధులు శనివారం తెలిపారు. రెండవ సంవత్సరం ఎంపీసీలో తమ విద్యార్థిని టి.హారిక 989 మార్కులు సాధించిందని, ఈమె ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్ ఫస్ట్ సెషన్స్‌లో 99.93 శాతం మార్కులు కైవసం చేసుకుందని పేర్కొన్నారు. వి.కృష్ణప్రసాద్986 మార్కులు, కె.సాగర్‌బాబు, సొంఠి గుణశ్రీ, ఈ.ఆదిత్యరామ్ 985 మార్కులు సాధించినట్టు తెలిపారు. ఎంపీసీలో 36మంది విద్యార్థులు 975 మార్కులకు పైగా సాధించారని వెల్లడించారు. బైపీసీలో సి.హెచ్.ప్రణీత 984మార్కులు, బి.త్రిలోక్య 980 మార్కులు సాధించినట్టు తెలిపారు. ఈ గ్రూపులో 12మంది విద్యార్థులు 975 పైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను విశ్వశాంతి చైర్మన్ మాదాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ మాదాల సూర్యశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

విజ్ఞాన్ ప్రభంజనం



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో శనివారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో వి.కౌశిక్ (992) మార్కులు, ఎం.అఖిలేష్ (989), జీ.నాగేంద్ర గుప్త (989), ఎన్.నాగ మోక్షజ్ఞ(989)తో పాటు 56 మంది 980 మార్కులు పైగా సాధించారని వెల్లడించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎస్‌డీ మహమ్మద్ అష్రఫ్ (465) మార్కులు, టీడీఎస్ఎన్‌పీ లక్ష్మణ్ నారాయణ (465), పీ.పూజిత (465)తో పాటు 45 మంది విద్యార్థులు 460 మార్కులకు పైగా సాధించారని తెలిపారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య ప్రత్యేకంగా అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో నారాయణ రికార్డు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు రికార్డుల మోత మోగించాయని నారాయణ గ్రూప్ డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. జూనియర్ ఎంపీసీలో స్టేట్ ఫస్ట్ మార్కులు 468తో ఒకరు, 467 మార్కులు ఆపైన 8మంది, 466 మారులు ఆపైన 55మంది, 465మార్కులు ఆపైన 293 మంది, 460 మార్కులు ఆపైన 2,761 మంది, జూనియర్ బైపీసీలో నలుగురు 436మార్కులు, 27మంది 435 మార్కులు, సీనియర్ ఇంటర్‌లో ముగ్గురు 992 మార్కులు, 39 మంది 990 మార్కులు, 93 మంది 989 మార్కులు, 181మంది 988 మార్కులు, 278 మంది 987 మార్కులు సాధించినట్టు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్కులు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు స్టేట్ టాప్ మార్కులు సాధించారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ తెలిపారు. జూనియర్ ఎంపీసీలో బుక్కే యశ్వంత్ నాయక్, ముంద్రు వినూతన స్టేట్ టాప్ మార్కులు 467తోపాటు, 48 మంది 466 ఆపైన, 291 మంది 465 ఆపైన, 2,628 మంది 460 ఆపైన మార్కులు సాధించారని పేర్కొన్నారు. జూనియర్ బైపీసీలో చల్లా లేఖన స్టేట్ ఫస్ట్ మార్కులు 437తోపాటు 16 మంది 436 ఆపైన, 109 మంది 435 ఆపైన, 834 మంది 430 ఆపైన, సీనియర్ ఎంపీసీలో కాంచన మానస, గంగవరం లహరి, కూర్మదాసు శ్రీజ స్టేట్ ఫస్ట్ మార్కులు 992, సీనియర్ బైపీసీలో షేక్ అఫీఫా తబస్సుం స్టేట్ టాప్ మార్కులు 992 సాధించినట్టు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 992 ఆపైన నలుగురు, 991 ఆపైన 17 మంది, 990 ఆపైన 45 మంది, 985 ఆపైన 625 మంది, 980 ఆపైన 1,800 మంది, 900 ఆపైన 24,331 మంది సాధించినట్టు పేర్కొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన భాష్యం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంటర్ ఫలితాలలో భాష్యం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. జూనియర్ ఎంపీసీలో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు ఎన్.శ్రీరామ్, డి.మణికంఠ, కె.చిన్మయిగౌడ్, యాసిన్ సాజిద్, పి.సంజయ్ 470 మార్కులకు 466 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఎంపీసీలో మొత్తం 420 మంది విద్యార్థులు 460కి పైగా మార్కులు సాధించారని తెలిపారు. సీనియర్ ఎంపీసీలో ఎన్.జయశ్రీ 1000కి 991 మార్కులు, జె.తారణి, కె.కావ్యశ్రీ 990 మార్కులు సాధించారన్నారు. సీనియర్ విభాగంలో మొత్తం 218 మంది విద్యార్థులు 980కి పైగా మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ బైపీసీ విభాగంలో భాష్యం మెడెక్స్ విద్యార్థి ఎ.ప్రమోద లక్ష్మి 440కి 436 మార్కులు, పది మంది విద్యార్థులు 435 మార్కులు సాధించారని చెప్పారు. మొత్తం 84 మంది విద్యార్థులు 430కి పైగా మార్కులు సాధించారన్నారు. సీనియర్ బైపీసీ విభాగంలో జి.హాసిని, వై.నాగశరణ్య 1000కి 989 మార్కులు, ఎల్.నవ్య, షేక్ వసీమా, బి.భవ్య 988 మార్కులు సాధించారని తెలిపారు.



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ఆచార్య పి.నాగభూషణ్

వీశాట్ 1 ఫలితాలు విడుదల

» 16 నుంచి 20 వరకు కౌన్సెలింగ్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్స్ యూనివర్సిటీకి సంబంధించి బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చరల్, ఫార్మా డీ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్1 (విజ్ఞాన్ స్కోలాస్టిక్ యాప్టిట్యూడ్ టెస్ట్) ఫలితాలను శనివారం వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ విడుదల చేశారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ, హైదరాబాద్ దేశ్‌ముఖి సమీపంలోని విజ్ఞాన్ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్‌లో ప్రవేశాల కోసం ఈ ఏడాది నిర్వహించిన వీశాట్ 1కి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఏపీ, తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు వీశాట్‌కు హాజరైనట్టు చెప్పారు. వీశాట్ 2025 ర్యాంకులతో పాటు జేఈఈ మెయిన్స్ ఫలితాలు, ఎంసెట్ ర్యాంకులు, ఇంటర్మీడియట్ మార్కులను కూడా పరిగణనలోనికి తీసుకుని స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. ఈ నెల 16 నుంచి 20 వరకు మొదటి విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కాగా.. వీశాట్‌లో తొలి పది ర్యాంకులు కే.రవితేజ (అనంతపురం), నాగెండ్ల సస్వత్ ప్రణయ్ (నరసరావుపేట), ఆర్.సాయి తేజ (వరంగల్), కె.మహేష్(విశాఖపట్నం), కె.ప్రియతం కార్తీక్ (విజయవాడ), ఎ.సాయి సంతోష్‌రామ్(ఏలూరు), కొప్పుల హర్షిల్(కృష్ణా జిల్లా), ఎ.దేవి శ్రీ చరిత్ (మార్టూరు), షేక్ సమీర్ బాబు(గుంటూరు), యు.డోలామణి సత్యనాగశంకర్(రాజోలు, కోనసీమ జిల్లా) సాధించారని డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ క్రిష్ణకిశోర్ తెలిపారు. వీశాట్ 2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉన్నాయని, విద్యార్థుల సెల్‌ఫోన్లకూ ర్యాంకుల వివరాలను పంపిస్తామన్నారు.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది గ్లాస్ డోమ్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 15
ది హోస్టేజ్	ఒరిజినల్ మూవీ	ఏప్రిల్ 18
అమెజాన్ ప్రైమ్		
గాడ్‌ఫాదర్ ఆఫ్ హార్లెం	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 13
ఖౌఫ్	హిందీ సిరీస్	ఏప్రిల్ 18
జియో హాట్‌స్టార్		
ది లాస్ట్ ఆఫ్ అజ్ 2	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 14
ది స్టోలెన్ గర్ల్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 16
సోనీ లివ్		
చమక్: ది కంక్లూజన్	హిందీ సిరీస్	ఏప్రిల్ 14





ఖౌఫ్

హారర్ చిత్రాలు, వెబ్‌సిరీస్‌లకు ఇటీవల కాలంలో ప్రేక్షకాదరణ అమితంగా దక్కుతోంది. ఈ కోవలో వస్తోన్న మరో భయానక బీభత్స ప్రధానమైన హిందీ సిరీస్ 'ఖౌఫ్'. ఓ మహిళల హాస్టల్‌లో జరిగే సంఘటనల నేపథ్యంలో తెరకెక్కిన సూపర్ నేచురల్ హారర్ సిరీస్ ఇది. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే కోరికతో ఢిల్లీ వచ్చిన మాధురి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో సాగుతుంది.

ఓ పాడుపడిన హాస్టల్‌లో చేరినప్పటి నుంచి ఆమె జీవితం నరకప్రాయమవుతుంది. అక్కడి నుంచి బయటపడేందుకు ఆమె చేసే ప్రయత్నాలు మరింత కష్టాల్లోకి నెడతాయి. హాస్టల్ గేట్ దాటి బయట అడుగుపెట్టలేని నిస్సహాయ పరిస్థితుల్లో చివరకు ఏం జరిగింది అనేది కథ. హారర్ ప్రియులకు కొత్త తరహా అనుభూతిని ఇచ్చేలా 'ఖౌఫ్' తెరకెక్కిందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.





మాది... 'విశ్వశాంతి' పథం

మొదట అనుకున్నది డాక్టర్ కావాలని.
కాలేజీలో నాటకాలు వేశాక మనసు నటన వైపు మళ్లింది.
ఆ రెండూ నెరవేరలేదు కానీ... విద్యావేత్తగా ఆయన మరో ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు.
ప్రపంచ శాంతి స్ఫూర్తితో... రేపటి తరాన్ని ఉన్నతంగా నిలపాలన్న లక్ష్యంతో...
'శ్రీ విశ్వశాంతి'కి శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా... దేశవ్యాప్తంగా వేలమంది విద్యార్థులను విశ్వ విజేతలుగా తీర్చిదిద్దుతున్నారు.
'శ్రీ విశ్వశాంతి' 50వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా... విద్యా శిఖరం...
ఆ సంస్థల చైర్మన్... మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావును 'నవ్య' పలుకరించింది.

"కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం గండిగుంట మా స్వగ్రామం. మాది సాధారణ రైతు కుటుంబం. నాన్న శేషగిరిరావు, అమ్మ కమలా మనోహరి. కుటుంబంలో నేను మూడోవాడిని. నాన్న మాకు ఉన్న రెండెకరాల పొలాన్ని సాగు చేసేవారు. కుటుంబ పోషణకు దాని మీద వచ్చే సంపాదన సరిపోకపోవడంతో వల్లభనేని లక్ష్మీనారాయణ అనే భూస్వామి దగ్గర నౌకరీకి వెళ్లేవారు. దీనికి నెలకు రెండు బస్తాల ధాన్యం ఇచ్చేవారు. అమ్మ ఈ ధాన్యాన్ని... మిల్లు పట్టించి, కుటుంబానికి సరిపడా బియ్యం ఉంచుకుని, మిగిలింది అమ్మేది. నా పాఠశాల విద్యాభ్యాసం అద్దాడలోని అమ్మమ్మ ఇంటి వద్ద సాగింది. అక్కడ తొమ్మిదో తరగతి వరకు చదువుకున్నా. అప్పట్లో ట్యూషన్ చెప్పినందుకు నెలకు మూడు రూపాయల ఫీజు తీసుకునేవారు. ఆ డబ్బులు చెల్లించే స్తోమత కూడా మాకు లేదు. అమ్మమ్మ, తాతయ్య... ట్యూషన్ మాస్టారు వద్దకు వెళ్లి ఆ ఫీజు ఇచ్చుకోలేమని చెప్పడంతో ఆయన నాకు ఉచితంగా పాఠాలు బోధించారు. తర్వాత ఎస్ఎస్ఎల్‌సీని ఉయ్యూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పూర్తి చేశాను.

■ కొడుకుతో డిగ్రీ తరగతులకు...

జమ్మిగొలివేపల్లి... ఉయ్యూరుకు 12 కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామం. అక్కడి నుంచి స్కూల్‌కు వచ్చే ప్రమీలరాణి నా జీవిత భాగస్వామి అవుతుందని అనుకోలేదు. ఐదో తరగతిలో తనతో పరిచయం ఏర్పడింది. ఎస్ఆర్ఆర్ కాలేజీలో పీయూసీలో సీటు రావడంతో విజయవాడకు వచ్చేశాను. గుణదలలో అక్క ఇంట్లో ఉంటూ పీయూసీ పూర్తి చేశాను. సీటు ఎస్ఆర్ఆర్ కాలేజీలో వచ్చినా చదువంతా ఆంధ్రా లయోలా కాలేజీ లెక్చరర్ల వద్ద సాగింది. ప్రమీలకు స్టెల్లా కాలేజీలో బీఏ సీటు రావడంతో తను కూడా విజయవాడకు వచ్చింది. హాస్టల్‌లో ఉంటూ నా యోగక్షేమాలను తెలుసుకోవడానికి ఉత్తరాలు రాసేది. ఆదివారాల్లో హాస్టల్‌కు వెళ్లి ప్రమీలతో మాట్లాడేవాడిని. తర్వాత ఇద్దరం కలిసి చదువుకోవాలని నిర్ణయించుకున్నాం. అప్పట్లో మచిలీపట్నంలోని హిందూ కాలేజీలో కో-ఎడ్యుకేషన్ ఉండేది. ఇద్దరం కలిసి హిందూ కాలేజీలో చేరాం. అక్కడ ఒక గది అద్దెకు తీసుకున్నాం. అద్దె నెలకు రూ.25. ప్రమీలతో పరిచయం ఏర్పడిన పదకొండేళ్లకు మేమిద్దరం పెళ్లి చేసుకున్నాం. అప్పట్లో ప్రేమ పెళ్లంటే గ్రామాల్లో చాలా విచిత్రంగా చూసేవాళ్లు. ప్రమీల కుటుంబానికి, మా కుటుంబానికి పరిచయం ఉండడంతో ప్రేమ విషయాన్ని పెద్దలకు చెప్పాం. ఇద్దరిదీ ఒకే కులం కావడం మాకు కలిసివచ్చింది. డిగ్రీ రెండో సంవత్సరంలో మాకు ఒక బాబు పుట్టాడు. తోటివాళ్లంతా పుస్తకాలతో క్లాస్‌లకు వస్తే... మేం మాత్రం మా బాబుతో వెళ్లేవాళ్లం.



అప్పట్లో మచిలీపట్నంలోని హిందూ కాలేజీలో కోఎడ్యుకేషన్ ఉండేది. ఇద్దరం కలిసి హిందూ కాలేజీలో చేరాం. అక్కడ ఒక గది అద్దెకు తీసుకున్నాం. అద్దె నెలకు రూ.25. ప్రమీలతో పరిచయం ఏర్పడిన పదకొండేళ్లకు మేమిద్దరం పెళ్లి చేసుకున్నాం. అప్పట్లో ప్రేమ పెళ్లంటే గ్రామాల్లో చాలా విచిత్రంగా చూసేవాళ్లు.

■ డిగ్రీలోనే స్కూల్ ఆలోచన...

డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే నాకు, ప్రమీలకు ఒక స్కూలు పెడదామన్న ఆలోచన వచ్చింది. విజయవాడలో ప్రైవేటు స్కూళ్లను పరిశీలించాం. అప్పుడే మిషనరీ స్కూళ్లు ప్రారంభమవుతున్నాయి. గుడివాడలో మాకు పరిచయం ఉన్న శ్రీమన్నారాయణ... 'విశ్వభారతి' స్కూల్‌ను ప్రారంభించారు. ఉద్యోగం కోసం ముందుగా ఆయన దగ్గరకు వెళ్లాను. పరిచయస్తులకు వాళ్లకు ఉద్యోగం ఇవ్వడం ఇష్టం లేని ఆయన ఖాళీలు లేవని చెప్పారు. రాయలసీమకు చెందిన శ్రీరాములు... కైకలూరుకు సమీపాన కోరుకల్లు గ్రామంలో స్కూలు ఏర్పాటు చేశారు. బతుకుదెరువు కోసం మేమిద్దరం అక్కడ టీచర్లుగా చేరాం. నెలకు ఒక్కొక్కరికి రూ.125 జీతం. మూడు నెలలు పని చేసిన తర్వాత సంక్రాంతి సెలవులకు నేను, ప్రమీల సొంతూరు వెళ్లాం. మా ఊళ్లో స్కూలు పెట్టాలని రెండు, మూడు స్థలాలు చూశాం. మా రెండో అబ్బాయికి జలుబు చేస్తే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాం. మేం పెట్టాలనుకున్న స్కూలు గురించి డాక్టర్ దంపతులు అడిగారు. వారి ఇద్దరు పిల్లలకూ ట్యూషన్ చెప్పమని కోరారు. అక్కడి నుంచి మా స్కూలు ప్రయాణం మొదలైంది.

■ విశ్వశాంతి కోసమే...

నాకు పుస్తకాలు చదివే అలవాటు ఎక్కువ. జవహర్‌లాల్ నెహ్రూకు సంబంధించిన పుస్తకాలు బాగా చదివేవాడిని. ఆ సమయంలో చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ యుద్ధాలు జరిగేవి. వాటితో కలిగిన హింస కలచివేసింది. మా అన్నయ్య కృష్ణమూర్తి ఆర్మీలో పని చేసేవాడు. ఈ యుద్ధాలు జరిగే సమయంలో మా కుటుంబమంతా చాలా ఆందోళనగా ఉండేది. 'చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటే ప్రపంచంలో శాంతి నెలకొంటుంది కదా' అన్న భావన నాలో ఉండేది. అందుకే మా స్కూలుకు 'విశ్వశాంతి' పేరు పెట్టాం. సిద్ధాంతి సూచనలతో ముందు శ్రీ చేర్చాం. ఇక అప్పటి నుంచి 'శ్రీ విశ్వశాంతి'గా స్థిరపడిపోయింది. నేను ఇప్పటికీ ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థుల మధ్యే గడుపుతాను. 50 ఏళ్ల 'శ్రీ విశ్వశాంతి' ప్రయాణంలో దేశానికి ఉత్తమ విద్యార్థులను అందించానన్న సంతృప్తి నాకు ఎప్పటికీ ఉంటుంది.

■ ఆరోగ్యమూ ముఖ్యమే...

విద్యార్థులకు చదువు ఒక్కటే సరిపోదని, అందుకు తగిన వాతావరణం కూడా కల్పించాలనేది 'విశ్వశాంతి గ్రామీణ యూనివర్సిటీ' సంకల్పం. దానికి అనుగుణంగానే ప్రాంగణమంతా పచ్చని మొక్కలు పెంచాం. అంతేకాదు... విద్యార్థుల ఆరోగ్యం కోసం సొంతంగా ఒక డెయిరీని ఏర్పాటు చేశాం. అత్యున్నత ప్రమాణాల్లో నిర్వహిస్తున్నందుకు దీనికి 'బెస్ట్ డెయిరీ ఫారమ్ ఆఫ్ ఏపీ అవార్డు' కూడా దక్కింది.

■ ఆమె ఆకాంక్షలకు అనుగుణంగా...

ఆర్థిక భారం తగ్గించి గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించాలనేది ప్రమీల ఆకాంక్ష. ఆమె కోరిక మేరకు ఏటా మూడొందల మందికి పైగా విద్యార్థులకు ఫీజు రాయితీ ఇస్తున్నాం. దీంతోపాటు ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మా అబ్బాయిలు, కోడళ్లు కూడా 'శ్రీ విశ్వశాంతి' విద్యా ప్రగతిలో భాగస్వాములయ్యారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యావంతులైతే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం ప్రగతి పథంలో పయనిస్తుంది."

● గుడాల శ్రీనివాస, విజయవాడ
ఫొటోలు: లక్ష్మణ్

ఆరుగురు విద్యార్థులతో...

1975 ఫిబ్రవరి 22న ఆరుగురు విద్యార్థులతో 'విశ్వశాంతి' స్కూలు ప్రారంభమైంది. మొదటి సంవత్సరం 16 మంది విద్యార్థులు ఉండేవారు. మరుసటి ఏడాది ఆ సంఖ్య 136కి చేరింది. విద్యార్థులకు నేను, ప్రమీల పాఠాలు చెప్పేవాళ్లం. మరో ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు టీచర్లుగా ఉండేవారు. 1988 నుంచి ఎమ్మెల్యేల పిల్లలూ 'విశ్వశాంతి'లో అడ్మిషన్లు తీసుకోవడం మొదలైంది. ఇప్పుడు 80 ఎకరాల విస్తీర్ణంలో 'శ్రీ విశ్వశాంతి' నడుస్తోంది. ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు 6,300 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 700 మంది మా దగ్గర అడ్మిషన్లు తీసుకున్నారు. విదేశాల్లో స్థిరపడినవారి పిల్లలూ విశ్వశాంతిలో ఉన్నారు. డాక్టర్ కావాలన్నది నా మొదటి లక్ష్యం. కాలేజీలో చదువుతున్నప్పుడు రంగస్థలంపై నాటకాలు వేయడంతో నటుడు కావాలన్న లక్ష్యం పుట్టింది. ఈ రెండు లక్ష్యాలూ నెరవేర్చుకోలేకపోయాను.



నార్నె నితిన్.. 'ఆయ్', 'మ్యాడ్' చిత్రాల సిరీస్‌తో ఇప్పుడు వినిపిస్తోన్న పేరు. తొలి సినిమా ఇంకా విడుదల కాకుండానే మరో మూడు చిత్రాల్లో నటించేసి, విజయాలను తన ఖాతాలో వేసుకున్న ఈ యువ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌కు స్వయానా బావమరిది. అయితే ఆ బ్రాండ్‌ను ఇప్పుడే ఉపయోగించుకోకుండా కెరీర్‌ను ప్లాన్ చేసుకుంటున్న నితిన్ 'నవ్య'కు చెప్పిన విశేషాలివి.

బావ అలా అనగానే ఆనందపడ్డా..!



● మూడు సినిమాలు.. వరుస హిట్స్.. ఎలా అనిపిస్తోంది?

నా కంటే అదృష్టవంతుడు మరొకరు ఉండరేమో అనిపిస్తోంది. ఎందుకంటే కొత్త హీరోలకు హిట్ దొరకడమే కష్టమవుతున్న ఈ రోజుల్లో నాకు వరుసగా మూడు హిట్స్ రావడం ఓ అద్భుతమే కదండీ.

● తెరపై మిమ్మల్ని మీరు చూసుకోవాలనే కోరిక ఎప్పుడు కలిగింది?

నేను సినిమా పిచ్చోడిని. సినిమాలు బాగా చూస్తుంటాను. సీనియర్ నటుడు భిక్షుగారు తెలుసు కదా.. ఆయన భార్య అరుణగారు కూడా నటనలో శిక్షణ ఇస్తుండేవారు. స్కూల్ ఫైనల్ కూడా నాకు అప్పుడు పూర్తి కాలేదు. సాయంత్రం స్కూల్ నుంచి రాగానే మణికొండలో ఉన్న వారి ఇంటికి ట్రైనింగ్ కోసం వెళ్లేవాడిని, సాయిధరమ్ తేజ్, బెల్లంకొండ శ్రీనివాస్, నాగశౌర్య కూడా అక్కడికి ట్రైనింగ్ కోసం వచ్చేవారు. వాళ్లు నాకు సీనియర్స్. వాళ్లకి పెద్ద పెద్ద డైలాగులు, నాకు చిన్న డైలాగులు ఇచ్చి చెప్పమనేవారు. అదో సరదాగా ఉండేది. బావగారు (జూనియర్ ఎన్టీఆర్) మా ఇంట్లో అడుగుపెట్టిన తర్వాత ఆ సరదా మరింత పెరిగింది.

● ఎన్టీఆర్ మీకు బావ కాకముందు నుంచీ ఆయనంటే అభిమానం ఉండేదా?

'సింహాద్రి' చూసిన తర్వాత బావగారికి అభిమానిగా మారాను. కడియాలు చేయించుకుని రోజూ ఎవరో ఒకరిని కొట్టడం, వాళ్లు ఇంటి మీదకి రావడం, ఇంట్లో వాళ్లు నన్ను తిట్టడం . జరిగేది. చిన్నప్పటి నుంచి ఆయనంటే నాకు బాగా ఇష్టం.

● మీ బావ ప్రోత్సాహం ఎలా ఉంది?

సినిమాల్లో నటించాలనుంది అని ధైర్యంగా నా మనసులోని కోరికను మొదట బావగారికి చెప్పినప్పుడు వెంటనే ఆయన ఓ మాట అన్నారు. "ఒరేయ్.. ఈ పరిశ్రమలో ఎవరి సపోర్ట్ ఆశించకూడదు. మనకు మనకే నేర్చుకోవాలి, కష్టపడాలి, ఎదగాలి. కింద పడినా వెంటనే మనమే లేవాలి. ఎవరో వచ్చి లేపుతారని వెయిట్ చేయకూడదు. నీ ప్రయత్నాలు నువ్వు చేసుకో. ఆ తర్వాత నా సపోర్ట్, నా అభిమానుల సపోర్ట్ నీకు తప్పకుండా ఉంటుంది.

● ఎన్టీఆర్ బావమరిది అనే బ్రాండ్ మీకు పాజిటివా, నెగెటివా?

పాజిటివ్‌నెస్‌తో పాటు నెగెటివిటీ కూడా ఉంటుంది. వంద మంది మావాడు అన్నప్పుడు, ఓ పది మంది 'మీ వాడు ఏమిటిరా' అని కూడా అనొచ్చు. అటువంటి మాట తప్పకుండా వస్తుంది కూడా. అయినా సరే ఎన్టీఆర్ బావమరిది అనేది నాకు ఎప్పుడూ పాజిటివే. నెగెటివ్‌గా అస్సలు చూడను.

● మీ పేరుతోనే మరో హీరో ఉన్నారు కదా. పేరు మార్చుకోవాలని అనుకోలేదా?

హీరోగా నేను ఎంట్రీ ఇవ్వాలనుకున్నప్పుడు నా పేరు గురించి పెద్ద చర్చ జరిగింది... పేరు మార్చాలా వద్దా.. మారిస్తే ఎలాంటి పేరు పెట్టాలి అని. కానీ నాకు పేరు మార్చుకోవాలనిపించలేదు. చిన్నప్పటి నుంచి అలవాటు అయిన పేరు. దాన్ని వదులుకోవాలని అనిపించలేదు. అందుకే ఇంటిపేరు కూడా చేర్చుకుని 'నార్నే నితిన్'గా ఎంట్రీ ఇచ్చా. ఆర్టిస్ట్‌గా టాలెంట్ నిరూపించుకోవాలి కానీ పేరు దానికి అడ్డంకి కాదని నా అభిప్రాయం.

● కథల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఫలానా జోనర్‌లో మాత్రమే చేయాలని అనుకోవడం లేదు. ఈ సందర్భంగా దర్శకులకు నాదొక విన్నపం... ఎలాంటి కథ అయినా నాకు చెప్పండి. అది కామెడీ కావచ్చు, హారర్ కావచ్చు, రొమాన్స్ కావచ్చు. పాయింట్ కొత్తగా ఉంది, ప్రేక్షకులు తప్పకుండా చూస్తారు అనిపిస్తే చేసేస్తా. మరో విషయం ఏమిటంటే వంద మందిని కొట్టేసే మాస్ హీరో కావాలనే ఆశ నాకు ఇప్పుడైతే లేదు. నాలాంటి అప్‌కమింగ్ హీరో ఇలాంటి ప్రయత్నాలు చేస్తే తొందరగా ఇంటికి తిరిగెళ్లిపోతాడు. 'వీడు మా వాడే.. నా ఫ్రెండే' అనే భావన ప్రేక్షకులకు కలిగిస్తేనే వాళ్లకి తొందరగా దగ్గర కాగలం. నేను సూపర్ హ్యూమన్‌ని, హీరోని, మీరంతా నేను ఏది చేస్తే అది చూడాలి' అన్నట్లు ఉండకూడదు. నేను కూడా ఒకప్పుడు ఓ సాధారణ ప్రేక్షకుడినే. అప్పట్లో బావగారు తప్ప పరిశ్రమలో నాకు ఎవరూ తెలీదు. ఓ కొత్త హీరో వచ్చి కొంచెం ఓవర్‌గా చేస్తుంటే ఏమిట్రా వీడు? అని అనుకున్న రోజులు చాలా ఉన్నాయి. ఓ పదేళ్ల టార్గెట్ పెట్టుకుని ఆ జర్నీలో మెల్లగా ఇమేజ్ మార్చుకుంటూ రావాలే కానీ వచ్చిన తొలి రోజుల్లోనే అన్నీ చేసేయాలని అనుకోకూడదు.

● 'మ్యాడ్' ఫస్ట్ పార్ట్‌కి, సెకండ్ పార్ట్‌కి మధ్య కాలంలో మీలో వచ్చిన మార్పు ఏమిటి?

'మ్యాడ్' చిత్రం రిలీజ్ అయ్యాక నా గురించి వినిపించిన కామెంట్స్‌ను పాజిటివ్‌గా తీసుకున్నా. వాటిని ఇంప్రూవ్ చేసుకుని 'ఆయ్' సినిమా చేశా. ఆ తర్వాత 'మ్యాడ్ 2' లో నటించా. ఆ సినిమా తర్వాత నెగెటివ్ కామెంట్స్ రాలేదు. మా బావగారే స్వయంగా అన్నారు 'ఒరేయ్.. నీలో ఈజ్ పెరిగింది. క్యారెక్టర్‌లో లీనం అయ్యావు' అని ఆయన అనడం ఆనందంగా అనిపించింది. నా గురించి వచ్చే కామెంట్స్‌ను ఫాలో అవుతుంటా. నేర్చుకుంటూనే ఉంటా. 'మ్యాడ్' తర్వాత 'ఆయ్' చేశా. ఆ తర్వాత 'మ్యాడ్ 2' చేశా. రోజురోజుకీ కొత్త విషయాలు నేర్చుకుంటున్నా.

● మీ మొదటి సినిమా 'శ్రీ శ్రీ రాజావారు' రిలీజ్ ఎప్పుడు?

ఎలా చేయాలి, ఎప్పుడు రిలీజ్ చేయాలని అని చర్చలు జరుగుతున్నాయి. ఆ చిత్ర దర్శక నిర్మాతలతో మాట్లాడుతున్నాం. అది నాలుగో సినిమా అవుతుందా, ఐదో సినిమా అవుతుందా అని ఇప్పుడే చెప్పలేను.

● వినాయకరావు



పూజలు, ఉపవాసాలు చేసేసింది

'మ్యాడ్ 2' రిలీజ్‌కు ముందు శివానీకి ఓ టెన్షన్ ఉండేది. మాకు ఎంగేజ్‌మెంట్ అయిన తర్వాత ఆ సినిమా రిలీజ్ అయింది. అది హిట్ కాకపోతే ఆ ఫ్లాప్ తన ఖాతాలో వేసేసి ఇదంతా తనవల్లే జరిగిందని అంటారేమోననే భయంతో చాలా టెన్షన్ పడింది. సినిమా హిట్ కోసం పూజలు, ఉపవాసాలు చేసింది. 'ఏమీ వద్దు.. అవసరం లేదు' అన్నా శివానీ వినలేదు. లక్కీగా 'మ్యాడ్ 2' హిట్ కావడంతో ఆమె చాలా రిలీఫ్ ఫీలయింది. వరుసగా మూడో హిట్ పడేసరికి తను హ్యాపీ. మేమందరం హ్యాపీ. అక్టోబరులో మా పెళ్లి జరుగుతుంది.

వేసవిలో లంచ్ బాక్స్ సర్దేటప్పుడు...

ఎండాకాలంలో ఆహారం తొందరగా పాడైపోతూ ఉంటుంది. పొద్దున్నే బాక్సుల్లో పెట్టుకుని ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం మధ్యాహ్నం అయ్యేటప్పటికి తినడానికి వీలుగా ఉండదు. అందుకే ఉదయాన్నే లంచ్ బాక్స్‌లు సర్దేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

● అప్పుడే వండిన వేడివేడి ఆహారాన్ని వెంటనే బాక్సుల్లో సర్దేయకూడదు. అలా సర్దితే.... వేడి వల్ల ఆహార పదార్థాలు తొందరగా పాడవుతాయి. కాబట్టి అన్నం, కూరలను చల్లార్చి విడివిడిగా బాక్సుల్లో సర్దాలి. అప్పుడే అవి చాలాసేపటి వరకూ తాజాగా ఉంటాయి.

● టమాటా, దోసకాయ, ఆలుగడ్డలతో చేసిన కూరలు తొందరగా చెడిపోతూ ఉంటాయి. వీటికి బదులు పప్పు, పచ్చడి, పులుసు లాంటి వాటిని లంచ్ బాక్స్‌లో పెట్టుకోవచ్చు. అలాగే అన్నానికి బదులు చపాతీ, పుల్కా, శాండ్‌విచ్ పెట్టుకోవడం మంచిది.



● పండ్లు ఎంత తాజాగా ఉన్నప్పటికీ వాటిని ముక్కలుగా కోసి బాక్సుల్లో పెట్టుకుంటే మధ్యాహ్నానికే రుచి మారుతూ ఉంటాయి. పండ్లను ముక్కలుగా కోయకుండా వాటిని అలాగే బాక్సుల్లో పెట్టుకుని తీసుకెళ్లడం మంచిది.

● మామూలు స్టీల్ బాక్స్‌లు కాకుండా గాలి చొరబడని విధంగా గట్టి మూత ఉన్న బాక్స్‌లు వాడుకుంటే ఆహారం ఎక్కువసేపు తాజాగా ఉంటుంది.

● కొంతమంది రాత్రి వంటలను ఫ్రిజ్‌లో ఉంచి ఉదయాన్నే వాటిని బాక్సుల్లో సర్దుకుంటూ ఉంటారు. ఇలా రాత్రి వేళ ఆహారం మరుసటి రోజు మధ్యాహ్నం వరకు నిల్వ ఉండదు. ముఖ్యంగా ఎండాకాలంలో..! అందుకే ఉదయం పూట తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే లంచ్ బాక్స్‌లో సర్దుకోవాలి.



● గిరిప్రదక్షిణ

చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఉదయం ఆది దంపతుల గిరిప్రదక్షిణ జరిగింది. ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ నుంచి మొదలైన గంగా సమేత దుర్గామల్లేశ్వరుల గిరిప్రదక్షిణ కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం, కబేళా, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి ఘాట్‌రోడ్డు వద్దకు చేరుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

8లో

మనదే పైచేయి

ఇంటర్ ఫలితాల్లో టాప్‌లేపిన కృష్ణా, ఎన్టీఆర్

రాష్ట్రంలో కృష్ణా ఫస్ట్.. మూడోస్థానంలో ఎన్టీఆర్

ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు తిరుగులేని విజయాన్ని నమోదు చేశాయి. ఏటా మాదిరిగానే రాష్ట్రంలోనే కృష్ణాజిల్లా మొదటి స్థానంలో నిలవగా, ఎన్టీఆర్ జిల్లా మూడోస్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తంగా అమ్మాయిలే అధిక ఉత్తీర్ణతా శాతాన్ని నమోదు చేయగా, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు 980 పైబడి మార్కులతో సత్తా చాటారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఆదివారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా, సప్లిమెంటరీ పరీక్షలు మే 12 నుంచి జరగనున్నాయి. - ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/విజయవాడ

- సత్తా చాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు
- పాయకాపురం విద్యార్థినికి 984 మార్కులు
- నేటి నుంచి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు
- 15 నుంచి సప్లిమెంటరీ ఫీజుల చెల్లింపు

కృష్ణాలో 93 శాతం ఉత్తీర్ణత

ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం ఇంటర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. కృష్ణాజిల్లా నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 19,133 మంది విద్యార్థులు హాజరుకాగా, 17,708 మంది ఉత్తీర్ణత సాధించారు. 93 శాతం ఉత్తీర్ణతతో ఏటా మాదిరిగానే కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక మొదటి సంవత్సరం పరీక్షలకు 23,219 మంది హాజరు కాగా, 19,743 మంది ఉత్తీర్ణులయ్యారు. 85 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే కృష్ణాజిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 615 మంది పరీక్షలకు హాజరుకాగా, వారిలో 485 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 79గా నమోదైంది. మచిలీపట్నం లేడియాంప్తిల్ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన ఏ.బాలాత్రిపురసుందరి ఎంపీసీ గ్రూపులో 1000/980 మార్కులు సాధించి జిల్లాలో



విద్యార్థుల విజయ సంకేతం

ప్రథమస్థానంలో నిలిచింది. మొవ్వ క్షేత్రయ్య జూనియర్ కళాశాల విద్యార్థి కె.మురళీధర్ ఎంపీసీ గ్రూపులో 1000/973 మార్కులు సాధించి ద్వితీయస్థానం పొందాడు. ఉయ్యూరు మండలం ఆకునూరు జూనియర్ కళాశాల విద్యార్థిని బి.వరలక్ష్మి ఎంపీసీ గ్రూపులో 1000/954 మార్కులు, అవనిగడ్డ జూనియర్ కళాశాల విద్యార్థిని కె.మేఘనసంధ్య ఎంపీసీ గ్రూపులో 1000/954 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. మొవ్వ క్షేత్రయ్య జూనియర్ కళాశాల ఏటా మాదిరిగానే 87 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో మొదటిస్థానంలో మిగతా 8లో..

నేటి నుంచి రీకౌంటింగ్‌కు దరఖాస్తులు

జవాబుపత్రాల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈనెల 13 నుంచి 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 15 నుంచి 22వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలి. సప్లిమెంటరీ పరీక్షలను మే 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ప్రకటించారు.



- రాజధాని అమరావతికి జలమార్గం
- ఇబ్రహీంపట్నం-రాయపూడికి దగ్గరి దారి
- ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణికులకు అందుబాటులో లాంచీ సర్వీసులు
- ప్రతి గంటకూ ఓ ట్రిప్పు.. రోజంతా రాకపోకలు
- అమరావతి పనులు ఊపందుకుంటే మరిన్ని తిరిగే అవకాశం

10లో

రవాణాసురులు

రవాణా శాఖలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల అవినీతి కథలు

చేసేది రవాణా శాఖలో ఓ సాధారణ ప్రైవేట్ ఉద్యోగం. జీతం రూ.30 వేలకు మించి ఉండదు. అటువంటి ఉద్యోగుల చేతిలో ఖరీదైన ఐ ఫోన్లు.. ఆకర్షించే హూందాయ్ కార్లు.. మెరిసిపోయే బంగారు చైన్లు.. బ్రాస్‌లెట్లు.. ఇంత సాధారణ ఉద్యోగికి ఇంత లగ్జరీ లైఫ్ ఎలా సాధ్యమనే అనుమానం అందరికీ వస్తుంది. అదే అనుమానం ఉన్నతాధికారులకు కూడా రావడంతో తెరవెనుక అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతూ వస్తున్నాయి. రవాణా శాఖలోని సాఫ్ట్‌వేర్ విభాగంలోని ప్రైవేట్ ఉద్యోగుల అవినీతిపై ఎట్టకేలకు అప్రమత్తమైన ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు.

- చేసేది ప్రైవేట్ ఉద్యోగం.. తక్కువ జీతం
- వాడేది ఐఫోన్లు, హుందాయ్ కార్లు, లగ్జరీ లైఫ్
- సమస్త ఆన్‌లైన్ సమాచారం ఏజెంట్లకు చేరవేత
- నాడు వాహన్ ఆన్‌లైన్ సేవల్లో అక్రమాలు
- నేడు ఫ్యాన్సీ నెంబర్లు, లైసెన్స్‌ల జారీలో..
- తెరవెనుక భారీగా నగదు వసూళ్లు
- ఎట్టకేలకు గుర్తింపు.. విధుల నుంచి తొలగించాలని నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రవాణా శాఖ సాఫ్ట్‌వేర్ విభాగంలో పనిచేస్తున్న కొందరు ప్రైవేట్ ఉద్యోగులు అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న సమాచారం ఆర్టీఏ ఉన్నతాధికారులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. విజయవాడ కేంద్రంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో వెలుగుచూసిన నకిలీ ఆర్సీల కుంభకోణం దగ్గర నుంచి ఇటీవల ఫ్యాన్సీ నెంబర్ల బిడ్డింగ్, హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో భారీగా అవకతవకలు చోటుచేసుకోవటానికి కొందరు ప్రైవేట్ ఉద్యోగులే కారణమని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వారిని తొలగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నెంబర్ ప్లేట్ బిడ్డింగ్, హెవీ వెహికల్ లైసెన్స్ జారీలో అవకతవకలు

కొంతకాలంగా రవాణా శాఖలోని కొంతమంది ప్రైవేట్ ఉద్యోగులు.. బడా ఏజెంట్లతో సంబంధాలను కలిగి ఉంటున్నారు. రవాణా రహస్యాలను బయటకు తీసుకెళ్లేంత సంబంధాలు వీరిమధ్య ఏర్పడ్డాయి. నెంబర్ ప్లేట్ బిడ్డింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని బయటకు చేరవేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. సాధారణంగా ఫ్యాన్సీ నెంబర్ల కోసం కొందరు పోటీలు పడుతుంటారు. ఎట్టి పరిస్థితుల్లో తమకు నచ్చిన ఫ్యాన్సీ నెంబర్లను దక్కించుకోవటానికి బడాబాబులు చూస్తుంటారు. ఎంత ఖర్చయినా పర్వాలేదు.. ఆ నెంబర్ కావాలంటూ ఏజెంట్లకు ఆఫర్ ఇస్తారు. బేరాలు కుదుర్చుకున్నాక.. సదరు ఏజెంట్లు సాఫ్ట్‌వేర్ విభాగంలో పనిచేస్తూ తమకు టచ్‌లో ఉన్న ప్రైవేట్ ఉద్యోగుల సహాయంతో కొటేషన్ వేసిన వివరాలు తెలుసుకుంటారు. ఈ సమాచారం తెలుసుకుని తమ పార్టీతో స్వల్ప మొత్తానికి కోట్ చేయిస్తారు. మిగిలిన డబ్బు అందరూ పంచుకుంటారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలోనూ ఇలాగే ఉద్యోగుల లాగిన్లలో అడ్డగోలుగా వ్యవహరించినట్టు తెలుస్తోంది.



ఉద్యోగుల తొలగింపునకు నిర్ణయం

ఈ ఉదంతాలతో సాఫ్ట్‌వేర్ వ్యవహారాలను పర్యవేక్షించే ఉద్యోగులపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరిని విధుల నుంచి తొలగించాలని రవాణా శాఖ కమిషనర్ ఆదేశించినట్టు తెలిసింది.

గతంలో ఈ-ప్రగతి, వాహన్‌లో అక్రమాలు

రవాణా శాఖలో గతంలో 'ఈ-ప్రగతి', ప్రస్తుతం 'వాహన్' సాఫ్ట్‌వేర్ల ఆధారంగా ఆన్‌లైన్‌లో పారదర్శక సేవలు అందుతున్నాయి. దీనివల్ల ఈ శాఖలో అవినీతి తగ్గినా.. ఏజెంట్ల వ్యవస్థ మాత్రం తగ్గలేదు. అప్పట్లో దరఖాస్తులు పట్టుకునే ఏజెంట్లు.. ఇప్పుడు కంప్యూటర్ల ముందు కూర్చుంటున్నారు. ఏజెంట్ల వ్యవస్థ నిర్మూలించకపోవడం వల్ల ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినా ఉపయోగం లేకుండాపోతోంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను పర్యవేక్షించే ప్రైవేట్ సిబ్బందిలో కొందరు, అధికారులు మరికొందరు అవినీతి రుచిమరిగి అడ్డదారులు తొక్కుతున్నారు. సాఫ్ట్‌వేర్ లాగిన్ అధికారాలను, వాటిని మిగతా 8లో..

కౌలురైతు ఆత్మహత్య

వారం రోజులు మృత్యువుతో పోరాడి మృతి



చందర్లపాడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : చందర్లపాడు గ్రామానికి చెందిన కౌలురైతు బత్తుల వీరబాబు శనివారం మృతిచెందాడు. వీరబాబు ఐదేళ్లుగా తనకున్న భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి సాగు చేపట్టాడు. వ్యవసాయం కలిసి రాకపోవటంతో అప్పుల పాలయ్యాడు. పొలాన్ని సొసైటీలో తనఖా పెట్టి రూ.7 లక్షల అప్పు తీసుకున్నాడు. బయట తెచ్చిన అప్పులు రూ.5 లక్షలు ఉన్నాయి. పత్తి పంట దిగుబడి అంతంతమాత్రంగా ఉండగా, మిర్చి ధర పడిపోవటంతో మరింత దిగాలు పడ్డాడు. వీరబాబు భార్య బంధువుల వద్ద అప్పు సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తుండగా, ఈ నెల 5న పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆగని మట్టి, ఇసుక మాఫియా

- తిరువూరు నియోజకవర్గంలో యథేచ్ఛగా తవ్వకాలు 10లో
- వెంట్రప్రగడలోనూ ఇదే దుస్థితి



మామిడి ఎగుమతులు

ముమ్మరం

నున్న మ్యాంగో మార్కెట్ నుంచి రోజుకు 300 టన్నులపైనే ఎగుమతి

మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, బిహార్‌కు తరలింపు

- గతంతో పోలిస్తే తగ్గిన వ్యాపారం
- మార్కెట్‌పై బంద్ మండీల ప్రభావం
- ఈ ఏడాది కాపు తక్కువే..
- మార్కెట్‌ను నూజివీడుకు తరలిస్తేనే పూర్వవైభవం

8లో

అమరావతి 2.0కు భారీ ఏర్పాట్లు

ప్రధాని మోదీ వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ప్రణాళిక

- నాలుగు లక్షల మంది జన సమీకరణ
- మూడు భారీ టెంట్లు ఏర్పాటు చేసే యోచన
- అమరావతి రైతుల కోసం ప్రత్యేక గ్యాలరీ
- ప్రధాన వేదికతో పాటు సాంస్కృతిక వేదిక
- తెలుగు సంప్రదాయాలు తెలిసేలా ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చే అవకాశాలు ఉండటంతో లక్ష నుంచి నాలుగు లక్షల మంది వరకు జన సమీకరణ చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా టెంట్లు, గ్యాలరీలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. నాలుగు లక్షల మందికి కూర్చోవటానికి వీలుగా మూడు భారీ వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. ఒకవేళ సభ సాయంత్రం పూట జరిగితే ఓపెన్‌గా గ్యాలరీలు మాత్రమే ఉంచాలని చూస్తున్నారు. ముందు వరుసలో రాజధాని రైతులకు ప్రత్యేక గ్యాలరీ సిద్ధం చేస్తారు. అధికారులు, ఎంవీఐపీలు, వీవీఐపీలు, ప్రముఖులు, ప్రత్యేక ఆహ్వానితులకు వేర్వేరుగా గ్యాలరీలు ఉంటాయి. వీరందరితో పాటు వీఐపీలకు కూడా ప్రత్యేకంగా పాసులు జారీ చేయనున్నారు. ప్రధాన వేదికను భారీ ఎల్ఈడీలతో తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. సాంస్కృతిక వేదికను కూడా ఏర్పాటు చేయనున్నారు. తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా కూచిపూడి, ఇతర సంప్రదాయ నృత్యాలను ఈ వేదికపై ప్రదర్శించాలని ప్రణాళికలు రచిస్తున్నారు.

- అమరావతి చరిత్ర గురించి ప్రధాని నరేంద్రమోదీకి చాటిచెప్పేలా ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో అమరావతి బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, ఇతర శిల్పాలు వంటివి ప్రదర్శించనున్నారు.
- రాజధానిలో నిర్మించే ఐకానిక్ భవనాలకు సంబంధించిన త్రీడీ ప్రింట్స్‌ను ప్రదర్శించాలని నిర్ణయించారు. 40 అంతస్థులతో కూడుకున్న సచివాలయ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలతో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్, ఎన్‌జీవో, గవర్నమెంట్ టైప్-1, 2 మిగతా 8లో..

మోడరన్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



లేఖ్యసుకీర్తి, లీలాగోవర్ధన, చందనా దుర్గా, నాగలక్ష్మి, జ్ఞానలక్ష్మి, ఫణి తేజ

మొగల్రాజపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సీనియర్, జూనియర్ ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపించారని మొగల్రాజపురం మోడరన్ అకాడమీ డైరెక్టర్ సుంకర నాగ పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీలో చలువాది లేఖ్యసుకీర్తి 491, టి.లీలాగోవర్ధన 490, పి.చందనా దుర్గా 489, టి.నాగలక్ష్మి యశస్వినీ 489, కె.జ్ఞానలక్ష్మీనికిత, పి.ఫణి తేజ 486 మార్కులు సాధించారని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్‌లో మొత్తం 97 శాతం, సీనియర్ ఇంటర్ ఎంఈసీ విభాగంలో 98 శాతం, సీనియర్ సీఈసీలో 94.5 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్లో ఎక్కువ మంది 450 మార్కులపైనే పొందారని, కామర్స్, ఎకనామిక్స్‌లో 99 మార్కులు అధిక శాతం మందికి వచ్చాయని పేర్కొన్నారు. 38 ఏళ్లుగా సుంకర పాపారావు ఆధ్వర్యంలో కామర్స్ విద్యారంగంలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు.

శారద విద్యార్థుల జయకేతనం

మొగల్రాజపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సీనియర్, జూనియర్ ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని శారద విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు ఐ.ప్రజ్ఞ 466, వి.శృతి, పి.వి.ఎస్.ఎస్.వర్షిణి, ఎం.దేవహర్షిణి, జె.శ్వేత, సిహెచ్.శ్రీనిధి 465, జూనియర్ బైపీసీలో 440 మార్కులకు ఐ.నమ్రత 436, ఎం. కృష్ణకాంత్ 434, కె.గాయత్రీ, షేక్ ఆఫియా నఫీన్ 433, సీనియర్ విభాగంలో 1000 మార్కులకు కె.యక్షిత 989, వి.స్వీకృతాంజలి, బి.శ్రావణి 987, ఈ.యశస్విని, జి.అమల్ జాసన్, టి.శేషసాయిగణేష్, దీనదయాళ్ రేవంత్ 984, జి.నాగదీపిక, కె.వర్థిక 983 మార్కులు సాధించారని పేర్కొన్నారు.

ప్రతి గ్రామంలో అంబేడ్కర్ జయంతి

- నేడు ఆయన విగ్రహాల శుద్ధి
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



ప్రసంగిస్తున్న డీకే అరుణ, వేదికపై రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

విజయవాడ, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను గ్రామగ్రామాన నిర్వహిస్తామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఈ ఉత్సవాలను ఆదివారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆదివారం సాయంత్రం అంబేడ్కర్ విగ్రహాలను శుద్ధి చేసి దీపాలు వెలిగిస్తామని చెప్పారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చేస్తారని అసత్యాలు ప్రచారం చేశారని విమర్శించారు. అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దేనని దుమ్మెత్తిపోశారు. అంబేడ్కర్‌ను ఓడించడానికి జవహర్‌లాల్ నెహ్రూ అనేక కుట్రలు చేశారని ఆరోపించారు. అధికారమే లక్ష్యంగా, ఓట్ల రాజకీయం కోసం రాజ్యాంగానికి సవరణలు చేశారని మండిపడ్డారు. మోదీ ప్రధాని అయిన నాటి నుంచి అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. దేశ, ప్రజాహితం కోసమే మోదీ రాజ్యాంగానికి సవరణలు చేశారన్నారు. దీనిపై కాంగ్రెస్ అబద్ధాలను ప్రచారం చేసిందని విమర్శించారు. అందుకే ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. దేశం, అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా మోదీ పాలన చేస్తున్నారని చెప్పారు. సమాజంలో అన్ని వర్గాల వారికి న్యాయం చేసేలా కేంద్రం ఆలోచిస్తుందన్నారు.

రాజ్యాంగ విలువలకు విఘాతం

» మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

మచిలీపట్నం టౌన్ , ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఘాతం కలిగిస్తోందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు విమర్శించారు. శనివారం రాత్రి ఈశ్వర రెసిడెన్సీలో 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడారు. జమిలి ఎన్నికలు, డిలిమిటేషన్, జీఎస్టీ, వక్ఫ్ సవరణ బిల్లు, పౌరసత్వ అంశాలపై కేంద్రం వైఖరి రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందన్నారు. 1973లో కేరళ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలిక స్వరూపం మార్చే హక్కు ఎవరికీ లేదని తీర్పు ఇచ్చిందన్నారు. ఎన్నికల కమిషన్‌ను స్వతంత్రంగా పనిచేసుకోనివ్వడం లేదన్నారు. వ్యవస్థల్లో ఆర్ఎస్ఎస్ ప్రమేయం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొడాలి శర్మ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు చీకటి రాజేష్, యూటీఎఫ్ నాయకుడు వెంకటేశ్వరరావు, నాయకులు చంద్రపాల్, రమాదేవి, పామర్తి నాగయ్య, కె.సుజాత, జి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి 2.0కు భారీ ఏర్పాట్లు

(7వ పేజీ తరువాయి)

భవనాలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఇతర బంగ్లాలు త్రీడీ ప్రింట్స్ ద్వారా చూపించనున్నారు.

- ఆహుతులకు రుచికరమైన తెలుగు వంటకాలను అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్యాలరీల్లో కూర్చున్న చోటకే ప్యాకింగ్‌ల ద్వారా అందించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. సంప్రదాయ శాకాహార వంటలు, పిండివంటలకే పెద్దపీట వేస్తారు.
- అతిథుల కోసం నాలుగు హెలీప్యాడ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిలో రెండు మాత్రం మోదీ, భద్రతా సిబ్బందికి కేటాయించనున్నారు. మిగిలిన రెండింటినీ కేంద్ర మంత్రుల కోసం వినియోగించనున్నారు.
- శంకుస్థాపన ప్రాంతానికి కళ తీసుకొచ్చేందుకు వీలుగా సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున ఎయిర్ బెలూన్స్ ఎగుర వేయాలని నిర్ణయించారు.
- శంకుస్థాపనకు తరలివచ్చే ప్రజల కోసం పెద్ద ఎత్తున ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను సిద్ధం చేయాలని సీఆర్‌డీఏ అధికారులు నిర్ణయించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే అవకాశం ఉన్నందున 1,500కు పైగా ఆర్టీసీ బస్సులు, మరో 700 ప్రైవేట్ బస్సులు సిద్ధం చేయాలని చూస్తున్నారు. కాగా, కేంద్రం నుంచి వచ్చే షెడ్యూల్ కోసం సీఆర్‌డీఏ అధికారులు ఎదురుచూస్తున్నారు. ఈనెల 24-26 తేదీల మధ్య అమరావతి పునర్నిర్మాణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేసే అవకాశముంది.

ప్రభుత్వ ఉద్యోగుల్లో సంతోషం

» ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

కాకినాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. రెవెన్యూ వ్యవస్థలో మార్పులు, సాంకేతికతను ఉద్యోగులు, సిబ్బందికి తెలియజేసేందుకు రెవెన్యూ అకాడమీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కాకినాడలోని రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు వేస్తున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగుల్లో అలస్యం, నిర్లక్ష్యం లేకుండా ఉండాలంటే వారికి ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఫైల్స్ రూపొందించేవారికి 45 రోజులపాటు శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఉన్న 15 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల్లో రెండు వేల మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేశారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మామిడి ఎగుమతులు ముమ్మరం

- నున్న మ్యాంగో మార్కెట్ నుంచి రోజుకు 300 టన్నులపైనే ఎగుమతి
- మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, బిహార్‌కు తరలింపు
- గతంతో పోలిస్తే తగ్గిన వ్యాపారం
- మార్కెట్‌పై బంద్ మండీల ప్రభావం
- ఈ ఏడాది కాపు తక్కువే..
- మార్కెట్‌ను నూజివీడుకు తరలిస్తేనే పూర్వవైభవం!



నున్న మ్యాంగో మార్కెట్‌లో మావిడి ప్యాకింగ్ చేస్తున్న కార్మికులు

విజయవాడ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నున్న మ్యాంగో మార్కెట్‌లో మామిడి ఎగుమతులు ఊపందుకున్నాయి. మార్కెట్‌లో 80 శాతం దుకాణాలు వ్యాపార లావాదేవీలు కొన సాగిస్తున్నాయి. రోజుకు సుమారు 300 టన్నుల వరకు మామిడిని పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే గతంతో పోలిస్తే మార్కెట్‌లో ప్రస్తుతం జరుగుతున్న లావాదేవీలు తక్కువే. పలు జిల్లాల్లో ఎక్కడికక్కడ బంద్ మండీలు(లోకల్ మండీలు) ఏర్పాటు చేయడంతో ఆ ప్రభావం నున్న మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. దీనికి తోడు ఈ ఏడాది వివిధ కారణాలతో కాపు కూడా తక్కువే ఉంది. ఈ నేపథ్యంలో నున్న మ్యాంగో మార్కెట్‌ను నూజివీడుకు తరలించేందుకు ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.

రోజుకు 300 టన్నుల ఎగుమతులు

నున్న మ్యాంగో మార్కెట్‌లో 40 వరకు దుకాణాలు ఉండగా 30కిపైగా దుకాణాలు తెరుచుకున్నాయి. ఒక్కో దుకాణం 10 నుంచి 15 టన్నులు వరకు మామిడి ఎగుమతులు చేస్తోంది. మొత్తం మీద 300 టన్నులకు పైగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. బంగినపల్లి టన్ను మొదటి క్వాలిటీ రూ.50 వేల నుంచి రూ. 55 వేల వరకు అమ్ముడవుతుండగా, రెండవ రకం రూ.30 వేల నుంచి రూ. 35 వేల వరకు ధర పలుకుతుంది.

ఆరు రాష్ట్రాలకు ఎగుమతులు

ప్రస్తుతం మార్కెట్‌లో సమీప జిల్లాల నుంచి చెరుకురసం, బంగినపల్లి, తోతాపురి అందుబాటులో ఉన్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాలకు వ్యాపారులు మామిడిని ఎగుమతులు చేస్తున్నారు.

బంద్ మండీల ప్రభావం

నున్న మ్యాంగో మార్కెట్‌కు విస్సన్నపేట, నూజివీడు, సత్తుపల్లి, రెడ్డిగూడెం, చీమలపాడు, తదితర ప్రాంతాల నుంచి మామిడి దిగుమతులు అవుతుంటాయి. అయితే ఆయా ప్రాంతాల్లో వ్యాపారులు బంద్ మండీలు ఏర్పాటు చేయడంతో చాలా వరకు రైతులు రవాణా ఖర్చులు మిగులుతాయనే ఉద్దేశ్యంతో ఎక్కడికక్కడ అమ్మకాలు జరుపుతుండటంతో నున్న మ్యాంగో మార్కెట్‌లో దిగుమతి తగ్గింది.

ఈ ఏడాది కాపు తక్కువే..

గతంతో పోలిస్తే ఈ ఏడాది కాపు తక్కువగా ఉండటం కూడా మార్కెట్‌లో ప్రభావం చూపుతోంది. మామిడి కాపు మొదట్లో పూత గతంతో కన్నా ఎక్కువ వచ్చినా కోడిపేను తెగులు కారణంగా పూత 95 శాతం రాలిపోయినట్లు రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. దీనికి తోడు ఇటీవల వచ్చిన గాలివాన బీభత్సం కూడా పూత, కాయలు రాలి మరింత నష్టాన్ని మిగిల్చాయి.



లారీలోకి మామిడిని లోడ్ చేస్తున్న కార్మికులు

నూజివీడు తరలింపునకు ప్రయత్నాలు

మామిడి దిగుమతులు అయ్యే తోటలకు నున్న మ్యాంగో మార్కెట్ దూరంగా ఉండటంతో మార్కెట్‌ను నూజివీడుకు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక్కడి కన్నా నూజివీడులో దుకాణాలు తెరిస్తే అధిక సంఖ్యలో రైతులు మార్కెట్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయని తద్వారా వ్యాపారాలు పెరుగుతాయని రైతులకు కూడా ఉపయోగంగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

మంత్రి లోకేశ్ దృష్టికి మార్కెట్ తరలింపు విషయం



నున్న మ్యాంగో మార్కెట్‌లో వ్యాపారాలు దాదాపు తగ్గుముఖం పట్టాయి. రైతులు ఇక్కడికి రావడం దూరాభారంగా భావిస్తున్నారు. ఈ విషయమై గతంలో మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి రైతులతో సమావేశమయ్యారు. రైతులు కూడా మార్కెట్ కావాలని కోరడంతో అక్కడికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

\- శ్రీనివాసరెడ్డి, మ్యాంగో గ్రోయర్స్ అసోసియేషన్ కార్యదర్శి

సింహ వాహనంపై ఆది దంపతులు

» ఘనంగా చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు
» భారీగా తరలివచ్చిన భక్తులు



సింహ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా 5వ రోజైన శనివారం సింహ వాహనంపై గంగా, పార్వతీ (దుర్గా) సమేత మల్లేశ్వరులు వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా వేద పండితులు, అర్చకులు ఉదయం మూల మంత్ర హవనములు నిర్వహించారు. 10 గంటలకు సదస్యం జరిపారు. వేద పండితులు వేదస్వస్తి, వేద ఆశీర్వచనం పలికారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఔపాసన, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం మహామండపం నుంచి సింహవాహనంపై గంగా పార్వతీ సమేత మల్లేశ్వరుల ఊరేగింపు ప్రారంభమైంది. ప్రఖ్యాతిగాంచిన సింహ వాహనంపై ఆది దంపతులు కొలువై ఉండగా, సంప్రదాయ కళలైన తప్పెట్లు, మహిళా కోలాట నృత్యాలు, చిన్నారుల కోలాట ప్రదర్శన, తాళం భజన కళాకారుల ప్రదర్శనలు ముందు సాగుతుండగా, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సింహవాహన సేవ శ్రేణి కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, కొత్తపేట, సామారంగం చౌక్, మెయిన్ బజార్ మీదుగా తిరిగి కొండపైకి చేరుకుంది.భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు దుర్గా ప్రసాద్, సహాయ కార్యనిర్వహణాధికారి దుర్గారావు, పర్యవేక్షకులు నరసింహరాజు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని గంగా, పార్వతీ సమేత మల్లేశ్వరుల ఉత్సవ మూర్తుల గిరిప్రదక్షిణ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ అన్నపు రాశిని పోసి బలిహరణలు సమర్పించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ గుమ్మడికాయ దిష్టితీశారు. కొబ్బరికాయలు కొట్టి బలిహరణలు సమర్పించారు. అనంతరం స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, శ్రీనివాస శాస్త్రి, అధికారులు ఉత్సవమూర్తులను ఉంచిన బండిని లాగారు. జై భవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాల నడుమ అమ్మవారి గిరిప్రదక్షిణ కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా తిరిగి కొండపైకి చేరింది. వందలాది భక్తులు గిరిప్రదక్షణలో పాల్గొన్నారు.

మనదే పైచేయి

(7వ పేజీ తరువాయి)

నిలిచింది. అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల 83.50 శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ, మచిలీపట్నం లేడియాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 79 శాతం ఉత్తీర్ణతతో తృతీయ స్థానం సాధించాయని ఆర్ఐవో పీబీ సాల్మన్‌రాజు తెలిపారు.

ఎన్టీఆర్‌లో 89 శాతం ఉత్తీర్ణత

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం 89 శాతం, మొదటి సంవత్సరం 81 శాతం ఉత్తీర్ణతతో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా రెండోస్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 35,484 మంది హాజరు కాగా, 31,736 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 39,200 మంది హాజరుకాగా, 31,676 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలే అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 86 శాతం మంది అమ్మాయిలు ఉత్తీర్ణులు కాగా, అబ్బాయిలు 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో అమ్మాయిలు 75 శాతం, అబ్బాయిలు 66 శాతం ఉత్తీర్ణత పొందారు. ఈ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాలో మొత్తం పది ప్రభుత్వ కళాశాలలు ఉండగా, ద్వితీయ సంవత్సరం 606 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 398 మంది ఉత్తీర్ణత సాధించగా, 66 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వృత్తి విద్యాకోర్సులకు సంబంధించి 189 మంది పరీక్షలు రాయగా, 177 మంది ఉత్తీర్ణులై 94 శాతం ఉత్తీర్ణతను సాధించారు. మొదటి సంవత్సరంలో 997 మంది పరీక్షలకు హాజరు కాగా, 485 మంది ఉత్తీర్ణులయ్యారు. 49 ఉత్తీర్ణతా శాతం నమోదైంది. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి మొత్తం 241 మంది పరీక్షలు రాయగా, 206 మంది ఉత్తీర్ణులయ్యారు. 85 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జి.రాజ్యలక్ష్మి (984), ఎం.రాజేశ్ (940), సీహెచ్ నవీశ్రీ (923), సీహెచ్ సాయికుమార్ (918) మార్కులు సాధించారు. బైపీసీలో షేక్ రేష్మా (984), జె.అంజలి (953), వి.భువనేశ్వరి (911), బి.మేఘన (904) మార్కులు సాధించారు. సీఈసీలో జె.ప్రకాష్ (878), డి.సాయి లిఖిత (823), సీహెచ్ వైష్ణవి (812) సాధించగా, హెచ్ఈసీలో షేక్ అయిషా పర్వీన్ (812) మార్కులు పొందింది.

స్ట్రెచర్‌పై వచ్చి పరీక్షలు రాసిన విద్యార్థి పాస్

జగ్గయ్యపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదానికి గురై ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతి తీసుకుని స్ట్రెచర్‌పై వచ్చి పరీక్ష రాసిన పట్టణానికి చెందిన సాయిరాజు శనివారం విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. పట్టణంలోని ఓ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సాయిరాజు గత ఫిబ్రవరిలో ఇంటికి నడిచి వెళ్తుండగా బైక్ ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. అతని కుడి మోకాలితో పాటు వెన్నుకు దెబ్బ తగిలింది. ఆపరేషన్ అనంతరం డిశ్చార్జి చేసిన వైద్యులు పూర్తి విశ్రాంతి అవసరమని చెప్పటంతో పరీక్షలు రాయటం సాధ్యం కాదని అంతా అనుకున్నారు. కుటుంబసభ్యులు వద్దని వారించారు. కానీ సాయిరాజు ఇంటర్ బోర్డు అనుమతితో పరీక్షలు రాసి 308 మార్కులు సాధించాడు.

పత్తి రైతులపై రూ.70 లక్షల భారం

» పెరిగిన బీటీ-2 పత్తి విత్తనాల ధర
» 475 గ్రాముల సంచిపై రూ.37 వడ్డన



కంచికచర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు అధికంగా సాగు చేయనున్న బీటీ-2 పత్తి విత్తనాల ధర పెరిగింది. ఖరీఫ్ సీజన్‌లో సంచికి రూ.37ల వంతున ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది రూ. 864 ఉన్న 475 గ్రాముల విత్తనాల సంచి ధర ప్రస్తుతం రూ. 901లకు చేరింది. జిల్లాలో జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో రైతులు పత్తి పంట సాగు చేస్తారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో దాదాపుగా లక్ష ఎకరాల్లో పత్తి సాగవుతుంది. 2019లో రూ.710 ఉన్న విత్తనాల సంచి ధర గత ఏడాది రూ. 864 చేరింది. ఈ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం సంచికి రూ.37 వంతున ధర పెంచడంతో రూ.901 చేరింది. వ్యవసాయాధికారుల గణాంకాల ప్రకారం ఎకరానికి ఒక సంచి విత్తనాలు సరిపోతాయి. రైతుల లెక్కల ప్రకారం ఎకరానికి రెండు సంచుల విత్తనాలు అవసరం. మొత్తంగా జిల్లాకు పత్తి విత్తనాలు రెండు లక్షల సంచులు కావల్సి ఉంటుంది. ధర పెరగటం వల్ల జిల్లాలో రైతులపై రూ.70 లక్షల వరకు భారం పడనుంది. మే రెండో వారం నుంచి విత్తనాలు వస్తాయని స్థానిక డీలరు గోగినేని రామారావు చెప్పారు.

రవాణాసురులు

(7వ పేజీ తరువాయి)

చూసే అవకాశాలు కలిగి ఉండటాన్ని క్యాష్ చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ కేంద్రంగా భారీ కుంభకోణం జరిగింది. ఈశాన్య రాష్ట్రాల్లో పాత లారీలను కొన్నట్టు, అక్కడి రాష్ట్రాల నుంచి ఎన్ఓసీ పత్రాలను పొందినట్టు చూపించి అసలు వాహనాలే లేకుండా అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించారు. లేని వాహనాలకు ఆర్సీలు సృష్టించటానికి అవసరమయ్యే డేటా ఎంట్రీ విజయవాడలోనే చేశారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో లేని వాహనాలకు ఫిజికల్ వెరిఫికేషన్ కూడా పూర్తి చేశారు. అసలు లేని వాహనాల వివరాలు వాహన్ పోర్టల్‌లోకి ఎక్కించారు. నకిలీ చాసిస్ నెంబర్లు కొట్టి.. లేని వాహనాలు ఉన్నట్టుగా ఆన్‌లైన్‌లో చూపించారు. వీటి ఆధారంగా నకిలీ ఆర్సీలు బయటకు వచ్చాయి. అప్పట్లో ఈ సాఫ్ట్‌వేర్‌ను నిర్వహించే వారి పాత్రపై అనుమానాలు కలగలేదు. కానీ, ఆ తర్వాత కూడా అధికారుల లాగిన్లను అడ్డం పెట్టుకుని వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్లు చేయటం, లైసెన్సులు జారీ చేయటాన్ని గుర్తించి, అందుకు కారకులైన వారిపై వేటు వేశారు. అయినా ఈ అక్రమాలు ఆగలేదు.


'మీ జీతాలెంత? మీ దర్జాలేంటి? : ఉన్నతాధికారి మండిపాటు

సాఫ్ట్‌వేర్ వ్యవహారాలను పర్యవేక్షించే ఉద్యోగులంతా ఇటీవల రవాణా శాఖ ఉన్నతాధికారిని కలవగా, ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'మీ జీతాలెంత? మీ దర్జాలేంటి? విధుల్లో జాయిన్ అయినపుడు మీరెలా ఉన్నారు? ఇప్పుడెలా ఉన్నారు?' అంటూ మండిపడినట్టు సమాచారం. 'మేమిచ్చే జీతాలకు మీరు ఇంత ఆధునిక జీవితాన్ని గడపగలరా..' అని ఆయన సీరియస్ కావడంతో చేసేదేమీ లేక సదరు ఉద్యోగులంతా మౌనంగా వచ్చేసినట్టు సమాచారం.

టీటీడీ ప్రతిష్ట దెబ్బతీసేందుకు

జగన్ డైరెక్షన్‌లో భూమన యాక్షన్

» టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది హిందువులు విశ్వసించే తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు మాజీ సీఎం జగన్‌రెడ్డి డైరెక్షన్‌లో టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో వేంకటేశ్వరస్వామిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన భూమనను టీటీడీ ఛైర్మన్‌గా నియమించిన జగన్ రెడ్డి ఏ రోజైనా దేవస్థానం సాంప్రదాయాలు పాటించాడా అని ప్రశ్నించారు. గోశాలలో 100 ఆవులు చనిపోయినట్టు భూమన తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 260 మంది సిబ్బంది గోవులను సంరక్షిస్తున్నారని, వయస్సు పెరగటం, వ్యాధుల వల్ల చనిపోయిన గోవులు 40 వరకు ఉంటే వంద అని ఎక్కడో ఆవుల ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని ఆరో పించారు. జగన్‌రెడ్డి హయాంలో జరిగిన తిరుమల కొండలపై అన్యమత ప్రచారం, ఏడుకొండలను తగ్గించే ప్రయత్నం ప్రజలు మర్చిపోరని వివరించారు.

కరుణాకర్‌రెడ్డివి నీచ రాజకీయాలు

» గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



వన్‌టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఆవులు మరణించాయని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విమర్శించారు. శనివారం ఆయన నగరంలోని తన కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన కరుణాకర్‌రెడ్డి ఆవులు చనిపోవటంపై రాజకీయం చేయడం దురదృష్టకరమన్నారు. ఏరోజైనా కరుణాకర్ రెడ్డి గోశాలను సందర్శించారా.. కనీసం గోవులనైనా పెంచారా అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులకు ఆవుల గురించి ఏమి తెలుసని నిలదీశారు. గుళ్లో దేవుళ్లను, గోవులను రాజకీయంగా వాడుకుంటున్నారన్నారు. వైసీపీ నాయకులకు నిజంగా ప్రేమ ఉంటే లారీల్లో తరలించే ఆవులను కాపాడాలని హితవు పలికారు. తనకు ఆవుల గురించి, ఆవుల పెంపకం గురించి బాగా తెలుసని, ముఖ్యంగా తాను ఒంగోలు జాతి ఆవులను పెంచుతున్నట్లు చెప్పారు. ఒంగోలు జాతి ఆవుల వలన కోట్లాది రూపాయల ఆదాయం వస్తుందని, వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర సంపద ఒంగోలు జాతి ఆవులని తెలిపారు. కొందరు రైతులు ఆవులను మేపలేకపోవటం వలన గోశాలకు తరలిస్తున్నారని చెప్పారు.

టీటీడీకి పట్టిన అరిష్టం భూమన

» ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరు పతి దేవస్థానానికి పట్టిన అరిష్టం భూమన కరుణా కర‌రెడ్డి అని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వర రావు విమర్శించారు. అజిత్‌సింగ్ నగర్ లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన ఎస్వీ గోశాలలో వందకుపైగా గోవులు మృతి చెందాయని అసత్య ఆరోపణలు చేయడాన్ని తప్పుపట్టారు. గోశాలకు వెళ్లి రికార్డులు పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. అనారోగ్యంతో కొన్ని గోవులు మృతి చెందిన మాట వాస్తవం అని, గోశాలలో ఇటువంటివి సర్వసాధారణమన్నారు. అలాంటిది గోశాలలో వందకు పైగా గోవులు మృతి చెందాయని అసత్య ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. నేను నాస్తికుడినని స్వయంగా భూమన ప్రకటించిన విషయం వాస్తవమని, ఆ సమయంలో సాక్షాత్తు వేంకటేశ్వర స్వామిపైనే అనేక విమర్శలు చేశారని గుర్తు చేశారు. టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు కరుణాకరరెడ్డి కుట్రలు చేస్తున్నారన్నారు.

టీచర్ల సీనియారిటీపై అభ్యంతరాలకు 16 తుది గడువు

» జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు

విజయవాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులు ఈ నెల 16వ తేదీ లోగా తెలియజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు తెలిపారు. ఈ సీనియారిటీ జాబితాలను ఇప్పటికే ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ(టీఐఎస్)లోను, డీఈవోల వెబ్‌సైట్లో పొందుపరచడంతోపాటు నోటీసు బోర్డులపై అతికించామని వివరించారు. అభ్యంతరాలను వ్యక్తం చేసే ఉపాధ్యాయులు పూర్తి పేరు, పదవి, సంబంధిత వివరాలు, సీనియారిటీ జాబితాలో ఎక్కడ తప్పిదం ఉందో స్పష్టం తెలియజేయాలని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలను దరఖాస్తులో పొందుపరచాలని తెలిపారు. ఈ అభ్యంతరాల దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈనెల 16 లోపు అందజేయాలని డీఈవో విజ్ఞప్తి చేశారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133,142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

దుర్గమ్మకు నృత్య కళార్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం కళావేదికపై శనివారం విజయవాడకు చెందిన శ్రీదుర్గాభవాని నృత్య కళానిలయం విద్యార్థులు అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. శ్రీదుర్గాభవాని నృత్య కళానిలయం గురువు పావని ప్రియాంక ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. పలు కీర్తనలకు 22 మంది కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం దేవస్థానం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.

పీ4తో పేదల జీవితాల్లో మార్పు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పేదలకు రిక్షాలను అందిస్తున్న గద్దె రామ్మోహన్

పటమట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పీ 4 ద్వారా పేదల జీవితాల్లో మార్పు వస్తుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 11వ డివిజన్‌లో శనివారం గద్దె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రూ.50 వేల విలువగల తోపుడు బండ్లను పేదలకు అందించారు. పేదల ఆదాయ మార్గాలను పీ 4 ద్వారా మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఒక్క కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు సీఎం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాల్లో సీఎం చంద్రబాబు పర్యటించి వారి సమస్యలను తెలుసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోనేరు రాజేష్, పాలడుగు ప్రసాద్, జాస్తి సురేష్, కొలకాని నాగమణి, గొల్లపూడి నాగేశ్వరరావు, ఆంజనేయులు, పామర్తి కిషోర్‌లు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ఘనంగా గ్రాడ్యుయేషన్



గ్రాడ్యుయేషన్ పట్టాలు పొందిన చిన్నారులు

పటమట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పటమట శ్రీ చైతన్య స్కూల్లో యూకేజీ నుంచి ఒకటవ తరగతికి, 5 నుంచి 6వ తరగతిలోకి అడుగు పెడుతున్న విద్యార్థులకు శనివారం గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల రీజనల్ ఇన్‌చార్జి విద్యార్థులను అభినందిచారు. విశ్వ విద్యాలయాల స్థాయిలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలను పాఠశాల స్థాయిలోనే నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో మద్దినేని మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ కొల్లి సునీత, డీన్ వెంకటేశ్వర్లు, సౌజన్య, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ విజయవాడ కృష్ణవేణి క్లబ్ ప్రారంభం



జేసీఐ కృష్ణవేణి క్లబ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న క్లబ్ జాతీయ ఉపాధ్యక్షుడు జీఎస్ఎన్ వర్మ, జోనల్ అధ్యక్షుడు టి.భరత్ కుమార్, ఉపాధ్యక్షులు తదితరులు

గుణదల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): యువతీ యువకుల్లో నాయకత్వ లక్షణాలు పెంపుదల, ప్రజాసంబంధాలు పెంపుదల, వ్యాపార నిర్వహణ, సంస్థాగత నిర్వహణ నైపుణ్యాలు నేర్పేందుకు జేసీఐ ప్రధానంగా కృషి చేస్తోందని జేసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు జీఎస్ఆర్ అరవింద్ తెలిపారు. గుణదల్లోని రోటరీక్లబ్ కార్యాలయంలో శనివారం జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) ఆధ్వర్యంలో నూతనంగా జేసీఐ విజయవాడ కృష్ణవేణి క్లబ్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీఎస్ఆర్ అరవింద్ హాజరై జ్యోతి వెలిగించి క్లబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. జేసీఐ విజయవాడ కృష్ణవేణి క్లబ్ అధ్యక్షురాలిగా కదం ధాత్రి బాధ్యతలు చేపట్టారు. కార్యదర్శిగా యు. ఆరిష్ భరద్వాజ్, కోశాధికారిగా ఎన్.చిరంజీవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నండూరి సుబ్బారావు, జేసీఐ ఇంపాక్ట్ అధ్యక్షుడు రాజేంద్రరెడ్డి, కార్యదర్శి కొడాలి ప్రదీప్, కృష్ణవేణి క్లబ్ ముఖ్య సలహాదారు కదం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుచించుకుపోతున్న రోడ్డు

- పటమట రైతుబజార్ రోడ్డులో ఆక్రమణలు
- స్తంభిస్తున్న ట్రాఫిక్

(పటమట, ఆంధ్రజ్యోతి)

నగరంలో ప్రధానమైన రైతు బజారుల్లో పటమట రైతు బజారు ఒకటి. ఈరైతు బజారులో కేవలం తూర్పు నియోజకవర్గ ప్రజలే కాకుండా నగరంలో పనుల నిమిత్తం వచ్చే వారు ఇక్కడే కూరగాయలు కొంటుంటారు. వేల మంది వినియోగదార్లు ఇక్కడ రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రైతు బజారు ఆక్రమణలతో దాని ప్రాభవాన్ని కోల్పోతుంది. రైతు బజారు గోడ పక్కనే టూ వీలర్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఈ పార్కింగ్‌ను దాటి రెండొంతులకు పైగా రోడ్డును ఆక్రమించి రోడ్డుపైనే వ్యాపారం చేస్తున్నారు. రైతుబజారు ఎదురుగా డివైడర్ పక్కన పండ్ల వ్యాపారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. ఆంధ్రజ్యోతిలో రైతు బజారు ఆక్రమణలపై పలు సార్లు కథనాలు వెలువడ్డాయి. వార్త ప్రచురించిన మరునాడు పోలీసులు అక్కడ ఆక్రమణలు తొలగిస్తున్నారు. మరుసటి రోజు ప్రజా ప్రతినిధులు అండదండలతో మళ్లీ వ్యాపారాలు సాగిస్తున్నారు.

ఈ రోడ్డులో ఆక్రమణలతో జరిగే వ్యాపారం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. ఆక్రమణ పరంపర స్థానిక ఇండోర్ స్టేడియం నుంచి పటమట హైస్కూల్ మీదుగా చిల్లీస్ బార్ వరకు కొనసాగింది. నాయకులు, అధికారులు వర్తకులకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



స్కూటర్ స్టాండ్ దాటి వ్యాపారం చేస్తున్న వర్తకులు



డివైడర్ అవతల రోడ్డుపై వ్యాపారం చేస్తున్న పండ్ల వ్యాపారులు



రైతు బజారులో స్తంభించిన ట్రాఫిక్

దుర్గగుడికి దాతల విరాళాలు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం అభివృద్ధికి, అన్నదాన విభాగానికి పలువురు దాతలు శనివారం విరాళాలు అందజేశారు. విజయవాడకు చెందిన ఎం.శ్రీనివాసరావు అన్నవితరణ నిమిత్తం రూ.1,01,116లను, హైదరాబాద్‌కు చెందిన కె.విష్ణువర్ధనదేవి లక్ష రూపాయలు, హైదరాబాద్‌కు చెందిన మరోదాత వి.శ్రీనివాస్ రూ.1,01,116 అందించారు. బంగారు గోపురం అభివృద్ధి పనుల నిమిత్తం విజయవాడకు చెందిన డి.రామాంజనేయులు రూ.1,51,116లు అందించారు. విశాఖపట్టణానికి చెందిన కె.బాలకృష్ణారావు లక్ష రూపాయలు విరాళంగా అందించారు.

ఈ సందర్భంగా అధికారులు దాతలు, వారి కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందించారు.

స్టెల్లాలో క్రమశిక్షణకు పెద్దపీట

పూర్వ విద్యార్థినుల సమావేశంలో ఏపీ హైకోర్టు ఏజీపీ ఓరుగంటి సాయమ్మ



ఓరుగంటి సాయమ్మను సత్కరిస్తున్న స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్

బెంజిసర్కిల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మారిస్ స్టెల్లా కళాశాలలో క్రమశిక్షణకు పెద్దపీట వేస్తారని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏజీపీ, కళాశాల పూర్వవిద్యార్థిని ఓరుగంటి సాయమ్మ తెలిపారు. పూర్వవిద్యార్థుల సంఘం (అలూమిని అసోసియేషన్) ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఆడిటోరియంలో స్టార్ మీట్-2025 కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాయమ్మ మాట్లాడుతూ కళాశాలలో సర్వతో ముఖాభివృద్ధి ఉంటుందని, దీనిని విద్యార్థిను లందరూ సక్రమంగా వినియోగించుకొని ప్రయోజనం పొందాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింత క్వాడ్రస్, కరస్పాండెంట్ లిన క్వాడ్రస్‌లు మాట్లాడుతూ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థినులు ఉన్నత పదవుల్లో ఉండటం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిస్టర్ ఇన్నసియమ్మ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఉషాకుమారి, డిగ్రీ వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ లావణ్య, ఇంటర్ వైస్‌ప్రిన్సిపాల్ స్వప్న, స్టూడెంట్స్ డీన్ పద్మలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థినులు తమ విద్యా అనుభవాలను తోటివారితో పంచుకొని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యార్థినులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాయమ్మను కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌లు ఘనంగా సత్కరించారు.

ప్రజాస్వామ్యం బలోపేతానికి ఎన్నికల సంస్కరణలు అవసరం

సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్



మాట్లాడుతున్న న్యాయవాది ప్రశాంత్ భూషణ్

పెనమలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రజాస్వామ్యం బలోపేతం అవ్వాలంటే ఎన్నికల సంస్కరణలు అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ అభ్యుదయ వాది, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఉద్ఘాటించారు. కానూరు సిద్దార్థ న్యాయ కళాశాలలో ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి పునాది ప్రజాస్వామ్యమని, కానీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం మనదేశ రాజ్యాంగ లక్ష్యాల సాధనలో వెనుకబడిందని, ఎన్నికైన ప్రజాప్రతినిధులు వారిని ఎన్నుకొన్న ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కాకుండా వారి వ్యక్తిగత ఆశక్తుల కోసం పని చేస్తున్నారని పేర్కొన్నారు. భారత ఎన్నికల కమిషనర్‌గా టీఎన్ శేషన్ నుంచి 2014 వరకు ఎన్నికల కమిషన్ పక్షపాత రహితంగా వ్యవహరించిందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల కమిషన్ ఒక రబ్బరు స్టాంపుగా మారిపోయిందని విమర్శించారు.

రెండంచెల విధానంతోనే సహకార వ్యవస్థ బలోపేతం

వక్తల ఉద్ఘాటన



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

గాంధీనగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సహకార రుణ వ్యవస్థ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా ఉన్న సహకార బ్యాంకింగ్ వ్యవస్థ బతికి బట్టకట్టాలంటే రెండంచల విధానం అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రాజకీయ జోక్యం తోనే సహకార బ్యాంకింగ్ వ్యవస్థ సమస్యలను ఎదుర్కొంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సహకార సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించడం, రుణాల మంజూరు, వసూళ్లలో రాజకీయ జోక్యం మితిమీరి పోవడంతోనే అనేక బ్యాంకులు సంక్షోభంలోకి వెళ్తున్నాయని అభిప్రాయపడ్డారు. రెండంచెల విధాన డిమాండ్ సాధనకు అన్ని జిల్లా కేంద్రాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని, రైతుల నుంచి ఐదు లక్షల సంతకాలు సేకరించాలని, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాసంఘాల నుంచి మద్దతుగా లేఖలు సేకరించాలన్నారు. విజయవాడలో మహాధర్నా చేపట్టాలని సమావేశంలో తీర్మానించింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ త్వరలో చంద్రబాబును కలిసి రెండంచెల విధానాన్ని అమలు చేయాలని కోరతామన్నారు. సంఘం రాష్ట్ర చైర్మన్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర నేత కృష్ణయ్య, టీడీపీ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్, కాంగ్రెస్ నేత మస్తాన్‌వలీ, ఇప్టూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పోలారి, రైతు నేతలు ప్రసాద్, కేశవరావు, వి.జమలయ్య, ఏఐటీయూసీ నేత రామరావు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో శ్రీనివాస జూనియర్ కళాశాల డైరెక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, అధ్యాపకులు

ఇంటర్‌లో శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థుల సత్తా

ఉయ్యూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో డింపుల్ 465 మార్కులతో టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. బైపీసీలో సీహెచ్ మహాలక్ష్మి 433 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జి. రవికిరణ్ 988, పరుచూరి లిపి 987 మార్కులు సాధించారు. బైపీసీలో షబానా అజ్మి 983 మార్కులతో టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. విదార్థినీ విద్యార్థులను శ్రీశ్రీనివాస విద్యాసంస్థల డైరెక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ, కళాశాల ప్రిన్సిపాల్ యాకయ్య, అధ్యాపకులు అభినందించారు.

సొరంగంలో బైక్ దగ్ధం



వన్‌టౌన్: విద్యాధరపురం, సితార సెంటర్ సమీపంలో సొరంగం వద్ద ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైన సంఘటన శనివారం జరిగింది. దారపు రాంబాబు తన బైక్‌కు చిట్టినగర్‌లోని ఓ బంక్‌లో పెట్రోల్ పోయించుకుని సితార సెంటర్ వైపు బయలుదేరాడు. సొరంగంలోకి వెళ్లేసరికి బైక్ నుంచి మంటలు రావటం గమనించిన వెనుక ఉన్న ఓ వాహనదారుడు చెప్పటంతో రాంబాబు బైక్‌ను వదిలి పరుగెత్తాడు. బైక్ పూర్తిగా దగ్ధమైంది. ఆ మార్గంలో వచ్చే వాహనదారులు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. బైక్‌లో వైర్లు షార్ట్ సర్క్యూట్ కావటం వల్ల పూర్తిగా దగ్ధమైందని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై భవానీపురం పోలీసులను వివరణ కోరగా వాహనదారుడు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

చురుగ్గా రబీ ధాన్యం కొనుగోళ్లు

● సివిల్ సప్లయ్ డీఎం శ్రీనివాస్

కంచికచర్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చురుగ్గా రబీ ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రైతులకు సొమ్ము కూడా వెంటనే చెల్లిస్తున్నామని సివిల్ సప్లయ్ డీఎం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, నష్టపోవద్ద ని రైతులకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 107 ధాన్యం కొనుగోలు కేంద్రా లు ఏర్పాటు చేయగా, 41 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయన్నా రు. జిల్లాలో 2024-25 రబీ సీజన్ ధాన్యం సేకరణ లక్ష్యం 50వేల మె ట్రిక్ టన్నులన్నారు. ఈ నెల 2 నుంచి కొనుగోళ్లు మొదలవగా, నందిగామ డివిజన్‌లో 929.840 మెట్రిక్ టన్నులు, తిరువూరులో 1163.400 మెట్రిక్ టన్నులు, విజయవాడలో 6258.240 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.జిల్లాలో మొత్తం 538 మంది రైతుల నుంచి 8,477.08 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు చెప్పారు. కొన్న ధాన్యం విలువ రూ.17.32 కోట్లు కాగా, ఇప్పటికే రైతులకు రూ. 12.07 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. వరుసగా 3 రోజులు సెలవులు రావటంతో మిగతా నగదు రూ.5కోట్లు చెల్లింపులో కొంత జాప్యం జరిగిందని, లేదంటే ఆ మొత్తం కూడా చెల్లింపు జరిగేదన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటులు, చిత్ర బృందం

దుర్గగుడిలో నూతన చిత్రం ప్రారంభం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నూతనంగా నిర్మించనున్న చి త్రం షూటింగ్ శనివారం దుర్గమ్మ దేవస్థానంలో ప్రారంభించారు. ఈ సినిమాలో వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్ కథానాయకులుగా నటిస్తున్న ఈ చిత్రానికి దుర్గగుడి కళావేదిక మీద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ చిత్రానికి వడ్డవల్లి వెంకటేశ్వరరావు (బుల్లబ్బాయ్) క్లాప్ కొట్టగా, బేబి వేముల ధరణి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దర్శకుడుగా వీరు ఉలవల, నిర్మాత బత్తుల కోటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నటులు పవన్ కళ్యాణ్, వెన్నెల కిషోర్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్ కుమార్, వీటీవి గణేష్ నటిస్తారన్నారు

సీఐఐ - ఐడబ్ల్యుఎన్ ఏపీ

చైర్‌పర్సన్‌గా చాందిని చందన



విద్యాధరపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కాంఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐడబ్లుఎ న్) ఆంధ్రప్రదేశ్ శాఖ చైర్‌పర్సన్‌గా విజయవాడకు చెందిన చాందిన చందన ఎంపికయ్యారు. శనివారం తిరుపతిలో సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఆంధ్రప్రదేశ్ శాఖ 2025-26 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏపీ శాఖకు చైర్ పర్సన్‌గా చాందిన చందన, వైస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ ఉషా పంతులను ఎన్నుకున్నారు.



గంజాయి రవాణా దొంగలను మీడియాకు చూపిస్తున్న చిలకలపూడి సీఐ నబి, ఎస్ఐ సుబ్రహ్మణ్యం

25 కిలోల గంజాయి స్వాధీనం

● రవాణా చేస్తున్న ఐదుగురు నిందితుల అరెస్టు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మినా, రవాణా చేసిన ఉక్కుపాదం మోపుతామని చిలకలపూడి సీఐ అబ్దుల్ నబీ హెచ్చరించారు. మచిలీపట్నం మాచవరం మెట్టు వద్ద శు క్రవారం సాయంత్రం గంజాయి విక్రయించే ఐదుగురు నిందితులు వాహనాలతో దొరికిపోయారు. మచిలీపట్నానికి చెందిన నిందితులు బలగం నాగరాజు (ముస్తాఖాన్‌పేట), సింగంశెట్టి సాయిగోపీచంద్ (నవీన్‌మిట్టల్ కాలనీ), జొన్నకూటి ఉదయకిరణ్ అలియాస్ జోసఫ్ (ఆనంద పేట), షేక్ మహమ్మద్ అబ్దుల్ రియాజ్ బాషా (బుట్టాయిపేట), కాగిత జస్వంత్ అలియాస్ జెస్సీ (కొజ్జిల్లిపేట)ను శనివారం మీడియాకు చూపించారు. వీరి నుంచి 25 కిలోల 620 గ్రాముల గం జాయి, రూ.6వేల నగదు, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు బలగం నాగరాజుపై పీడీ యాక్టు న మోదు చేస్తున్నామన్నారు. మచిలీపట్నంలో దొరికిన గంజాయి సీలేరు నుంచి ఇక్కడకు వచ్చిందన్నారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



అసోసియేషన్ నేతల్ని సన్మానిస్తున్న వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలు

ఎడ్యుకేషన్ విధులకు దూరం చేయడం అన్యాయం

● వార్డు విద్య, డేటా ప్రొసెసింగ్ ఉద్యోగుల ఆవేదన

గవర్నర్‌పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయాల్లో టెక్నికల్ పోస్టుగా రిక్రూట్ కాబడిన వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలను ఎడ్యుకేషన్ విధులకు దూరం చేయడం అన్యాయమని వార్డు విద్య, డేటా ప్రాసెసింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశా రు. ఆంధ్రప్రదేశ్ వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీస్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో శనివారం లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బా బూ జగ్జీవన్‌రామ్ ఐక్యభవన్‌లో వార్డు విద్య, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి ఉద్యోగుల రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమావేశం జరిగింది. ఇందులో కార్యదర్శి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. డిగ్రీ లో కంప్యూటర్ సైన్స్ అర్హతతో ఉన్న తమకు భవిష్యత్తులో కనీసం జూనియర్ అసిస్టెంట్‌గా కూడా అవకాశం లేని పదోన్నతిని చూపించడం, టెక్నికల్ పోస్టు ఇవ్వకపోవడం అన్యాయమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమోషన్ చానల్‌ని తక్షణమే సవరించి వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీగా గుర్తించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని, న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలని సమావేశంలో తీర్మానించారు. పలువురు అసోసియేషన్ నేతల్ని ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

గో మరణాలపై కరుణాకర్‌రెడ్డి అసత్యప్రచారం: కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం గో మరణాలపై భూమన కరుణాకరరెడ్డి చేస్తున్న అసత్యప్రచారం మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉందని మాజీ ఎం పీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు కౌంటర్ ఇచ్చారు. శనివా రం ఆర్టీసీ బస్టాండ్‌కు దగ్గరలోని టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోశాలలోని ఆవులు వృద్ధాప్యం, వ్యాధులతో సగటున 10వరకు మృత్యువాత పడుతున్నాయని, ఐదేళ్ల గణాంకాలు చూస్తే అర్థమవుతుందన్నారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, డైరెక్టర్ శొంఠి శివరామకృష్ణప్రసాద్, బత్తిన దాసు, యార్లగడ్డ సీతారామయ్య, వేములు కృష్ణారావు, పామర్తి నరేష్, రాంబాబు, వీరాస్వామి పాల్గొన్నారు.



దేవినేని ఉమా కుమారుడికి సీఎం శుభాకాంక్షలు

లబ్బీపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు నిహర్ నిశ్చితార్థం విజయవాడలోని లబ్బీపేట ఏ కన్వేషన్ నందు శనివారం జరిగింది. ఈ నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిహర్, నర్మదను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

సుబ్బరాయుడి సన్నిధిలో డీజీపీ గుప్తా దంపతులు



పుట్టలో పాలుపోసి, పూజలు చేస్తున్న డీజీపీ దంపతులు

మోపిదేవి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా దంపతులు మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం ఉదయం దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలను డీజీపీ దంపతులకు అందించారు. కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ డీజీపీని దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జల్ చలో..!

ఎన్టీఆర్ - అమరావతి మధ్య లాంచీ ట్రావెల్ అదరహో

ఎన్టీఆర్ జిల్లా నుంచి అమరావతికి లాంచీ ప్రయాణం! రాజధానిలో ఉద్యోగాలు చేసే వారికి, ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో ఉద్యోగాలు చేసేవారికి ఇందులో ప్రయాణించటం అతి తక్కువ ఖర్చుగా మారిపోయింది. జల్ చలో అన్నట్టుగా ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నడుమ కృష్ణా నదిపై లాంచీ ప్రయాణం ఇప్పుడు క్రేజీగా మారిపోయింది. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలోనే గమ్యస్థానాలు చేరుకునే అవకాశం ఉండటంతో ఎంచక్కా లాంచీలకు ఆదరణ పెరిగింది. ట్రాఫిక్‌లో వెళ్లేకంటే లాహిరి లాహిరిలో అంటూ కృష్ణమ్మపై ప్రయాణం చేస్తూ ఆహ్లాదాన్ని పొందవచ్చన్న కారణంతో ప్రయాణాలు పెరుగుతున్నాయి. మండు వేసవిలో లాంచీల ప్రయాణమే బెటర్ అని నదీ ప్రయాణాకి ఆసక్తి చూపిస్తున్నారు. కృష్ణానదిలో లాంచీల ప్రయాణంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం ఫెర్రీ నుంచి గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి వరకు లాంచీలు తిరుగుతున్నాయి. కృష్ణాతీరంలో పడవల ద్వారా రాకపోకలకు, సరుకుల రవాణాకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. తుళ్లూరు గ్రామాల్లోని రైతులు కృష్ణా జలాల ఆధారంగానే జామ, అరటి, నిమ్మ, సపోట, కొబ్బరి పంటలను విరివిగా పండించేవారు. చిరు వ్యాపారులు త మ పంటలను పడవలు, లాంచీల ద్వారా ఇబ్రహీంపట్నం వైపు తీసుకువచ్చి విక్రయించుకునేవారు. దీంతో రాయపూడి వద్ద లాంచీల రేవు కోలాహలంగా ఉండేది. 2109 సెప్టెంబరు 15న తూర్పు గోదావరి జిల్లా దేవిపట్నం మండలం కచ్చులూరి వద్ద జరిగిన బోటు ప్రమాదంతో రాష్ట్ర ప్రభుత్వం బోటు ప్రయాణాన్ని పూర్తిగా నిలిపేసింది. పర్యాటకం, సరుకు రవాణా లాంచీలపై నిషేధం విధించింది. దీంతో రాయపూడి వద్ద ప్రయాణం ఆగిపోయింది. ఏడాది క్రితం లాంచీల ప్రయాణానికి ప్రభుత్వం అనుమతులివ్వడంతో ప్రస్తుతం లాంచీలు తిరుగుతున్నాయి.



కేవలం 20 నిమిషాలే

ఫెర్రీ ఘాట్ నుంచి రాయపూడి వరకు 5 కిలోమీటర్ల నదీ ప్రయాణానికి కేవలం 20 నిముషాలే పడుతుంది. అదేరోడ్డు మార్గంలో అయితే 50 కిలోమీటర్ల దూరంతో పాటు గంటన్నరపైనే పడుతుంది. ఖర్చు, సమయాన్ని ఆదా చేసుకునేందుకు లాంచీలే ఉత్తమ మార్గమని ప్రయాణికులు భావిస్తున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి విజయవాడ మీదుగా అమరావతితో పాటు రాజధాని ప్రాంతానికి బస్సులో వెళ్లినా, లేక ద్విచక్రవాహనంపై వెళ్లినా రూ.200 వరకు ఖర్చవుతుంది. అదే లాంచీలో అయితే మనిషికి రూ.50 మాత్రమే. ఒకవేళ తమతో పాటు ద్విచక్రవాహనం తీసుకెళ్లినా దానికి రూ.50 మాత్రమే చార్జి చేస్తున్నారు. దీంతో సగానికి సగం ప్రయాణ ఖర్చు కలిసి వస్తుంది. అం తేకాక గంటన్నర వరకు కలిసొచ్చే అవకాశం. ఘాట్ నుంచి గుంటూరు జిల్లా రాయపూడికి గంటకో లాం చీని లక్ష్మణ్ లాంచీ సర్వీసు వారు తిప్పుతున్నారు. ఈ లాంచీలకు ప్రజల ఆదరణ బాగానే ఉంది. 2014 నుంచి 2019 మధ్య కాలంలో అమరావతి రాజధాని ప్రాంతంలో జరిగిన పనుల సమయంలో లాంచీలకు విపరీతమైన డిమాండ్ ఉండేది. గత వైసీపీ పాలనలో పనులు నిలిచిపోవడంతో లాంచీలకు పెద్దగా ప్రయాణికులు లేకపోవడంతో ఒకటి రెండుకే లాంచీలు పరిమితమైంది. మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వంలో రాజధాని పనులు ఊపందుకుంటే మరోమారు లాంచీలకు మహర్దశ పట్టే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అయితే పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా అమరావతికి కృష్ణానదిపై నిర్మిస్తున్న వంతెన పూర్తయితే లాంచీలు ఇక కేవలం పర్యాటకానికి మాత్రమే పరిమితమయ్యే అకాశం లేకపోలేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



విడదీయరాని బంధం

ఇటు ఎన్టీఆర్ జిల్లా అటు గుంటూరు జిల్లాలో కృష్ణానదికి అటుఇటు వైపున్న గ్రామాలకు దశాబ్దాల కాలం నుంచి విడదీయరాని బంధం ఉంది. రాజధానిగా అమరావతి ప్రకటించక మునుపు గుంటూరు జిల్లాలోని నదిపక్కనే ఉన్న గ్రామాల్లో పండే అరటి పండ్లు, కూరగాయలు ఇతర పంట ఉత్పత్తులను లాంచీల ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నంకు లాంచీల ద్వారా రవాణా చేసి రింగ్ సెంటర్లో, ఫెర్రీ ఘాట్ వద్ద పెట్టి విక్రయించుకునే వారు. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు కానీ ఇబ్రహీంపట్నంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఎన్టీటీపీఎస్‌లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు గుంటూరు జిల్లా నుంచి వస్తున్నారు. అమరావతి సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు, తాపీ కార్మికులు, ఇతర పనుల వారు లాంచీల్లో ప్రయాణం చేస్తున్నారు. ముఖ్యంగా అమరావతి ప్రయాణం చేసేవారు సైతం ద్విచక్ర వాహనాలను లాంచీలో పెట్టుకొని నది ఈ దరి నుంచి ఆ దరికి లాంచీలో వెళుతుంటారు.



లైఫ్ జాకెట్లు మర్చిపోవద్దు

లాంచీలో ప్రయాణించేవారు లైఫ్ జాకెట్లు . దరించడంలో నిర్లక్ష్యం వహించకూడదు. లాంచీ సిబ్బందిని అడిగి మరీ లైఫ్ జాకెట్ వేసుకోవాలి. అది భారం కాదు. మీ భద్రతగా భావించాలి. జరగరాని ప్రమాదం జరిగితే లైఫ్ జాకెట్ రక్షణగా నిలుస్తుంది. అంతేకాక లాంచీ డ్రైవర్ చెప్పే జాగ్రత్తలు పాటించడం మర్చిపోవద్దు. అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే వస్తువులు తీసుకెళ్లకుండా ఉంటే మంచిది. జాగ్రత్తలు పాటించండి. సురక్షితంగా ప్రయాణం చేయండి అని పలువురు ప్రయాణికులకు సూచిస్తుంటారు.

నా తొలి ప్రాధాన్యత లాంచీకే

షేక్ గౌస్ జానీ, పశ్చిమ ఇబ్రహీంపట్నం



రోడ్డు మార్గం కంటే జల మార్గమే సేఫ్ అని నా అభిప్రాయం. నా తొలి ప్రాధాన్యత లాంచీ ప్రయాణానికే. పైగా ప్రయాణ ఖర్చులు కలిసి వస్తున్నాయి. ఎలాంటి రిస్కు ఉండదు. లైఫ్ జాకెట్లు ఇస్తుంటారు.

లాంచీ ప్రయాణం ఇష్టం

ఆర్ సందీప్, కొండపల్లి



లాంచీ ఎక్కడం ఇది రెండో సా రి. ఈ ప్రయాణం అంటే నాకు ఎంతో ఇష్టం. ఇకపైనా లాంచీలోనే వెళతాను. కృష్ణానది అందాలను తనివితీరా చూసే అవకాశం లాంచీ ప్రయాణం ద్వారానే కలుగుతుం ది. అందుకే లాంచీలోనే వెళ్లాలకున్నాను.

అమరావతిలో తాపీ పనికి వెళుతున్నాం

రవి, జూపూడి



రాజధాని అమరావతిలో జరిగే భవన నిర్మాణ పనులకు ప్రతిరోజు లాంచీ ప్రయాణం చేస్తాం. మొత్తం 20మంది వరకు ఒకే లాంచీలో వెళతాం. ప్రస్తుతం పనులు బాగానే ఉన్నాయి. పనులు ఊపందుకుంటే మరింతమంది కార్మికులతో వెళతాం.

పనులు ఊపందుకోవాలి

కాశీరాజు, లాంచీ డ్రైవర్




రాజధాని అమరావతిలో పనులు ఊపందుకుంటే లాంచీలకు మంచి గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం నష్టం రాకుండా తిప్పగలుగుతున్నాం. ప్రయాణికుల భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా లైఫ్ జాకెట్లు ఇస్తున్నాం. నాకు 30 ఏళ్ల అనుభవం ఉంది. లైసెన్స్ ఉంది.

దేశసేవకు బసవపున్నయ్య జీవితం అంకితం

● వర్ధంతి సభలో మాజీ ఎంపీ మధు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య ఉద్యమంకాలం నుంచి తన జీవితాన్ని దేశ సేవకు అంకితం చేసిన వ్యక్తి దివంగత మాకినేని బసవపున్నయ్య నేటితరం కమ్యూనిస్టు నేతలకు ఆదర్శనీయుడని మాజీ ఎంపీ ఎంబీవీకె ట్రస్ట్ చైర్మన్ పి.మధు అన్నారు. ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో శనివారం బసవపున్నయ్య వర్ధంతి సభ జరిగింది. ముందుగా బసవపున్నయ్య చిత్రపటానికి పలువురు నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. సభకు ఎంబీవీకే కమిటీ సభ్యుడు యూవీ రామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రంలో మహిళలకు బ్యూటీషియన్, కుట్టుశిక్షణ, కంప్యూటర్ శిక్షణతో పాటు పిల్లలకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ట్రస్ట్ కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టుగా ప్రజా పోరాటాల్లో పాల్గొన్న బసవపున్నయ్య సాయుధ పోరాటంలో, సాహిత్య రంగంలో కృషి చేశారన్నారు. ఎంబీవీకేలో బ్యూటీషియన్ కోర్సు శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సభ్యులు కె.స్వరూపరాణి, పి.విజయ, జి.నారాయణ పాల్గొన్నారు.



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ సుగుణ, తదితరులు

జర్నలిస్ట్స్ భూముల్లో ఆక్రమణల తొలగింపు

● స్వయంగా పర్యవేక్షించిన రూరల్ తహసీల్దార్ సుగుణ

విజయవాడ రూరల్, ఏప్రి ల్ 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ నున్న గ్రామ పంచాయతీ పరిధిలోని జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ స్థలాల్లో ఆక్రమణలను శనివారం అధికారులు తొలగించారు. రూరల్ ఎమ్మార్వో సుగుణ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలను తొలగించారు. 2008లో పంచాయతీ పరిధిలోని సర్వే నెం.751, 752లో ప్రభుత్వం జర్నలిస్ట్‌లకు ఇళ్లస్థలాల నిమిత్తం 3.52 ఎకరాలు కేటాయించింది. 17 ఏళ్లల్లో సదరు భూముల్లో అనేక ఆక్రమణలు వెలిశాయి. ఈ విషయమై ఇటీవల జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ సభ్యులు మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో పాటుగా కలెక్టర్ లక్ష్మీశ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. ఆక్రమణల తొలగింపు పనులను పర్యవేక్షించిన ఎమ్మార్వో సుగుణ జర్నలిస్ట్ సొసైటీకి కేటాయించిన భూముల్లో ఆక్రమణలను దాదాపు తొలగించామని మరికొన్ని ఆక్రమణలు కోర్టు పరిధిలో ఉన్నాయని కోర్టు ఉత్తర్వుల అనంతరం అవసరమైన చర్యలు చేపడతామన్నారు.

ఆగని మట్టి, ఇసుక మాఫియా

తిరువూరు నియోజకవర్గంలో యథేచ్ఛగా తవ్వకాలు ● వెంట్రప్రగడలోనూ ఇదే దుస్థితి

తిరువూరు, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి) నియోజకవర్గం పరిధిలోని పలు మండలాల్లో అక్రమ మట్టితోలకాలు యథేశ్ఛగా సాగుతున్నాయనే, ఆరోపణలు వినిపిస్తున్నాయి. శనివారం విస్సన్నపేట మండలం తాతకుంట్ల శివారు గౌరం పాలెం సమీపంలో పగలే మట్టితోలకాలు చేస్తున్న అధికారులెవరూ ఆ వైపు చూసిన దాఖలాలు లేవు. నియోజవకవర్గంలోని ఏ కొండూరు మండలం గోపాలపురంలో పెద్ద ఎత్తున జరుగుతున్న మట్టి తోలకాలపై రాష్ట్రస్థాయిలో సంచలనం కల్గించడంతో మట్టిమాఫియా మరోప్రాంతంలో మట్టి తోలకాలు చేపట్టినట్టు తెలుస్తోంది. తిరువూరు మండలంలోని మల్లేల, నర్మాధనగరంలో మట్టితోలకాలు జరిగాయి. విస్సన్నపేట మండలం కోటిపల్లి అటవీ ప్రాంతంలో ఇటీవల భారీగా ఎక్స్‌కవేటర్లు టిప్పర్లతో మట్టిని తోలకాలు, యథేశ్ఛగా కొనసాగించారు. ఇటీవల ఏ కొండూరు మండలంలో మట్టి టిప్పర్లను పోలీసులు పట్టుకున్నా, సంబంధిత వ్యక్తులపై ఎటువంటి కేసు నమోదవలేదు. తిరువూరు శివారు బోర్డర్ చెక్‌పోస్టు వద్ద నిఘా లేకపోవడంతో, మట్టితోపాటుగా, ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. పట్టణం సరిహద్దుల్లో ఇటీవల ఇసుక టిప్పర్లు పట్టుకొని కొన్ని రోజులు స్టేషన్ వద్ద ఉంచి తదుపరి విడిచిపెట్టడంపై పట్టణంలో పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాతాకుంట్ల మట్టితొలకాలపై రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదులు వెళ్లడంతో, మట్టితోలకాలు చేస్తున్న ట్రాక్టర్లను నిలుపుదల చేశారు. కాగా అక్రమ మట్టితోలకాలపై అధికారుల అనుమతులు లేకుండా మట్టి ఇసుక తోలకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. సరిహద్దుల వద్ద నిఘా పెడతామని చెపుతున్నారు.



గౌరంపాలెం మట్టి తోలకాలు చేస్తున్న ట్రాక్టర్

వెంట్రప్రగడలో మట్టితవ్వకాలపై స్పందించరేం..!

పెదపారుపూడి: మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో ముదునూరు రోడ్డు కరెంట్ టవర్ వద్ద మట్టిని తరలిస్తుంటే అధికారులు కన్నెత్తి చూడలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వెంట్రప్రగడ గ్రామంలో బ్రాందీ షాప్ పక్క స్థలాన్ని చేయటానికి కోసం మట్టి తరలిస్తున్నారు. అలాగే పాఠశాల ఎదురుగా ఉన్న స్థలంలో మెరక చేయటానికి మట్టి తరలిస్తున్నారు. టవర్ చుట్టూ మట్టి తవ్వకంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు గానీ, విద్యుత్ అధికారులు గానీ పట్టించుకోవటం లేదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ట్రాక్టర్ మట్టి రూ.1500 నుంచి రూ.2వేలు వరకు విక్రయిస్తున్నారని వాపోతున్నారు.

అమరావతిలో సమస్యలను పరిష్కరించండి

● ఎమ్మెల్యే, సీఆర్‌డీఏ కమిషనర్‌కు రైతుల వినతి

గవర్నర్‌పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలో రోడ్ల విస్తరణ పనుల కారణంగా మందడం, రాయపూడి, వెలగపూడి గ్రామాల్లో దేవాలయాలు, స్మశాన వాటికల స్థలాలు కోల్పోయినట్టు స్థానిక ప్రజలు సీఆర్‌డీఏ ఉన్నతాధికారుల ముందు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు తగిన పరిష్కారం చూపాలని కోరుతూ శనివారం విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో గ్రామస్థులు తమ ఫిర్యాదులను విన్నవించారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ సమక్షంలో గ్రామస్థులు సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబును కలిసి, కోల్పోయిన దేవాలయాలు, స్మశాన వాటికలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. తమ గ్రామాల సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు గ్రామస్థుల ఫిర్యాదులను ఆలకించి వారి సమస్యలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.



సీఆర్‌డీఏ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ సమక్షంలో కమిషనర్ కన్నబాబుకు సమస్యలు చెప్పుకొంటున్న రైతులు

గుజరాత్ జోరుకు బ్రేక్

చెలరేగిన పూరన్, మార్‌క్రమ్

6 వికెట్లతో లఖ్‌నవూ విజయం ● గిల్, సుదర్శన్ శ్రమ వృథా



మార్‌క్రమ్ (58)

పూరన్ (34 బంతుల్లో 61)

లఖ్‌నవూ: నికోలస్ పూరన్ (34 బంతుల్లో ఫోర్, 7 సిక్సులతో 61) సుడిగాలి ఇన్నింగ్స్‌తో.. గుజరాత్ టైటాన్స్ నాలుగు వరుస విజయాల జోరుకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ) బ్రేకులు వేసింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో లఖ్‌నవూ 6 వికెట్ల తేడాతో గుజరాత్‌ను ఓడించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లలో 180/6 స్కోరు చేసింది. శుభ్‌మన్ గిల్ (60), సాయి సుదర్శన్ (56) హాఫ్ సెంచరీలు వృథా అయ్యాయి. శార్దూల్ ఠాకూర్, బిష్ణోయ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో లఖ్‌నవూ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 186 పరుగులు చేసి నెగ్గింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మార్‌క్రమ్ (58) కూల్‌గా ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. ప్రసిద్ధ్ కృష్ణకు 2వికెట్లు దక్కాయి. వరుసగా విఫలమవుతున్న కెప్టెన్ రిషభ్ పంత్ (21) ఓపెనర్‌గా రావడం విశేషం.

అలవోకగా..: ఓ మాదిరి లక్ష్య ఛేదనలో మార్‌క్రమ్, పంత్ తొలి వికెట్‌కు 38 బంతుల్లో 68 పరుగులతో అదిరే ఆరంభాన్నిచ్చారు. పంత్‌ను కృష్ణ అవుట్ చేసినా.. వన్‌డౌన్‌లో వచ్చిన పూరన్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడడంతో మ్యాచ్ వన్‌సైడ్‌గా మారింది. దీంతో ఎల్‌ఎస్‌జీ 114/1తో గెలుపు దిశగా దూసుకెళ్లింది. అయితే, మార్‌క్రమ్‌ను కృష్ణ వెనక్కిపంపడంతో.. రెండో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివరి 5 ఓవర్లలో గెలుపునకు 27 పరుగులు కావల్సి ఉండగా.. హాఫ్ సెంచరీ చేసిన పూరన్‌ను రషీద్ వెనక్కిపంపాడు. మిల్లర్ (7)ను సుందర్ బౌల్డ్ చేశాడు. కానీ, బదోని (28 నాటౌట్), సమద్ (2 నాటౌట్) 3 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు.

ఆరంభం అదిరినా..: గిల్, సుదర్శన్ అదిరే అర్ధ శతకాలతో పటిష్ఠ పునాది వేసినా.. మిడిలార్డర్ వైఫల్యంతో గుజరాత్ 180 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్లు గిల్, సుదర్శన్ తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో.. టైటాన్స్ రికార్డు స్కోరు చేస్తుందని భావించారు. కానీ, వరుస ఓవర్లలో సెటిల్డ్ బ్యాటర్లు పెవిలియన్ చేరారు. చివరి 8 ఓవర్లలో 60 పరుగులు మాత్రమే ఇచ్చి 6 వికెట్లు పడగొట్టారు. 13వ ఓవర్ తొలి బంతికి గిల్‌ను అవేశ్ క్యాచవుట్ చేసి.. జట్టుకు బ్రేక్ అందించాడు. ఆ తర్వాతి ఓవర్‌లో సుదర్శన్‌ను బిష్ణోయ్ పెవిలియన్ చేర్చడంతో టైటాన్స్ 122/2తో నిలిచింది. సుందర్ (2)ను బిష్ణోయ్ బౌల్డ్ చేయగా.. బట్లర్ (16)ను రాఠీ వెనక్కిపంపడంతో ఒక్కసారిగా సీన్ మారింది. ఆఖరి ఓవర్‌లో రూథర్‌ఫోర్డ్ (22), తెవాటియా (0)ను శార్దూల్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) పూరన్ (బి) బిష్ణోయ్ 56, గిల్ (సి) మార్‌క్రమ్ (బి) అవేశ్ 60, బట్లర్ (సి) శార్దూల్ (బి) రాఠీ 16, సుందర్ (బి) బిష్ణోయ్ 2, రూథర్‌ఫోర్డ్ (ఎల్బీ) శార్దూల్ 22, షారుక్ ఖాన్ (నాటౌట్) 11, తెవాటియా (సి) మార్‌క్రమ్ (బి) శార్దూల్ 0, రషీద్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 180/6; వికెట్ల పతనం:** 1-120, 2-122, 3-127, 4-145, 5-176, 6-176; **బౌలింగ్:** శార్దూల్ 4-0-34-2, ఆకాశ్ దీప్ 3-0-33-0, దిగ్వేష్ రాఠీ 4-0-30-1, అవేశ్ ఖాన్ 4-0-32-1, బిష్ణోయ్ 4-0-36-2, మార్‌క్రమ్ 1-0-15-0.

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (సి) గిల్ (బి) ప్రసిద్ధ్ 58, పంత్ (సి) సుందర్ (బి) ప్రసిద్ధ్ 21, పూరన్ (సి) షారుక్ (బి) రషీద్ 61, అయుష్ బదోని (నాటౌట్) 28, మిల్లర్ (బి) సుందర్ 7, సమద్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 19.3 ఓవర్లలో 186/4; వికెట్ల పతనం:** 1-65, 2-123, 3-155, 4-174; **బౌలింగ్:** సిరాజ్ 4-0-50-0, అర్షద్ ఖాన్ 2-0-11-0, ప్రసిద్ధ్ కృష్ణ 4-0-26-2, రషీద్ 4-0-35-1, వాషింగ్టన్ సుందర్ 4-0-28-1, సాయి కిశోర్ 1.3-0-35-0.

నేటి మ్యాచ్‌లు

రాజస్థాన్ x బెంగళూరు — మ.3.30 నుంచి — వేదిక: జైపూర్

ఢిల్లీ x ముంబై — రా.7.30 నుంచి — వేదిక: ఢిల్లీ

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	4	4	0	0	8	1.278
గుజరాత్	6	4	2	0	8	1.081
లఖ్‌నవూ	6	4	2	0	8	0.162
కోల్‌కతా	6	3	3	0	6	0.803
బెంగళూరు	5	3	2	0	6	0.539
పంజాబ్	5	3	2	0	6	0.065
రాజస్థాన్	5	2	3	0	4	-0.733
హైదరాబాద్	6	2	4	0	4	-1.245
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	6	1	5	0	2	-1.554

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) నితీశ్ (బి) హర్షల్ 36, ప్రభ్‌సిమ్రన్ (సి) కమిన్స్ (బి) మలింగ 42, శ్రేయాస్ (సి) హెడ్ (బి) హర్షల్ 82, నేహల్ వధేరా (ఎల్బీ) మలింగ 27, శశాంక్ (ఎల్బీ) హర్షల్ 2, మ్యాక్స్‌వెల్ (బి) హర్షల్ 3, స్టొయినిస్ (నాటౌట్) 34, జాన్సెన్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 245/6; వికెట్ల పతనం:** 1-66, 2-91, 3-164, 4-168, 5-205, 6-206; **బౌలింగ్:** షమి 4-0-75-0, కమిన్స్ 4-0-40-0, హర్షల్ 4-0-42-4, ఇషాన్ మలింగ 4-0-45-2, జీషన్ 4-0-41-0.

సన్‌రైజర్స్: హెడ్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) చాహల్ 66, అభిషేక్ (సి/సబ్) ప్రవీణ్ దూబే (బి) అర్షదీప్ 141, క్లాసెన్ (నాటౌట్) 21, ఇషాన్ (నాటౌట్) 9, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 18.3 ఓవర్లలో 247/2; వికెట్ల పతనం:** 1-171, 2-222; **బౌలింగ్:** అర్షదీప్ 4-0-37-1, జాన్సెన్ 2-0-39-0, యష్ ఠాకూర్ 2.3-0-40-0, మ్యాక్స్‌వెల్ 3-0-40-0, ఫెర్గూసన్ 0.2-0-1-0, స్టొయినిస్ 0.4-0-6-0, చాహల్ 4-0-56-1, శశాంక్ 2-0-27-0.

1

సన్‌రైజర్స్‌పై అత్యధిక పవర్‌ప్లే పరుగులు (89) సాధించిన జట్టుగా పంజాబ్.

ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు (141) సాధించిన భారత ఆటగాడిగా అభిషేక్. ఓవరాల్‌గా మూడో ప్లేయర్.

ఐపీఎల్‌లో పంజాబ్‌కిది రెండో అత్యధిక స్కోరు (245/6). కోల్‌కతాపై ఎక్కువ రన్స్ (262/2) సాధించింది.

2

ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక ఛేజింగ్ (246) చేసిన జట్టుగా సన్‌రైజర్స్

ఓ ఐపీఎల్ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు (0/75) సమర్పించుకున్న రెండో బౌలర్‌గా షమి. ఆర్చర్ (0/76) టాప్‌లో ఉన్నాడు.

ప్లేఆఫ్స్‌కు భారత అమ్మాయిలు



పుణె: తెలుగమ్మాయిలు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లిలతో కూడిన భారత టెన్నిస్ మహిళల జట్టు చరిత్ర సృష్టించింది. బిల్లీజీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 టోర్నీలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. శనివారం ఇక్కడ జరిగిన పోరులో భారత్ 2-1తో కొరియాను ఓడించి ఈ ఘనత సాధించింది. ఈ టోర్నీలో ప్లేఆఫ్స్ చేరడం భారత్‌కిది రెండోసారి మాత్రమే. అంతకుముందు 2020లో ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టింది.

సురేఖ జోడీకి పసిడి




న్యూఢిల్లీ: తెలుగు ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా చాటింది. అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడాలో జరుగుతున్న ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 1 పోటీల్లో రిషభ్ యాదవ్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఫైనల్లో సురేఖ-రిషభ్ జోడీ 153-151తో చైనీస్ తైపీ ద్వయం హువాంగ్ జో - చెన్ చి లున్‌పై విజయం సాధించింది. ఇప్పుడు సురేఖ గెలిచిన కాంపౌండ్ మిక్స్‌డ్ ఈవెంట్‌నే 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెడుతున్నట్టు ఇటీవల అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ప్రకటించిన సంగతి తెలిసిందే. విజయవాడ ఆర్చర్ సురేఖకు ప్రపంచ కప్‌లో ఇది 11వ పసిడి పతకం.

అభిషేక్ చేశాడు

40 బంతుల్లోనే శతకం

246 పరుగులను ఛేదించిన సన్‌రైజర్స్

పంజాబ్‌కు షాక్



సెంచరీ అనంతరం 'ఇది ఆరెంజ్ ఆర్మీ కోసం' అంటూ రాసిన కాగితాన్ని చూపిస్తున్న అభిషేక్

అభిషేక్ శర్మ (141) (55 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్సర్లతో)

హైదరాబాద్: ఇదీ సన్‌రైజర్స్ సత్తా.. అంటూ ఓపెనర్ అభిషేక్ శర్మ (55 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్సర్లతో 141) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రికార్డులను తిరగరాస్తూ సాగిన అతడి విధ్వంసానికి ఉప్పల్ స్టేడియం ఊగిపోయింది. కొడితే సిక్సర్ లేదంటే ఫోర్ అనే మాదిరిగా సాగిన బాదుడుకు, పంజాబ్ కింగ్స్ సాధించిన భారీ స్కోరు కూడా చిన్నబోయింది. దీంతో వరుసగా నాలుగు ఓటములకు చెక్ పెడుతూ రైజర్స్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 245 పరుగులు చేసింది. శ్రేయాస్ (82), ప్రభ్‌సిమ్రన్ (42), ప్రియాన్ష్ (34), స్టొయినిస్ (34 నాటౌట్) వేగం కనబర్చారు. హర్షల్‌కు నాలుగు, ఎషాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలో 2 వికెట్లకు 247 పరుగులు చేసి గెలిచింది. హెడ్ (66), క్లాసెన్ (21 నాటౌట్) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు.

ఏమా బాదుడు..?: 246 పరుగుల ఛేదనలో సన్‌రైజర్స్ ఏ దశలోనూ వెనక్కితగ్గలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ వాయువేగంతో పరుగులు రాబట్టగా.. అటు మరో ఓపెనర్ హెడ్ చక్కగా సహకరించాడు. పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై ఈ ఇద్దరూ వీరంగమే ఆడారు. అయితే 29 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అభిషేక్ క్యాచ్ అవుటైనా అది నోబ్‌గా తేలడంతో బతికిపోయాడు. ఇక పవర్‌ప్లేలో 83 రన్స్‌తో జట్టు ఛేదన వైపు వేగంగా సాగింది. ఎట్టకేలకు 13వ ఓవర్‌లో హెడ్‌ను చాహల్ అవుట్ చేయగా తొలి వికెట్‌కు 171 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ అదే ఓవర్‌లో సింగిల్‌తో అభిషేక్ 40 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి 'ఇది ఆరెంజ్ ఆర్మీ కోసం' అంటూ ఓ పేపర్‌ను చూపాడు. వన్‌డౌన్‌లో క్లాసెన్ క్రీజులోకి వచ్చినా అభిషేక్‌దే హవా సాగింది. బౌండరీలతో హోరెత్తిస్తూ లక్ష్యాన్ని వేగంగా కరిగించాడు. చివరకు 23 బంతుల్లో 24 రన్స్ కావాల్సిన వేళ అర్షదీప్‌కు చిక్కాడు. ఆ తర్వాత క్లాసెన్ బౌండరీల హోరుతో మరో 9 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

పంజాబ్ దూకుడు: టాస్ గెలవగానే పంజాబ్ బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ శివాలెత్తారు. మధ్య ఓవర్లలో శ్రేయాస్, ఆఖర్లో స్టొయినిస్ ఫినిషింగ్‌కు పంజాబ్ అవలీలగా 220 స్కోరు దాటేసింది. అలాగే రైజర్స్ పేలవ ఫీల్డింగ్ కూడా భారీ స్కోరుకు దోహదపడింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్ ప్రభ్ హ్యాట్రిక్ ఫోర్లతో ఆరంభమైంది. ఇక రెండో ఓవర్‌లో ప్రియాన్ష్ 6,4తో పాటు.. తర్వాతి ఓవర్‌లోనే అతడి 6,6,4తో జట్టు 18 బంతులకే 53 పరుగులతో వావ్ అనిపించింది. అయితే హర్షల్ ఓవర్‌లో సిక్సర్ బాదిన వెంటనే ఆర్య విడ్ వికెట్‌లో నితీశ్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆరో ఓవర్‌లో కెప్టెన్ శ్రేయాస్ సిక్సర్‌తో జట్టు పవర్‌ప్లేలో 89/1 స్కోరుతో నిలిచింది. కానీ తర్వాతి ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్‌ను కొత్త పేసర్ ఎషాన్ మలింగ అవుట్ చేశాడు. ఈ స్థితిలో శ్రేయాస్ బాధ్యత తీసుకుని రన్‌రేట్ తగ్గకుండా చూశాడు. నేహల్ (27)తో కలిసి మూడో వికెట్‌కు 73 పరుగులు జోడించాడు. 12వ ఓవర్‌లో శ్రేయాస్ 6,4,6తో 20 రన్స్ సమకూరాయి. ఈ జోరుతో అతడు 21 బంతుల్లోనే తన ఫాస్టెస్ట్ ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. వరుస ఓవర్లలో నేహల్ (27), శశాంక్ (2)ల వికెట్లను కోల్పోయినా శ్రేయాస్ దూకుడు తగ్గించలేదు. 17వ ఓవర్‌లో అతడి నాలుగు ఫోర్లతో జట్టు 200 దాటింది. అయితే తర్వాతి ఓవర్‌లో 5 పరుగులే ఇచ్చిన హర్షల్.. మ్యాక్స్‌వెల్ (3), శ్రేయాస్ వికెట్లతో ఝలక్ ఇచ్చాడు. కానీ ఆఖరి ఓవర్‌లో స్టొయినిస్ నాలుగు సిక్సర్లతో షమి ఏకంగా 27 రన్స్ సమర్పించుకున్నాడు.

ఐఎస్‌ఎల్ విజేత మోహన్ బగాన్

కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టైటిల్‌ను మోహన్ బగాన్ సూపర్ జెయింట్స్ సొంతం చేసుకొంది. శనివారం జరిగిన ఫైనల్లో మోహన్ బగాన్ 2-1తో బెంగళూరు ఎఫ్‌సీపై గెలిచింది. సెకండాఫ్ 49వ నిమిషంలో రోడ్రిగ్వెజ్ సెల్ఫ్ గోల్ చేయగా బెంగళూరు 1-0 ఆధిక్యంలో నిలిచింది. కానీ, 72వ నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్‌తో గోల్ చేయగా స్కోర్లు సమమయ్యాయి. ఆ తర్వాత 96వ నిమిషంలో మెక్‌లారెన్ గోల్‌తో మోహన్ బగాన్ 2-1తో పైచేయి సాధించింది.

జంటగా గృహ రుణం తీసుకుంటున్నారా!



అయితే ఈ జాగ్రత్తలు తప్పనిసరి

మన దేశంలోనూ ఉమ్మడి గృహ రుణాలు పెరిగి పోతున్నాయి. కొత్త ఇల్లు కొనుక్కునేందుకు లేదా కట్టుకునేందుకు యువ దంపతులు, ముఖ్యంగా వేరు కాపురాలు పెట్టుకునే జంటలు ఈ తరహా గృహ రుణాలకు మొగ్గు చూపుతున్నారు. అంతేకాదు ఇలాంటి రుణాలతో కుటుంబంపై కొంత భారం తగ్గుతుందని కొందరు.. బాధ్యతాయుతంగా వ్యవహరించ వచ్చని కొందరు భావిస్తుంటారు. అయితే ఈ రుణాల చెల్లింపు బాధ్యత ఒకరికి బదులు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది తీసుకుంటారు. ఈ ఉమ్మడి గృహ రుణాల్లో అనేక సానుకూలతలతో పాటు ప్రతికూలతలూ ఉన్నాయి. అవేమిటంటే..

అనుకూలతలు

అధిక రుణ అర్హత: ఇద్దరి ఆదాయాలు కలపడంతో అధిక రుణ అర్హత ఏర్పడుడుతుంది. దాంతో ఖరీదైన ఇల్లు లేదా ఫ్లాట్ కొనుక్కోవడం తేలిక అవుతుంది.

చెల్లింపు బాధ్యత: ఉమ్మడి గృహ రుణాల చెల్లింపు బాధ్యత ఒకరి కంటే ఎక్కువ మందిపై ఉంటుంది. దీంతో సమయానికి రుణ కిస్తీలు చెల్లించడాన్ని సహ దరఖాస్తుదారులు అందరూ బాధ్యతగా స్వీకరిస్తారు.

అధిక అవకాశాలు: ఇద్దరు ముగ్గురి ఆదాయాలు స్పష్టంగా కనిపించడంతో బ్యాంకులు, గృహ ఫైనాన్స్ కంపెనీలు ఉమ్మడి గృహ రుణాల దరఖాస్తులను ఆమోదించే అవకాశాలు ఎక్కువ.

పన్ను ప్రయోజనాలు

ఉమ్మడిగా గృహ రుణం తీసునే అందరికీ సెక్షన్ 80సీ కింద, 24 (బీ) కింద పన్ను పయోజనాలు లభిస్తాయి.

మహిళలకు తక్కువ వడ్డీ రేటు: ఫస్ట్ కో అప్లికెంట్ లేదా ప్రధాన అప్లికెంట్ మహిళలు అయి ఉంటే వడ్డీ రేటు కూడా కొద్దిగా తక్కువగా ఉంటుంది.

ప్రతికూలతలు

చెల్లింపు సమస్యలు: ఉమ్మడి గృహ రుణ ఈఎంఐల చెల్లింపు బాధ్యత అందరిపై సమానంగా ఉంటుంది. ఈ విషయంలో ఏ ఒక్కరు విఫలమైనా ఆ భారం మిగతా వారిపై పడుతుంది.

క్రెడిట్ స్కోరుపై ప్రభావం: ఈఎంఐల చెల్లింపులో విఫలమైనా లేదా ఆలస్యమైనా అది ఉమ్మడిగా రుణం తీసుకున్న అందరి పరపతి స్కోరును దెబ్బతీస్తుంది. దాంతో భవిష్యత్‌లో ఏమైనా రుణాలు తీసుకోవాల్సి వస్తే, సమస్యలు వస్తాయి.

రుణ సేకరణ సామర్థ్యం తగ్గిపోవడం: ఉమ్మడి గృహ రుణం చెల్లించడం సహ దరఖాస్తుదారులు అందరి బాధ్యత.ఈ బాధ్యత పూర్తయ్యే వరకు వీరికి ఠ వ్యక్తిగత రుణాలు పెద్దగా లభించవు.

ఆర్థిక సవాళ్లు: ఇవి దీర్ఘకాలిక రుణాలు. వీటి చెల్లింపులు పూర్తయ్యే సరికి దాదాపు పాతిక, ముప్పై సంవత్సరాల సమయం పడుతుంది. ఈ లోపు ఉద్యోగాలు పోవడం, ఆర్థిక మాంద్యం, ఇతర సమస్యలు ఏర్పడితే చెల్లింపు సమస్యలు ఏర్పడి ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యే ప్రమాదం ఉంది.

వివాదాలు న్యాయ సమస్యలు: ఈ రుణాల చెల్లింపునకు సంబంధించి సహ అప్లికెంట్స్ మధ్య చక్కటి సఖ్యత, సమన్వయం ఉండాలి. లేకపోతే వివాదాలు, కోర్టు కేసులు, అపోహలు తలెత్తి మానవ సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

ఆరోగ్య బీమాకు రైడర్ల బూస్ట్

ఈ రోజుల్లో కార్పొరేట్ వైద్యం చాలా ఖరీదుతో కూడిన వ్యవహారం. అందుకే ఆరోగ్య బీమా ఎంతో అవసరం. లేదంటే ఆస్తులు అర్పించుకోవాల్సిందే. ఒక్కోసారి బీమా కవరేజీ ఉన్నప్పటికీ, అదనంగా మన జేబు నుంచి ఖర్చు పెట్టాల్సి రావచ్చు. ఎందుకంటే, ఎంత సమగ్ర పాలసీ అయినా కొన్ని సందర్భాల్లో పాలసీదారు ప్రత్యేక అవసరానికి కవరేజీ కల్పించడంలో విఫలం కావచ్చు. అలాంటప్పుడే బీమా రైడర్లు పనికొస్తాయి. పాలసీ కవరేజీ లేమి లేదా అంతరాన్ని భర్తీ చేయడంతో పాటు పాలసీదారు ప్రత్యేక అవసరాలను తీర్చడం ద్వారా సంపూర్ణ రక్షణ కల్పిస్తాయి.

సమగ్ర కవరేజీ ఆవశ్యకత: వైద్య ఖర్చులు వేగంగా పెరుగుతున్న తరుణంలో వ్యక్తులు, కుటుంబాలు తమ ఆరోగ్యంతో పాటు ఆదాయాన్ని రక్షించుకోడం తప్పనిసరి. ఎందుకంటే, జీవనశైలి సమస్యలు పెరుగుతున్నాయి. ఇందుకు తోడు కొత్త వ్యాధులు ప్రబలుతున్నాయి. ఆరోగ్య బీమా కవరేజీ కలిగి ఉండటం కేవలం భవిష్యత్‌కు భద్రత మాత్రమే కాదు. మన భవిష్యత్ ఆర్థిక ప్రణాళికలోనూ అత్యవసర భాగం. అయితే, ఒకే ఆరోగ్య బీమా పాలసీ అందరి అవసరాలను తీర్చలేదు. బీమా రైడర్ల ద్వారా సమగ్ర కవరేజీ పొందవచ్చు.

రైడర్లు అంటే..: బీమా పాలసీ కవరేజీ పరిధిని మరింత విస్తరించేందుకు అదనపు ఫీచర్లు లేదా ఆఫర్ల జోడింపే రైడర్. ఇది మీ పాలసీ కవరేజీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఊహించని ఆరోగ్య అత్యయిక సందర్భాల్లోనూ మిమ్మల్ని సంసిద్ధులుగా ఉంచుతుంది. మీ ఆర్థిక భవిష్యత్ అనిశ్చితిలోకి జారుకోకుండా కాపాడుతుంది. క్యాన్సర్ వంటి పెద్ద జబ్బులు, తీవ్ర అనారోగ్యాల వైద్యానికి కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్, యాక్సిడెంటల్ డెత్ రైడర్, ప్రసవ ఖర్చులకూ కవరేజీ కల్పించే రైడర్ ఇందుకు కొన్ని ఉదాహరణలు. వీటి ద్వారా మీ పాలసీ కవరేజీలోని అంతరాలను భర్తీ చేయవచ్చు.

బిజినెస్ ప్లస్

ప్రయోజనాలు

అదనపు కవరేజీ: బీమా రైడర్లు మీ పాలసీ కవరేజీ పరిధిని విస్తరిస్తాయి. ఉదాహరణకు, క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్ ఏదైనా పెద్ద జబ్బు చేసినప్పుడు వైద్యానికయ్యే భారీ ఖర్చుకు కవరేజీ కల్పిస్తుంది.

అవసరానికి అనుగుణంగా మార్పులు: ఆరోగ్య అవసరాలు వ్యక్తిని బట్టి మారుతుంటాయి. బీమా రైడర్లు మీ వ్యక్తిగత, ప్రత్యేక అవసరాలను తీరుస్తాయి. అలాగే, మీ కవరేజీ అవసరానికి మాత్రమే ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది.

వెసులుబాటు: మీ జీవిత దశలు, ఆర్యోగ ప్రాధాన్యాల ఆధారంగా ఆరోగ్య బీమా పాలసీ కవరేజీ కావాల్సినప్పుడు మార్చుకునే వెసులుబాటును రైడర్లు కల్పిస్తాయి.

తక్కువ ఖర్చు: ఒక్కో అవసరం కోసం ప్రత్యేక పాలసీ కొనుగోలు చేయడం కంటే రైడర్ల ఎంపిక ద్వారా అదనపు కవరేజీ పొందడం తక్కువ ఖర్చుతో కూడిన ప్రక్రియ.

ఆర్థిక భద్రత: ఊహించని వైద్య అవసరాలకూ కవరేజీ కల్పించడం ద్వారా రైడర్లు మీ ఆరోగ్యంతో పాటు ఆదాయం, ఆస్తులకూ అదనపు రక్షణ కల్పిస్తాయి.

పరిమితులు

వెయిటింగ్ పీరియడ్: చాలా వరకు బీమా రైడర్లు వెయిటింగ్ పీరియడ్‌తో కూడినవే. అంటే, పాలసీదారు రైడర్ కొనుగోలు చేసినప్పటికీ, వెయిటింగ్ పీరియడ్ ముగిసిన తర్వాతే దాని ప్రయోజనాలను పొందడానికి వీలుంటుంది.

పరిమిత పరిధి: రైడర్లు ప్రత్యేక వైద్య అవసరం లేదా సందర్భం నుంచి రక్షిస్తుంది. అంతేతప్ప అన్ని ఆపద సందర్భాల్లోనూ ఒకే రైడర్ కవరేజీ కల్పించదు.

మినహాయింపులు: రైడర్ల ద్వారానూ కొన్ని పరిస్థితులు లేదా సందర్భాల్లో కవరేజీ లభించకపోవచ్చు. అందుకే పాలసీ నియమ నిబంధనలను జాగ్రత్తగా చదివి అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

- రమిత్ గోయల్, సీడీవో
ఫ్యూచర్ జెనరాలీ ఇండియా

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	127
కరీంనగర్	120	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	93
కర్నూలు	120	నెల్లూరు	98
విశాఖపట్నం	124	అనంతపురం	98
గోదావరి	130		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ

హైదరాబాద్	390	విజయవాడ	420
వరంగల్	392	గోదావరి	395
చిత్తూరు	460	విశాఖపట్నం	415
		డజను గుడ్లు రూ.	60

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,670 ▲	87,700 ▲	1,10,000 ▲
విజయవాడ	97,300 ▲	91,500 ▲	98,200 ▲
విశాఖపట్నం	93,990 ▲	86,160 ▲	94,640 ▲
రాజమండ్రి	95,670 ▲	87,700 ▲	97,600 ▲
ప్రొద్దుటూరు	93,100 ▲	85,560 ▲	93,100 ▼
ముంబై	93,353 ▲	85,511 ▲	92,929 ▲

ఇదీ GST
స్టాక్ ట్రాన్స్‌ఫర్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు!



రాంబాబు గొండాల

వివిధ ప్రదేశాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న సంస్థలకు ముఖ్యంగా పలు ప్రాంతాల్లో బ్రాంచీలు, షోరూమ్‌లు కలిగిన సంస్థలు సరుకును ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి పంపాల్సిన సందర్భాలు చాలా పర్యాయాలు ఎదురవుతుంటాయి. అంటే గోదాము నుంచి షాప్‌కు, ఒక షాప్ నుంచి మరొక షాప్‌కు ఇలా సరుకును పంపాల్సి ఉంటుంది. దీనికి కారణాలు అనేకం. ఉదాహరణకు పెద్ద సూపర్ మార్కెట్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అమ్మే షాప్‌లు, కార్పొరేట్ మొబైల్ షోరూమ్‌లు ఇవన్నీ ఒక వేర్ హౌస్‌లో సరుకును నిల్వ చేసి అవసరాన్ని బట్టి వివిధ షోరూమ్‌లకు పంపుతాయి. అలాగే అవసరాన్ని బట్టి ఒక షోరూమ్ నుంచి మరొక షోరూమ్‌కు కూడా పంపుతాయి. దీనినే స్టాక్ ట్రాన్స్‌ఫర్ అంటారు. అంటే ఒక సంస్థకు సంబంధించిన వివిధ బ్రాంచీల మధ్య సరుకు రవాణా అవుతుంటే దానిని స్టాక్ ట్రాన్స్‌ఫర్‌గా వ్యవహరిస్తారు.

మరి ఈ స్టాక్ ట్రాన్స్‌ఫర్‌కి సంబంధించి జీఎస్‌టీ చెల్లించాలా? లేదా మినహాయింపులు ఏమైనా ఉన్నాయా? అలాగే దీనికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవిటి? మొదలైన విషయాలు మీకోసం..

జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఒక సంస్థకు వివిధ రాష్ట్రాల్లో శాఖలు ఉంటే ప్రతి రాష్ట్రంలో విధిగా రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. అలాగే, ఒక రాష్ట్రంలో వివిధ శాఖలు ఉంటే వాటన్నిటికి ఒకటే జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ సరిపోతుంది. కాకపోతే, అన్ని శాఖల వివరాలను జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఇప్పుడు ఒక రాష్ట్రంలోని ఒక గోదాము నుంచి అదే రాష్ట్రంలోని ఒక బ్రాంచీకి లేదా ఒక బ్రాంచీ నుంచి మరొక బ్రాంచీకి మధ్య స్టాక్ ట్రాన్స్‌ఫర్ జరుగుతుంటే దీనికి సంబంధించి ఎలాంటి జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే సరుకు పంపే ప్రదేశం, పొందే ప్రదేశం ఒకటే జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ కింద ఉన్నాయి. కాబట్టి. మరి అలాంటప్పుడు సరుకును ఎలా పంపాలంటే, దీనికి ఇన్వాయిస్ జారీ చేయకుండా ఒక డెలివరీ చలాన్ కింద సరుకును పంపాల్సి ఉంటుంది. కాకుంటే ఈ-వే బిల్ మాత్రం నిబంధనల ప్రకారం జారీ చేయాల్సి ఉంటుంది.

ఇకపోతే సరుకును ఒక రాష్ట్రం నుంచి ఇంకొక రాష్ట్రానికి అంటే ఒకటే యాజమాన్య సంస్థకు సంబంధించిన రెండు బ్రాంచీలకు మధ్య స్టాక్ ట్రాన్స్‌ఫర్ అవుతుంటే మాత్రం కొంత జాగ్రత్త తీసుకోవాలి. ఎందుకంటే పాన్ నంబరు ఒకటే ఉన్నప్పటికీ జీఎస్‌టీ ప్రకారం ఈ రెండు వేర్వేరు రిజిస్ట్రేషన్లు. ఇలాంటి రిజిస్ట్రేషన్స్‌ను డిస్టింక్ట్ పర్సన్స్ అంటారు. ఇలా డిస్టింక్ట్ పర్సన్స్ మధ్య స్టాక్ ట్రాన్స్‌ఫర్ జరుగుతుంటే దీనిని సరఫరా కింద భావించి అందుకు తగ్గట్టుగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. మరి ఎంత విలువ మీద పన్ను చెల్లించాలి? దీనికి సంబంధించి కొన్ని నిబంధనలు ఉన్నాయి.

మొదటగా ఈ విలువ అనేది మార్కెట్ విలువ ప్రకారం ఉండాలి. దీన్నే ఓపెన్ మార్కెట్ వాల్యూ అంటారు. అంటే సాధారణ కొనుగోలుదారులకు ఏ విలువకు అమ్ముతారో ఆ విలువ లేదా సరుకును ఏ బ్రాంచీకి అయితే అమ్ముతున్నారో ఆ బ్రాంచీ వినియోగదారులకు అమ్మే ధరలో 90 శాతం విలువను చూపించవచ్చు. ఉదాహరణకు ఒక సంస్థ తన హైదరాబాద్ బ్రాంచీ నుంచి తమ విజయవాడ బ్రాంచీకి కొన్ని మొబైల్ ఫోన్లు స్టాక్ ట్రాన్స్‌ఫర్ చేస్తుందనుకుందాం. దీని సాధారణ మార్కెట్ విలువ రూ.28,000 అనుకుంటే ఇన్వాయిస్‌లో విలువ రూ.28,000 చూపించవచ్చు. లేదా ఈ మొబైల్‌ను విజయవాడ బ్రాంచీలో కొనుగోలుదారులకు రూ.30,000 అమ్ముతున్నారనుకుంటే దానిలో 90 శాతం అంటే రూ.27,000 చూపించవచ్చు. దీని మీద కట్టిన పన్నును విజయవాడ బ్రాంచీ నిబంధనలు అనుసరించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తీసుకోవచ్చు.

ఈ నిబంధనలతో సంబంధం లేకుండా ఇంకొక ఆప్షన్ కూడా అందుబాటులో ఉంది. అదేమిటంటే, సరఫరా పొందే శాఖ అంటే ఈ ఉదాహరణలో విజయవాడ బ్రాంచీకి స్టాక్ ట్రాన్స్‌ఫర్ చేసే సరుకు మీద పూర్తి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకోవటానికి అర్హత ఉన్నట్లయితే అప్పుడు ఇన్వాయిస్‌లో ఏ విలువ అయినా చూపించవచ్చు. ఎందుకంటే, ఎంత విలువ చూపినా, ఎలాగూ ఆ మొత్తం మీద క్రెడిట్ తీసుకోవచ్చు కాబట్టి.

ఒక్కొక్కసారి ఒకే రాష్ట్రంలో కూడా ఒకటి కంటే ఎక్కువ రిజిస్ట్రేషన్ ఉండవచ్చు. అలాంటప్పుడు కూడా స్టాక్ ట్రాన్స్‌ఫర్ మీద పన్ను చెల్లించాలి. సింపుల్‌గా చెప్పాలంటే ఒకటే రిజిస్ట్రేషన్ మధ్య జరిగే స్టాక్ ట్రాన్స్‌ఫర్‌కు ఎలాంటి పన్నులు వర్తించవు. అలాకాకుండా స్టాక్ ట్రాన్స్‌ఫర్ రెండు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ల మధ్య జరిగినప్పుడు తప్పకుండా పన్ను చెల్లించాలి. ఈ రెండు సందర్భాల్లోనూ ఈ-వే బిల్లును నిబంధనల ప్రకారం జారీ చేయాల్సి ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ప్రసూతి మరణాల్లో రెండో స్థానంలో భారత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న ప్రసూతి మరణాలపై దేశాలన్నీ దృష్టి పెటాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. 2000 నుంచి 2023 వరకు ఉన్న ప్రసూతి మరణాల సరళిపై ఓ నివేదిక విడుదల చేసింది. నైజీరియాలో 75 వేల మాతృమరణాలు నమోదవ్వగా.. 19వేల మరణాలతో భారత్, కాంగో రెండో స్థానంలో ఉన్నాయి.

ప్రముఖ కథక్ కళాకారిణి కుముదిని కన్నుమూత



అహ్మదాబాద్, ఏప్రిల్ 12: ప్రముఖ కథక్ నృత్య కళాకారిణి కుముదిని లాఖియా శనివారం అస్తమించారు. ఆమె వయసు 95 ఏళ్లు. వృద్ధాప్య సమస్యల కారణంగా అహ్మదాబాద్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవంలో ఆమె పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. 1981లో విడుదలైన హిందీ చిత్రం ఉమ్రావ్‌జాన్‌కు నృత్యదర్శకత్వం వహించారు. 1930 మే 17న అహ్మదాబాద్‌లో జన్మించిన ఆమె భారతీయ కళా కేంద్రలో శంభు మహరాజ్ వద్ద శిక్షణ పొందారు. 1964లో ఇక్కడ కదంబ్ సెంటర్ ఫర్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఏర్పాటు చేశారు. పద్మశ్రీ, పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ సహా ఎన్నో అవార్డులను అందుకున్నారు. ఆమె మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం తెలిపారు.

అరెస్టుకు కారణం చెప్పకుంటే బెయిల్ ఇవ్వొచ్చు

ప్రయాగ్‌రాజ్, ఏప్రిల్ 12: అరెస్టుకు పోలీసులు కారణాలు చెప్పకుంటే నిందితుడికి బెయిల్ మంజూరు చేయవచ్చని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. నిందితుడికి కారణాలు చెప్పలేదన్న విషయాన్ని ప్రాతిపదికగా చూపించి బెయిల్ ఇవ్వవచ్చని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం అరెస్టు చేసే ముందు నిందితుడికి కారణాలు చెప్పడం తప్పనిసరి అని పేర్కొంది. మంజీత్ సింగ్ అనే నిందితుడిని రిమాండుకు పంపిస్తూ రాంపూర్ మేజిస్ట్రేటు కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది.

గుజరాత్ నుంచి కాంగ్రెస్ ప్రక్షాళన!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వరుస పరాజయాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న కాంగ్రెస్.. గత వైభవాన్ని సాధించేందుకు పార్టీ సంస్థాగత ప్రక్షాళనకు నడుం బిగించింది. గుజరాత్ నుంచి పార్టీని ప్రక్షాళన చేసి గాడిన పెట్టేందుకు నిర్ణయించింది. ఆ రాష్ట్రంలోని 41 జిల్లాల డీసీసీ అధ్యక్షులను ఎంపిక చేసేందుకు 'సంఘటన్ సుజన్ అభియాన్' కార్యక్రమం కింద ఏఐసీసీ, పీసీసీ పరిశీలకులను నియమించింది. మొత్తం 43 మంది ఏఐసీసీ పరిశీలకులు, ఏడుగురు సహాయ పరిశీలకులు, 183 మంది పీసీసీ పరిశీలకులు ఈ జాబితాలో ఉన్నారు. ఏఐసీసీ పరిశీలకులుగా తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏపీ ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాగూర్‌తో పాటు తెలంగాణ నుంచి ఎంపీ బలరాం నాయక్, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్.. ఏపీ నుంచి పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సిరివెళ్ల ప్రసాద్ నియమితులయ్యారు.

చిత్రావతి పంప్డ్ స్టోరేజీ డీపీఆర్‌కు ఓకే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని చిత్రావతిలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు (పీఎస్‌పీ) సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కేంద్ర విద్యుత్ శాఖ ఆధ్వర్యంలోని సాంకేతిక-ఆర్థిక క్లియరెన్స్ సంస్థ అయిన సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ఆమోదించింది. 2024-25లో సుమారు 7.5 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంతో చిత్రావతి సహా 6 పీఎస్‌పీల డీపీఆర్‌లు దానికి అందగా.. వాటన్నిటికీ సమ్మతి దాయి. ఒడిశాలోని ఎగువ ఇంద్రావతి (600 మెగావాట్లు), కర్ణాటకలో శరావతి (2 వేల మెగావాట్లు), మహారాష్ట్రలో భీవ్‌పురి (1,000 మెగావాట్లు), భవాలీ (1,500 మెగావాట్లు), మధ్యప్రదేశ్‌లో ఎంపీ-30 (1,920 మెగావాట్లు) హైడ్రో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల సమగ్ర నివేదికలను ఆమోదముద్ర వేసినట్లు సీఈఏ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రపతికీ గడువు



(మొదటి పేజీ తరువాయి)

ఇది తొలిసారి. తమిళనాడు శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులపై గవర్నర్ ఎన్.రవి ఏ నిర్ణయమూ తీసుకోకుండా దీర్ఘకాలంపాటు తొక్కిపెడుతున్నారంటూ స్టాలిన్ సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. గవర్నర్ చర్య రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు, తనకున్న విశేషాధికారాలను ఉపయోగించి ఆ బిల్లులు ఆమోదం పొందినట్టుగా ఏప్రిల్ 8న తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నికైన ప్రజాప్రభుత్వాలు పంపే బిల్లుల విషయంలో నిర్ణయానికి సంబంధించి.. నాడు గవర్నర్లకు గడువు విధించిన సుప్రీంకోర్టు రాష్ట్రపతికి సైతం గడువును నిర్దేశించడం విశేషం. ఈమేరకు 415 పేజీల తీర్పు కాపీని సుప్రీంకోర్టు శుక్రవారం రాత్రి 10.54 గంటలకు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.


మినహాయింపు లేదు..

గవర్నర్‌కుగానీ, రాష్ట్రపతికిగానీ సంపూర్ణ వీటో అధికారాలు లేవని సుప్రీం తన తీర్పులో తేల్చిచెప్పింది. "ఏ బిల్లు విషయంలోనూ గవర్నర్‌కు సంపూర్ణ వీటో అధికారాలు ఉండవని మేం (తీర్పులోని ముందరి పేరాల్లో) పేర్కొన్నాం. అదే ప్రమాణాన్ని.. రాష్ట్రపతికి వర్తింపజేయకుండా ఉండడానికి మాకు ఏ కారణమూ కనపడట్లేదు. రాజ్యాంగం అంతటా కనిపించే ఈ ప్రామాణిక సూత్రానికి రాష్ట్రపతి ఏమీ మినహాయింపు కాదు. అటువంటి అదుపులేని (హద్దుల్లేని) అధికారాలు ఈ రెండు రాజ్యాంగ పదవుల్లో ఏ ఒక్కదానికీ ఉండరాదు" అని తీర్పులో స్పష్టం చేసింది. ఏదైనా ఒక బిల్లు రాష్ట్ర జాబితాలోనిదై ఉండి.. ఆ బిల్లును రాష్ట్ర మంత్రివర్గ సలహాకు విరుద్ధంగా గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపినప్పుడు, ఆ బిల్లును ఎక్కువ కాలం పెండింగ్‌లో పెడితే.. న్యాయ సమీక్షలో భాగంగా కోర్టులు ఆ బిల్లు నిలుపుదలకు గల కారణాలను పరిశీలించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. ఒకవేళ తగిన కారణాలు చెప్పకుండా పెండింగ్‌లో పెడితే.. రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం నిజాయతీతో వ్యవహరించకపోయి ఉండొచ్చని భావించడానికి తాము సంకోచించబోమని చెప్పింది. రాజ్యాంగపరమైన అంశాలు ఉన్న బిల్లులు, రాష్ట్రపతి ఆమోదం అవసరమయ్యే బిల్లుల విషయంలో.. వాటిని శాసనసభలో ప్రవేశపెట్టడానికి ముందే కేంద్రంతో సంప్రదించాలని రాష్ట్రప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. అలా రాష్ట్రప్రభుత్వాల నుంచి వచ్చే శాసనపరమైన ప్రతిపాదనలను వీలైనంత వేగంగా పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. తద్వారా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాల్లో ఘర్షణ వాతావరణం తగ్గుతుందని.. భవిష్యత్తులో వచ్చే అవకాశం ఉన్న అడ్డంకులను ముందే నిరోధించవచ్చని పేర్కొంది.

సమయం, వనరుల ఆదా..

"కార్యనిర్వాహక, శాసనవ్యవస్థల చర్యల రాజ్యాంగబద్ధత, చట్టబద్ధతకు సంబంధించిన ప్రశ్నలు తలెత్తినప్పుడు న్యాయనిర్ణయం చేసే బాధ్యత రాజ్యాంగ కోర్టులకు ఉంది. కాబట్టి.. ఏదైనా బిల్లు స్పష్టంగా రాజ్యాంగవిరుద్ధంగా ఉందని భావించి, గవర్నర్ దానికి రాష్ట్రపతి పరిశీలనకు పంపితే.. రాష్ట్రపతి ఆ బిల్లును 143వ అధికరణ కింద (తప్పనిసరి కాకపోయినప్పటికీ), దూరదృష్టితో ముందుజాగ్రత్తచర్యగా సుప్రీంకోర్టుకు పంపాలి" అని ధర్మాసనం తన తీర్పులో వివరించింది. సలహాలు, అభిప్రాయాల నిమిత్తం బిల్లులను రాజ్యాంగ కోర్టులకు సిఫారసు చేసే ఏర్పాటు ఏదీ గవర్నర్లకు లేనందున.. ఆ బాధ్యత రాష్ట్రపతిపైనే ఉందని పేర్కొంది. ఈ సందర్భంగా జస్టిస్ జేబీ పార్దీవాలా.. మన పొరుగు ఉన్న శ్రీలంకలోని సంప్రదాయం గురించి వివరించారు. "(శ్రీలంకలో) ప్రాంతీయ మండళ్ల బిల్లులు రాజ్యాంగవిరుద్ధంగా ఉన్నాయని అక్కడి గవర్నర్ భావిస్తే వారు ఆ బిల్లును ప్రెసిడెంట్‌కు సిఫారసు చేస్తారు. ప్రెసిడెంట్ ఆ బిల్లు రాజ్యాంగబద్ధతను పరిశీలించడానికి శ్రీలంక సుప్రీంకోర్టుకు పంపుతారు. సుప్రీం ఆ బిల్లు రాజ్యాంగబద్ధమేనని ప్రకటిస్తే.. గవర్నర్ దానికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది" అని వివరించారు. బిల్లుల రాజ్యాంగబద్ధతపై కోర్టుల సలహాలు, అభిప్రాయాలు ముందే తీసుకోవడం వల్ల సమయం, ప్రభుత్వ వనరులు.. రెండూ ఆదా అవుతాయని ధర్మాసనం వివరించింది. ఏది ఏమైనా.. బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపడం అనే ప్రక్రియ రాష్ట్రాలకున్న శాసనాధికారాలకు విఘాతం కలిగించేదిగా ఉండకూడదని తేల్చిచెప్పింది.

లోకం తీరు



ఆ 10 బిల్లులు ఇవే...

1) తమిళనాడు వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ యూనివర్సిటీ (సవరణ) బిల్లు
2) తమిళనాడు ఫిషరీస్ వర్సిటీ (సవరణ) బిల్లు
3) మద్రాసు విశ్వవిద్యాలయం (సవరణ) బిల్లు 2022 ఏప్రిల్‌లో డీఎంకే ప్రభుత్వం ఆమోదించిన ఈ బిల్లును వీసీల నియామకంతో పాటు గవర్నర్‌ను చాన్సలర్ పదవి నుంచి తొలగించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే ఉద్దేశంతో ప్రవేశపెట్టారు.
4) తమిళనాడు వ్యవసాయ వర్సిటీ(సవరణ) బిల్లు
5) తమిళనాడు డాక్టర్ అంబేడ్కర్ లా యూనివర్సిటీ (సవరణ) బిల్లు
6) తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం (సవరణ) బిల్లు
7) తమిళనాడు విశ్వవిద్యాలయం(సవరణ) బిల్లు
8) తమిళనాడు వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ వర్సిటీ (తదుపరి సవరణ) బిల్లు
9) సిద్ధ వైద్య విశ్వవిద్యాలయ బిల్లు
10) అన్నా విశ్వవిద్యాలయం (సవరణ) బిల్లు

గవర్నర్ ఆమోదం లేకుండానే.. 10 బిల్లులు చట్టాలయ్యాయి!

గెజిట్ ప్రకటించిన తమిళనాడు సర్కారు

- సుప్రీం సంచలన తీర్పుతో నోటిఫికేషన్
- దేశ చరిత్రలోనే తొలిసారిగా నిర్ణయం



గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గవర్నర్, రాష్ట్రపతి సంతకం లేకుండా దేశంలోనే తొలిసారిగా తమిళనాట పది బిల్లులు చట్టరూపం దాల్చాయి. ఈ మేరకు స్టాలిన్ ప్రభుత్వం శనివారం గెజిట్ వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వంతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న గవర్నర్ ఆర్ఎన్ రవి.. సుదీర్ఘకాలంగా పది బిల్లులు పెండింగ్‌లో పెట్టడంపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అంతేగాక 2023 నవంబరు 18నే ఆ బిల్లుల్ని గవర్నర్ ఆమోదించినట్లు పరిగణించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు కాపీని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే తమిళనాడు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ 10 బిల్లులూ చట్టరూపం దాల్చినట్లు అందులో ప్రకటించింది. దీంతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలన్నింటికీ ఇకపై ముఖ్యమంత్రే చాన్సలర్‌గా వ్యవహరిస్తారు.

ఇదీ నేపథ్యం...

తమిళనాడు గవర్నర్‌గా 2021లో బాధ్యతలు స్వీకరించిన ఆర్ఎన్ రవికి స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్ర సర్కారుకు మధ్య బిల్లుల విషయంలో మొదటినుంచీ ఘర్షణ కొనసాగుతోంది. తాము పంపిన 10 బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం 2023 నవంబరులో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిల్లులను ఆమోదించకపోగా, పునఃపరిశీలించాలని సూచిస్తూ వాటిని వెనక్కి కూడా పంపడం లేదని ఆరోపించింది. ఆ బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకునేందుకు గడువును నిర్దేశించాలని కోరింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం గత మంగళవారం కీలక తీర్పును వెలువరించింది. ప్రభుత్వం ఆమోదించి పంపిన 10 బిల్లులపై గవర్నర్ ఆర్ఎన్ రవి ఏ నిర్ణయం తీసుకోకుండా మూడేళ్లపాటు తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. శాసనసభ తీర్మానించి పంపిన బిల్లును గవర్నర్లు గరిష్ఠంగా నెలరోజులకు మించి పెండింగ్‌లో ఉంచకూడదని, మంత్రివర్గ సిఫారసు మేరకు రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని భావిస్తే, నెల రోజుల్లోనే పంపాలని తీర్పు చెప్పింది. ఒకవేళ మంత్రివర్గ సలహాలు, సూచనలకు విరుద్ధంగా.. సమ్మతిని నిలుపుదల చేయాలని గవర్నర్ భావిస్తే.. ఆ విషయాన్ని తెలుపుతూ గరిష్ఠంగా 3 నెలల్లోపు బిల్లును తిప్పి పంపాలని పేర్కొంది. ప్రస్తుత బిల్లుల విషయంలో గవర్నర్ సదుద్దేశంతో వ్యవహరించలేదని, రాష్ట్రపతి ఆమోదం కోసం 10 బిల్లులను పెండింగ్‌లో పెట్టడం ఏకపక్ష చర్యగా పేర్కొంది. ఈ నేపథ్యంలో 2023 నవంబరు 18నే ఆ బిల్లుల్ని గవర్నర్ ఆమోదించినట్లు పరిగణించాలని పేర్కొంటూ సంచలన తీర్పు వెలువరించింది. ఇకపై ఆ బిల్లులకు సంబంధించి రాష్ట్రపతి ఏవైనా చర్యలు తీసుకున్నా, అవి చెల్లుబాటు కావని తేల్చిచెప్పింది. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకోవడానికి కాల పరిమితిని ధర్మాసనం నిర్ణయించింది.

కొమ్మా రెమ్మా కన్నీరు!

- గుండెపోటుతో వనజీవి రామయ్య మృతి
- ఐదేళ్ల వయసులోనే మొక్కలు నాటడంపై ఆసక్తి
- కోటికిపైగా మొక్కలు నాటి వనజీవిగా ఖ్యాతి
- ప్రకృతి సేవకుడికి 2017లో పద్మశ్రీ పురస్కారం

ఖమ్మం, న్యూఢిల్లీ, అమరావతి (ఆంధ్రజ్యోతి)/ఖమ్మం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అశోకుడు చెట్లు నాటించాడనే సంగతి పుస్తకాలకే ఎందుకు పరిమితమవ్వాలి? ఆ చొరవను మనం ఆచరణలోనూ చూపలేమా? అనే గొప్ప సామాజిక స్పృహ ఆయనది! బొమ్మలతో ఆడుకునే ఐదేళ్ల ప్రాయంలో పచ్చదనం మీద ప్రేమతో మొక్కలు నాటారాయన! మొక్కలు నాటేందుకు ఖర్చుల కోసం కొంతభూమిని అమ్మేందుకూ వెనుకాడలేదాయన! ఏకంగా కోటికిపైగా మొక్కలు నాటి వనజీవిగా పేరొందిన దరిపల్లి రామయ్య (79) కన్నుమూశారు. శనివారం ఉదయం గుండెపోటుతో నిద్రలోనే మృతిచెందారు. ఆయన స్వస్థలం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి. దరిపల్లి లాలయ్య, పుల్లమ్మ దంపతులకు 1946 జూలై 1న రామయ్య జన్మించారు. ఐదేళ్ల వయసు నుంచే మొక్కలు నాటేవారు. ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెంలో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో పశువుల కాపరిగా మారారు. 1967లో జానమ్మను పెళ్లి చేసుకున్నారు. రామయ్య దంపతులకు కుమారులు సైదులు, సత్యనారాయణ, కనకయ్య, కూతురు సైదమ్మ ఉన్నారు. సైదులు, సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. రామయ్య కుటుంబానికి గతంలో ఏడెకరాల భూమి ఉండేది. మొక్కలు నాటేందుకు ఖర్చులకోసం మూడెకరాలను రామయ్య అమ్మారు. రహదారుల వెంట మొక్కలు నాటుతూ, రోడ్ల వెంట ఉన్న చెట్ల వద్ద కాయలు ఏరి వాటి నుంచి వచ్చిన గింజలను ఖాళీస్థలాలు, కొండలపై జల్లుతూ ఉండేవారు. ఎవరైనా మొక్కలు కావాలని ఆయన దగ్గరకు వెళితే ఉచితంగానే గింజలు, మొక్కలను అందించేవారు. పచ్చదనంపై విస్తృత ప్రచారం చేయడమే కాకుండా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ మొక్కలు నాటడం, 'వృక్షో రక్షతి రక్షితః' అంటూ నినాదాలు రాసేవారు. ఇంట్లో గిన్నెలు, పాత్రలు, బీరువాలు, గోడలు ఎక్కడైనా ప్రకృతికి సంబంధించిన నినాదాలే రాసేవారు. కుమారుడు, కూతురు పెళ్లిళ్ల శుభలేఖపై కూడా మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించాలని నినాదాలను ముద్రించారు. "వృక్షో రక్షతి రక్షితః" అనేది వనజీవి రామయ్య నమ్మిన నినాదం.. దాన్ని ఓ ఇనుప ప్లేట్‌పై రాసి తన మెడలో హారంగా వేసుకుని తిరిగేవారు. రామయ్య అద్భుతమైన శిల్పి కూడా. తన ఇంటి వద్ద గ్రానైట్ రాళ్లపై శిల్పాలను చెక్కేవారు. వాటిపైనా వృక్షోరక్షతి రక్షితః అంటూ నినాదాలు చెక్కేవారు. 2000 సంవత్సరంలో వనజీవి సేవలను గుర్తించిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆనాటి ఆర్అండ్‌బీ మంత్రి తుమ్మల.. రామయ్యకు బైక్ బహూకరించి, దాని పెట్రోలు ఖర్చులకు నెలకు రూ.1500 మంజూరు చేశారు. నాటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి కార్యక్రమంలోనూ రామయ్య పాలుపంచుకున్నారు. 2017లో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి పద్మశ్రీ అందుకున్నారు.



2017లో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి పద్మశ్రీ అందుకుంటున్న వనజీవి రామయ్య



సుస్థిరత కోసం గళం వినిపించారు: మోదీ

లక్షల సంఖ్యలో చెట్లను నాటడానికి, వాటిని రక్షించడానికి రామయ్య తన జీవితాన్ని అంకితమిచ్చారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అవిశ్రాంత కృషి.. ప్రకృతి పట్ల గాఢమైన ప్రేమనూ, భవిష్యత్తు తరాల పట్ల బాధ్యతను ప్రతిబింబిస్తాయని అన్నారు. సుస్థిరత కోసం గళం వినిపించిన వ్యక్తిగా గుర్తుండిపోతారని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

నేటి తరానికి రామయ్య ఆదర్శం: చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వనజీవి రామయ్య మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. 'పర్యావరణ పరిరక్షణకు కోటి మొక్కలు నాటిన రామయ్య కృషి స్ఫూర్తిదాయకం. నేటి తరానికి ఆదర్శప్రాయుడు. ఆయన మరణం పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి తీరని లోటు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. రామయ్య మృతికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్ సంతాపం తెలిపారు.

నేషనల్ హెరాల్డ్ కేసు మళ్లీ తెరపైకి

- ఏజేఎల్‌కు చెందిన రూ. 661 కోట్ల స్థిరాస్తుల స్వాధీనం!
- చర్యలు ప్రారంభించిన ఈడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ నిందితులుగా ఉన్న నేషనల్ హెరాల్డ్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. వారికి సంబంధించిన రూ.661 కోట్ల విలువైన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమాయత్తమైంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) సెక్షన్ 8లోని 5(1) నిబంధన కింద ఆ స్థిరాస్తులను తమ స్వాధీనంలోకి తీసుకుంటామని ఢిల్లీ, ముంబై, లఖ్‌నవూ ప్రాపర్టీస్ రిజిస్ట్రార్లకు నోటీసులు జారీచేసినట్లు ఈడీ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఢిల్లీలోని బహదూర్‌షా జాఫర్ మార్గ్‌లోని 5ఏ-నేషనల్ హెరాల్డ్ నివాసం, ముంబైలోని బాంద్రాలో సర్వే నంబరు 341లోని ప్లాట్ నంబర్2, యూపీలోని లఖ్‌నవూలో బిశ్వేశ్వర్‌నాథ్ రోడ్డులో ఉన్న ఏజేఎల్ భవనానికి శుక్రవారం నోటీసులు అంటించినట్లు తెలిపింది. తాము వీటిని స్వాధీనం చేసుకోవడానికి వీలుగా ఖాళీచేయాలని స్పష్టంచేసింది. అలాగే.. ఇక నుంచి ప్రతి నెలా ఈడీ డైరెక్టరు పేరిట అద్దె/లీజు మొత్తాన్ని బదిలీచేయాలని బాంద్రా హెరాల్డ్ హౌస్ 7,8,9 అంతస్తుల్లో ఉన్న జిందాల్ సౌత్‌వెస్ట్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు కూడా నోటీసులిచ్చారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రచురణ సంస్థ ఏజేఎల్. దీని యజమాని యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్. ఇందులో సోనియా, రాహుల్ ప్రధాన వాటాదారులు. వారిద్దరికీ చెరో 38 శాతం షేర్లు ఉన్నాయి. 2010లో ఏజేఎల్‌లోని రూ.2 వేల కోట్ల విలువైన వాటాలను యంగ్ ఇండియన్ కేవలం రూ.50 లక్షలకే తీసుకుంది. సోనియా, రాహుల్, నాటి కాంగ్రెస్ సీనియర్ నేతలు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్‌తో పాటు సుమన్ దూబే, శామ్ పిట్రోడా, యంగ్ ఇండియన్ కంపెనీ మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ బీజేపీ నేత సుబ్రమణ్యంస్వామి 2014 జూన్ 26న ప్రైవేటు ఫిర్యాదుచేశారు. ఈడీ 2021లో రంగంలోకి దిగి పీఎంఎల్ఏ చట్టం కింద దర్యాప్తుచేపట్టింది. సోనియా, రాహుల్‌ను పలు దఫాలు విచారించింది. బోగస్ విరాళాల రూపంలో రూ.18 కోట్లు, రూ.38 కోట్ల అద్దె చెల్లించినట్లుగా బోగస్ అడ్వాన్సు, రూ.29 కోట్ల మేర బోగస్ ప్రకటనలు చూపారని వెల్లడించింది. సదరు మూడు ప్రాపర్టీల ద్వారా రూ.988 కోట్ల మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని తెలిపింది. వీటితోపాటు రూ.90.2 కోట్ల విలువైన షేర్లను 2023 నవంబరులో ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది.

ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లకు ట్రంప్ సుంకాల మినహాయింపు

- చైనా సహా అన్ని దేశాలకూ వర్తింపు

వాషింగ్టన్, ఏప్రిల్ 12: సుంకాల నుంచి స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, సెమీకండక్టర్లు, హైటెక్ ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలకు మినహాయింపునిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శనివారం ఆ దేశ 'కస్టమ్స్ అండ్ బార్డర్ ప్రొటెక్షన్' విభాగం ఓ నోటీసు జారీ చేసింది. దీని ప్రకారం చైనా మీద విధించిన 145% సుంకంగానీ, అన్ని విదేశీ సరుకుల మీద విధించిన 10% సాధారణ సుంకంగానీ ఈ ఉత్పత్తులకు వర్తించదు. ట్రంప్ తాజాగా ప్రకటించిన ప్రతీకార సుంకాలపై అమెరికన్లలో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. చిప్‌లు, ప్రాసెసర్లు వంటివి అమెరికాలో పెద్ద ఎత్తున ఉత్పత్తి కావటం లేదు. వీటితోపాటు ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కోసం అమెరికా దిగుమతులపైనే ఆధారపడుతోంది. అడ్డగోలు సుంకాల వల్ల ఈ ఉత్పత్తుల ధరలు ఆకాశన్నంటే ప్రమాదం ఉంది. ఇది అంతిమంగా వినియోగదారులకు పెనుభారంగా మారుతుంది. దీనిపై సాధారణ అమెరికన్లతోపాటు టెక్ దిగ్గజ సంస్థలైన యాపిల్, శాంసంగ్, చిప్ తయారీ కంపెనీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే, ట్రంప్ తాజా మినహాయింపులు ప్రకటించినట్లు తెలుస్తోంది.

బెంగాల్‌లో భారీగా హింస

- వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు హింసాత్మకం
- రాష్ట్రంలో వక్ఫ్ చట్టాన్ని అమలు చేయం: మమత



ముర్షీదాబాద్‌లో కర్రలు చేతబట్టి నిరసనకారుల వీరంగం

కోల్‌కతా, ఏప్రిల్ 12: వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లో పెద్ద ఎత్తున హింస చెలరేగింది. పోలీసు వ్యాన్లు సహా పలు వాహనాలకు ఆందోళనకారులు నిప్పు పెట్టారు. భద్రతాదళాలపైకి రాళ్లు రువ్వారు. హింసాత్మక ఘటనల్లో ముగ్గురు మరణించగా, అనేకమంది గాయాలపాలయ్యారు. ముర్షీదాబాద్, మాల్దా, హుగ్లీ, దక్షిణ 24 పరగణా జిల్లాల్లో శుక్రవారం ఆందోళనకారులు రోడ్లను దిగ్బంధించి ఆందోళనలు నిర్వహించారు. శనివారం కూడా ప్రత్యేకించి ముర్షీదాబాద్ జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ జిల్లాలో ఇప్పటి వరకు 118 మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. ఆందోళనల వల్ల న్యూ ఫరక్కా-అజీంగంజ్ సెక్షన్‌లో శుక్రవారం ఆరు గంటల పాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో బెంగాల్‌లో వక్ఫ్‌చట్టాన్ని అమలు చేయబోమని సీఎం మమత పునరుద్ఘాటించారు. ప్రజలు శాంతియుతంగా ఉండాలని, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ వద్దని ఆమె కోరారు. 'హింసాత్మక చర్యలను మేం క్షమించబోం. రాజకీయాల కోసం మతాన్ని దుర్వినియోగం చేయాలని కొన్ని రాజకీయపార్టీలు ప్రయత్నిస్తున్నాయి. వాటి ఉచ్చులో పడకండి' అని కోరారు. ముర్షీదాబాద్ జిల్లాలో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు జరిపిన కాల్పుల్లో ఇద్దరు గాయపడ్డారని, వారిద్దరూ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని శాంతిభద్రతల ఏడీజీ జావెద్ షమీమ్ చెప్పారు. ఆందోళనకారులపై కఠిన చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ టీఎంసీ ప్రభుత్వాన్ని కోరారు. 'రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మైనారిటీ వర్గాలు చేపట్టే ఇలాంటి హింసను ఐదు నిమిషాల్లో అణచివేస్తాం. బుజ్జగింపు ధోరణితో ఉన్న రాష్ట్ర పాలకులు తగిన చర్యలు చేపట్టడం లేదు' అన్నారు. రైల్వే ఆస్తుల ధ్వంసంపై జాతీయ దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. సమాజంలో అశాంతిని రేకెత్తించేందుకు జిహాదిస్టులు ముందస్తు ప్రణాళిక ప్రకారమే హింసకు పాల్పడ్డారని ఆయన 'ఎక్స్'లో ఆరోపించారు. సువేందు అధికారి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కలకత్తా హైకోర్టు.. ముర్షీదాబాద్ జిల్లాలో కేంద్రబలగాలను రంగంలోకి దించాలని ఆదేశించింది. జస్టిస్ సౌమెన్ సేన్, జస్టిస్ రాజా బసు చౌదరితో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది.

ముర్షీదాబాద్‌లో తండ్రీకొడుకులు మృతి..

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనల నేపథ్యంలో ముర్షీదాబాద్ జిల్లా శంషేర్‌గంజ్ ప్రాంతంలోని జఫ్రాబాద్‌లో ఇద్దరు వ్యక్తులు కత్తిపోట్లకు గురై మరణించారు. మృతులను తండ్రీకొడుకులుగా గుర్తించారు. ఆందోళనకారులు తమ ఇంటిని లూటీ చేశారని, అనంతరం వారిద్దరినీ కత్తులతో పొడిచి వెళ్లిపోయారని మృతుల కుటుంబసభ్యులు చెప్పారు. శంషేర్‌గంజ్ బ్లాక్ దులియా ప్రాంతంలో జరిగిన హింసలో ఒక వ్యక్తికి బుల్లెట్ గాయమైనట్టు పోలీసులు తెలిపారు.

వలస రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- ట్రంప్ సర్కారు నిబంధనకు కోర్టు అనుమతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: 'నీ పేపర్లు చూపించు'.. అమెరికాలో నివసిస్తున్న వలసదారులు ఇకపై ఈ డిమాండ్‌ను నిత్యం ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. వర్క్ వీసా లేదా స్టూడెంట్ వీసాపై చట్టబద్ధంగా ఉన్నా సరే ఈ పరిస్థితి తప్పదు. ఎందుకంటే అమెరికా పౌరులు కాని 18 ఏళ్ల దాటిన వారెవరైనా 30 రోజులు దాటి దేశంలో ఉంటే తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందనే నిబంధన ఈనెల 11 నుంచి అమల్లోకి వచ్చింది. అన్ని వేళలా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలని, ఇది పాటించని వారికి ఎలాంటి మినహాయింపులు ఉండవని అమెరికా హోం ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) డిపార్టుమెంట్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇమిగ్రెంట్స్ అందరూ ప్రభుత్వం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆ డాక్యుమెంట్లు తమతో ఉంచుకోవాలని ఇటీవల ట్రంప్ ప్రభుత్వం ఓ చట్ట నిబంధన తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దానికి అమెరికా కోర్టు ఏప్రిల్ 10న ఆమోదం తెలిపింది. ఆ నిబంధనను అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్లను జడ్జి ట్రెవర్ ఎన్ మెక్‌ఫాడెన్ కొట్టివేశారు. దీంతో కొత్త నిబంధన అమల్లోకి వచ్చింది.



గుంటూరులో వక్ఫ్ బిల్లు వ్యతిరేక ర్యాలీలో కాంగ్రెస్, సీపీఐ నాయకులు

'వక్ఫ్' బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం: నారాయణ

గుంటూరు(తూర్పు), విజయవాడ (వన్‌టౌన్), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ బిల్లును వ్యతిరేకించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గుంటూరు, విజయవాడల్లో శనివారం జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. వక్ఫ్ బోర్డు బిల్లు ముస్లింల సమస్య కాదని, అన్ని వర్గాల ఆస్తులను దోచుకుని బడా కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యని ఆరోపించారు. వక్ఫ్ బిల్లుకు సవరణలు సూచించామని చంద్రబాబు చెబుతున్నారని, అవేంటో స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల చేతుల్లోనే 'వక్ఫ్' నిర్వహణ: ఫరూక్

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 'వక్ఫ్' నిర్వహణ ముస్లింల చేతుల్లోనే ఉంటుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు సూచనతోనే వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం జేపీసీకి పంపితే, టీడీపీ సూచించిన సవరణల్లో నాలుగింటిని ఆమోదించినట్లు చెప్పారు. వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో వ్యతిరేకించి, రాజ్యసభలో ఓకే చెప్పిన వైసీపీ.. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని మండిపడ్డారు. వక్ఫ్ సవరణ బిల్లులో ప్రతిపాదనలు, జేపీసీ, కేంద్రం దృష్టికి టీడీపీ తీసుకెళ్లిన అభ్యంతరాలు, బిల్లులో జరిగిన మార్పులు, కొత్త వక్ఫ్ చట్టంలోని కీలకమైన అంశాలపై శనివారం మంత్రి వివరించారు. ఆల్ ఇండియా ముస్లిం లా బోర్డు, జమాత్‌ల పెద్దలు, మైనార్టీ హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిసి వక్ఫ్ బిల్లుపై అభిప్రాయాలు వివరించారు. వక్ఫ్ ఆస్తుల వివరాలన్నీ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు వల్ల పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందని, ఆగాఖాన్ వక్ఫ్, బోహ్రా వక్ఫ్‌లు ఉన్న రాష్ట్రాల్లో వారికి ప్రత్యేక వక్ఫ్ బోర్డులు ఏర్పాటుకు ఈ చట్టం దోహదపడుతుందని అన్నారు.

భెల్ పరీక్ష పేపర్ లీక్‌పై విచారణ

పెందుర్తి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) పరీక్ష పత్రం లీక్‌పై పోలీసులు విచారణ ప్రారంభించారు. శనివారం పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్ జియాన్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి సీసీ ఫుటేజీని పరిశీలించారు. అభ్యర్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరిగిందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. కొందరు ఇన్విజిలేటర్లను కూడా విచారించినట్లు తెలిసింది. పేపర్ లీక్ ఆరోపణలపై అన్ని కోణాల్లో విచారణ చేపతామని సీఐ చెప్పారు.

వైసీపీలో 33 మందితో రాజకీయ సలహా మండలి

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో రాజకీయ సలహా మండలి(పీఏసీ)ని పునర్వ్యవస్థీకరించారు. 33 మందితో జంబో మండలిని ఆ పార్టీ అధినేత జగన్ నియమించారు. దీనికి ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కన్వీనర్‌గా ఉంటారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు ముద్రగడ పద్మనాభం, కొడాలి నాని, జోగి రమేశ్, ఆర్కే రోజా, విడదల రజని, వెలంపల్లి శ్రీనివాస్, పినిపె విశ్వరూప్, నందిగం సురేశ్, ఆదిమూలపు సురేశ్, అనిల్‌కుమార్ యాదవ్, వైఎస్ అవినాశ్‌రెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, సాకె శైలజానాథ్, తోట త్రిమూర్తులు. కోన రఘుపతి, బొల్లా బ్రహ్మనాయుడు, అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, కె.నారాయణస్వామి, ఎం.శంకరనారాయణ, విశ్వేశ్వర్‌రెడ్డి, అంజాద్‌బాషా, ఎస్ ప్రసన్నకుమార్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు.

సిద్ధార్థలో 'శంకర్‌దాదాలు'!

మెడికల్ కాలేజీలో మాస్ కాపీయింగ్

సప్లిమెంటరీ పరీక్షల్లో ఇతర ప్రైవేటు కాలేజీ విద్యార్థులకు స్లిప్‌లు

- అంతా బడా వ్యక్తుల పిల్లలే
- ఎగ్జామినేషన్ సిబ్బంది సహకారం
- ఇన్విజిలేటర్ల చేతివాటం.. సబ్జెక్టును బట్టి రేట్లు
- ఎంబీబీఎస్ విద్యార్థుల నుంచి లక్షలు వసూలు
- పారా మెడికల్, నర్సింగ్ వారి నుంచి ఒక్కో పరీక్షకు 1000
- పరీక్ష రాసిన తర్వాత జవాబు పత్రాలూమార్పిడి
- ఆరోగ్య శాఖ అధికారులకు పలు ఫిర్యాదులు
- తాజా తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురు విద్యార్థులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎంతో ఘన చరిత్ర ఉన్న విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీని ఇప్పుడు కొందరు అధికారులు, ఇతర ప్రైవేట్ మెడికల్ కాలేజీల విద్యార్థులు కలసి కాపీయింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేశారు. విద్యార్థుల నుంచి డబ్బులు తీసుకుని సప్లిమెంటరీ పరీక్షల్లో కాపీ కొట్టేందుకు ఎగ్జామినేషన్ విభాగం సిబ్బంది కొందరు సహకరిస్తున్నారు. ఎంబీబీఎస్, నర్సింగ్, పారా మెడికల్ కోర్సులు.. ఏవైనా ఇక్కడ కాపీ మాత్రం కామన్ అయిపోయింది. దీంతో కొందరు ఎంబీబీఎస్ విద్యార్థులు సిద్ధార్థ కాలేజీలోనే సప్లిమెంటరీ రాసేందుకు ఆప్షన్ పెట్టుకుంటున్నారు. రెగ్యులర్ పరీక్షల్లో పాస్ కాలేక.. ఒకే పరీక్షను నాలుగైదు సార్లు రాస్తున్నవారు ఇటు మొగ్గు చూపుతున్నారు. స్థాయి, పరపతి, డబ్బు ఉన్న వారి పిల్లలు... సిద్ధార్థనే పరీక్ష కేంద్రంగా ఎంచుకుంటున్నారు. దీనిపై కొంతకాలం కిందటే ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు, వర్సిటీ అధికారులకు అనుమానం వచ్చింది. ఇటీవల వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఈ విషయంపై మాట్లాడారు. 'మీ కాలేజీలో ఏదో జరుగుతోంది.. పెద్ద పెద్దవాళ్ల పిల్లలు మొత్తం సప్లమెంటరీ పరీక్షలకు మీ కాలేజీనే ఆప్షన్ పెట్టుకుంటున్నారు. జాగ్రత్తగా ఉండండి' అని హెచ్చరించారు.



ఎగ్జామినేషన్ వింగ్‌లో స్కెచ్

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎగ్జామినేషన్ విభాగంలో కాపీయింగ్‌కు సంబంధించిన మొత్తం స్కెచ్ వేస్తారు. కాపీ కొట్టేందుకు ఎంబీబీఎస్ విద్యార్థులకు ఒక రేటు, నర్సింగ్ విద్యార్థులకు మరో రేటు, పారా మెడికల్ విద్యార్థులకు ఇంకో రేటు ఫిక్స్ చేస్తారు. ఎంబీబీఎస్ విద్యార్థుల నుంచి రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకూ వసూలు చేస్తారు. అది కూడా సబ్జెక్టును బట్టి రేటు నిర్ణయిస్తారు. నర్సింగ్, పారామెడికల్ విద్యార్థులైతే ఒక్కొక్కరి నుంచి పరీక్షకు వెయ్యి రూపాయలు వసూలు చేస్తారు. నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులకు స్పెషల్ ఆఫర్ కూడా ఉంటుంది. విద్యార్థులు ఎగ్జామ్ హాల్‌లో సరిగ్గా రాయలేకపోతే, పరీక్ష పూర్తయిన తర్వాత రెండో రోజు లేదా మూడో రోజు వారి జవాబు పత్రాలను బయటకు తీసేసి పేపర్లు మార్చే అవకాశాన్ని కూడా ఎగ్జామినేషన్ విభాగం సిబ్బంది కల్పిస్తారు. ఎగ్జామినేషన్ విభాగంలో సిబ్బందిని ప్రతి ఏటా లేదా రెండేళ్లకు ఒకసారి మార్చాలి. కానీ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎగ్జామినేషన్ విభాగం సిబ్బంది ఏళ్ల తరబడి పాతుకుపోయారు.

కాపీయింగ్ ఇలా..

ఎంబీబీఎస్ విద్యార్థులు కాపీ కొట్టడం అంత ఈజీ కాదు. పరీక్షా కేంద్రాల్లో జామర్లు, సీసీ కెమెరాలు ఉంటాయి. సెల్ ఫోన్లను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురాకుండా, తీసుకువచ్చినా సిగ్నల్స్ రాకుండా జామర్లు ఏర్పాటు చేస్తారు. అయితే సిద్ధార్థ మెడికల్ కాలేజీలో సీసీ కెమెరాలు, జామర్ల కళ్లుగప్పి మరీ కాపీ కొట్టిస్తారు. వర్సిటీ నుంచి ఆన్‌లైన్‌లో పేపర్ వచ్చినప్పటి నుంచే వ్యవహారం ప్రారంభమవుతుంది. వర్సిటీ అధికారులు ఏ పేపర్ ఓపెన్ చేయాలన్నా ప్రిన్సిపాల్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తారు. లాగిన్ ఐడీ, పిన్ కూడా ఇచ్చి, పేపర్ డౌన్‌లోడ్ చేసుకునే ఆప్షన్ ఇస్తారు. పరీక్షకు గంట ముందు ఇదంతా జరుగుతుంది. ఈ గంటలోనే సిద్ధార్థలో ఎగ్జామినేషన్ విభాగం సిబ్బంది కాపీ కొట్టేందుకు అవసరమైన స్లిప్పులు సిద్ధం చేస్తారు. వాటిని బాత్ రూమ్‌ల్లో సిద్ధంగా ఉంచుతారు. వీరితో బేరం కుదుర్చున్న విద్యార్థులకు పరీక్ష ప్రారంభమైన 45 నిమిషాల తర్వాత స్లిప్‌లు అందజేస్తారు. ఇన్విజిలేటర్లు, స్క్వాడ్‌ను మేనేజ్ చేస్తారు. కొన్నేళ్లుగా ఒక ప్లాన్ ప్రకారం ఇది జరుగుతోంది. తాజాగా బుధవారం జరిగిన పరీక్షా సమయంలో కేంద్రాల్లో ఉన్న సీసీ కెమెరాల దిశ మార్చినట్టు వర్సిటీ అధికారులు గుర్తించారు.

రట్టవుతున్న గుట్టు...

బుధవారం ఎంబీబీఎస్ చివరి ఏడాది జనరల్ మెడిసిన్, ఎంబీబీఎస్ రెండో ఏడాది ఫార్మకాలజీ సప్లమెంటరీ పరీక్షలు దాదాపు 90 మంది రాశారు. అందులో ఎక్కువ మంది బిగ్ షాట్స్ పిల్లలు ఉన్నారు. దాదాపు 15 మంది విద్యార్థులు కాపీయింగ్ చేసుకునేందుకు ఏర్పాట్లు జరిగినట్లు ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. ఈ విషయాన్ని హెల్త్ వర్సిటీ అధికారులకు తెలియజేసి, పరీక్ష ప్రారంభమైన 30 నిమిషాల తర్వాత ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. దీంతో హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆ 15 మందిలో ముగ్గురు పిల్లలు కాపీ కొడుతూ పట్టుబడగా, మిగిలిన విద్యార్థులు అలర్ట్ అయ్యారు. పట్టుబడిన ముగ్గురిలో ఇద్దరు మంగళగిరిలోని ప్రముఖ మెడికల్ కాలేజీ విద్యార్థులు. మరొకరు ఇబ్రహీంపట్నంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీ విద్యార్థి. విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్, ఇతర వైద్య సిబ్బంది, ఎగ్జామినేషన్ విభాగం ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని అధికారులు భావించారు. కానీ శుక్రవారం బదిలీలతో సరిపెట్టారు. శనివారం సిద్ధార్థ కాలేజీలో జరిగిన ఎంబీబీఎస్ సప్లమెంటరీ పరీక్షల్లో కూడా ఇద్దరు విద్యార్థులు కాపీయింగ్ చేస్తూ దొరికారు. వీరిద్దరిని ఓ గదిలో కూర్చోబెట్టి పరీక్షలు రాయిస్తున్నట్టు సమాచారం. ఇద్దరు విద్యార్థులను డీ బార్ చేశారు.

ఇన్విజిలేటర్లూ వాళ్లే...

ఇన్విజిలేటర్ల ఎంపికలో సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఎగ్జామినేషన్ విభాగం సిబ్బంది హెల్త్ వర్సిటీ ఉద్యోగులను మేనేజ్ చేస్తారు. ఇన్విజిలేటర్లుగా తమతో కుమ్మక్కైన వైద్యులను నియమించుకుంటారు. కొన్ని పరీక్షలకు అర్హత లేని వారిని కూడా నియమిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నర్సింగ్ పరీక్షల సమయంలో ఇన్విజిలేషన్ కోసం స్టాఫ్ నర్సులు పోటీపడతారు. కాపీ కొట్టేందుకు అవకాశం కల్పించడం వల్ల కొంత మొత్తం ఇస్తారని ఆశించడమే కారణం. పారా మెడికల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలకు సంబంధించి కూడా ఇదే పరిస్థితి. సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఏం జరుగుతోందన్న దానిపై ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా విచారణ చేయాల్సి అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.




'ఒకే దేశం-ఒకే ఎన్నిక' సదస్సులో ప్రసంగిస్తున్న వెంకయ్య

జమిలి ఎన్నికలతో సుస్థిర పాలన

ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడంలేదు: వెంకయ్య

తిరుపతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల పాటు ఏదో ఒక ఎన్నికల గురించి వ్యూహాలు పన్నుకుంటూ, ఎన్నికల మూడ్‌లోనే ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది. ఒకసారి గెలిస్తే ఐదేళ్లు స్థిరంగా ఉండి, అభివృద్ధి చేస్తామన్న భరోసా కూడా రాజకీయ పార్టీలకు వస్తుంది. అప్పుడే గట్టి నిర్ణయాలు తీసుకోగలుగుతారు. జమిలి ఎన్నికలతోనే ఇది సాధ్యమవుతుంది' అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు అన్నారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రాముఖ్యత, సవాళ్లు, ప్రభావం వంటి అంశాలపై శనివారం ఉదయం తిరుపతిలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జమిలి ఎన్నికల గురించి సుదీర్ఘంగా ప్రసంగించారు. ఏకకాల ఎన్నికలు మనకు కొత్తేమీ కాదన్నారు. 1952, 1957, 1962, 1967 సంవత్సరాల్లో పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుతం రాజకీయ కారణాల వల్లే కొన్ని పార్టీలు జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయన్నారు. సగటు భారతీయ ఓటరు తెలివి, వివేచనను తక్కువ అంచనా వేయవద్దని పార్టీలకు విజ్ఞప్తి చేశారు. జమిలి ఎన్నికలతో సమయం మిగులుతుందని, ఖర్చు తగ్గుతుందని, మిగిలిన నిధులను సంక్షేమం, అభివృద్ధికి వినియోగించవచ్చని చెప్పారు. కాగా, పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని పూర్తిగా మార్చాలని వెంకయ్య కోరారు. ఏ పార్టీ తరపున ఎన్నికయ్యారో ఆ పార్టీ నచ్చకపోతే పదవికి కూడా రాజీనామా చేసేలా చట్ట సవరణ చేయాలన్నారు. విద్య, వైద్య సౌకర్యాలు మినహా ఏది ఉచితంగా ఇస్తామని చెప్పినా, ఎవరు చెప్పినా అది అనుచితమేనని అన్నారు.

20 నుంచి కర్నూలులో చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవాలు



కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ జన్మదిన సందర్భంగా కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో 'నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వజ్రోత్సవాలు' నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య శనివారం వెల్లడించారు. ఈనెల 20 నుంచి 26 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు వేసవి వినోద వల్లరిగా కొనసాగుతాయన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో ఆట, పాట, మాట, పద్యం పేర్లతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

APSFL Andhra Pradesh State FiberNet Ltd.

ఫైబర్‌నెట్ ఖాళీ!!

248 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై ఒకేసారి వేటు

- ప్రత్యామ్నాయ సిబ్బందిని భర్తీచేయకుండా కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం రద్దు
- దీంతో వైజాగ్ నాక్ దాదాపు మూతబడినట్లే
- సీఎం దృష్టి సారించాలంటున్న ప్రభుత్వ వర్గాలు

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో ఒకేసారి 248 మంది అవుట్ సోర్సింగ్‌ను తొలగించారు. వీరిలో అత్యధికులు జగన్ జమానాలో నియమితులైన వైసీపీ కార్యకర్తలే. వీరిని తీసేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ పెద్దఎత్తున డిమాండ్ వ్యక్తమైంది. నిన్నమొన్నటిదాకా ఉన్నతాధికారులు దీనిపై స్పందించనేలేదు. వారిని తొలగించాలని భావించినా నిర్ణయం తీసుకోకుండా నాన్చారు. ఇప్పుడు ఆకస్మికంగా అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు సంస్థతో ఒప్పందాన్ని శుక్రవారం రద్దు చేసేశారు. దీంతో 248 మంది ఉద్యోగులను తొలగించినట్లయింది. వీరిలో సాంకేతికంగా కీలకమైన ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరిలో చాలా మంది వైజాగ్ నెట్‌వర్క్ ఆపరేషన్ సెంటర్ (నాక్)లోనే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరిని తీసేయడంతో నాక్ దాదాపు మూతపడే పరిస్థితి ఏర్పడింది. అక్కడ సాంకేతిక సమస్యలు తలెత్తితే పరిష్కరించేవారు కరువవుతారు. ఇప్పుడక్కడ మిగిలింది సెక్యూరిటీ సిబ్బంది మాత్రమే. సాంకేతిక సిబ్బందిని కొత్తగా నియమించలేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా తొలగించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. పైగా వేటువేయాల్సింది వైసీపీ జమానాలో నియమితులైనవారిపై కాగా.. 2014-19 నడుమ టీడీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన సాంకేతిక సిబ్బందినీ తీసివేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని దిద్దుబాటు చర్యలు తీసుకోవడంతో పాటు కార్పొరేషన్‌పై పూర్తిస్థాయిలో సమీక్షించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఆయన మానసపుత్రికగా భావించే ఫైబర్‌నెట్‌ను బలోపేతం చేస్తే.. యువతకు ఉద్యోగాల కల్పనతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్‌నెట్ సేవలను విస్తృతంగా అందించేందుకూ వీలుంటుందని చెబుతున్నాయి. 2014- 19 మధ్య కాలంలో వెలుగు వెలిగిన ఏపీ ఫైబర్‌నెట్ ఇప్పుడు దివాలా అంచుల్లోకి వెళ్లిపోయింది. జగన్ ప్రభుత్వ నిర్వాకంతో రూ.2,171 కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. కనెక్షన్లు 12 లక్షల నుంచి ఐదు లక్షలకు పడిపోయాయి. చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఫైబర్‌నెట్ అక్రమాలపై నిగ్గుతేల్చేందుకు విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించింది. ఆ ఐదేళ్లలో రూ.5,400 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరుగగా.. ఇందులో రమారమి రూ.500 కోట్ల దాకా అక్రమాలు జరిగాయని ప్రాథమికంగా తేల్చారు. ఉద్యోగులుగా నియమితులైన వైసీపీ కార్యకర్తలు అసలు కార్యాలయాలకే రాకున్నా నిన్నమొన్నటివరకు వేతనాలు ఇవ్వడం గమనార్హం.

అది రోడ్డు ప్రమాదమే

పాస్టర్ ప్రవీణ్ మృతిపై పోలీసుల స్పష్టీకరణ



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతికి రోడ్డు ప్రమాదమే కారణమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రమాద సమయంలో ఆయన వెళ్తున్న బుల్లెట్ హెడ్‌లైట్ పనిచేయలేదని, గంటకు 70 కిలోమీటర్ల వేగంతో పోతున్నారని అంచనా వేశామని తెలిపారు. రాజమహేంద్రవరం సమీపంలో హైవే పక్కన కంకరపైకి బండి వేగంగా వెళ్లడంతో స్కిడ్ అయి అర్ధ చంద్రాకారంలో రోడ్డు కిందకు జారి వర్షపు నీటి డ్రెయిన్‌లో పడిపోయారని ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారని వెల్లడించారు. అక్కడున్న రాయి ప్రవీణ్ ముఖానికి బలంగా తగలడంతో గాయమైందని, కిందకు పడిపోయిన క్రమంలో ఆయనపై బుల్లెట్ పడిందని నివేదిక ఇచ్చారని తెలిపారు. ఏ వాహనం కూడా ఢీకొనలేదని వివరించారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో దర్యాప్తు వివరాలను వెల్లడించారు. గతనెల 24న ప్రవీణ్ హైదరాబాద్‌లో బయల్దేరినప్పటి నుంచి రాజమహేంద్రవరం సమీపంలో మృతి చెందిన ఘటన వరకు ముఖ్యమైన సీసీ ఫుటేజీలను ప్రదర్శించి వివరించారు.

దారిలో ఏం జరిగిందంటే...

'మార్చి 24 ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి ప్రవీణ్ (46) బయలుదేరారు. మార్గమధ్యంలో నాలుగుసార్లు మద్యం కొనుగోలు చేశారు. పెట్రోలు బంకులతో కలిపి ఆరు చోట్ల యూపీఐ ద్వారానే డబ్బులు చెల్లించారు. చిల్లకల్లులోని వెంకటసాయి ఫుడ్ ప్లాజా ఎదురుగా హైవేపై ఒకసారి, కీసర టోల్ గేటుకు 500 మీటర్ల దూరంలో మరోసారి, రామవరప్పాడు రింగ్‌రోడ్ వద్ద మూడోసారి కింద పడిపోయారు. ఈ మూడు ప్రమాదాల్లో ఆయనకు రాపిడి గాయాలయ్యాయి. బైక్ హెడ్‌లైట్ పగిలిపోయింది. రామవరప్పాడు రింగ్ వద్ద పడిపోయిన సమయంలో ఆటో డ్రైవరు చూసి పోలీసులకు చెప్పారు. పోలీసుల సూచనతో పక్కన పార్కులో సుమారు 2గంటలు విశ్రాంతి తీసుకున్నారు. పోలీసులకు తెలియకుండా మళ్లీ బుల్లెట్‌పై బయలుదేరారు. నయారా పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు పక్కన ఏడు అడుగుల దిగువున ఉన్న ఎండిపోయిన వర్షపు నీటి డ్రెయిన్‌లో పడిపోయి మృతిచెందారు. ప్రమాదం 24న రాత్రి 11.42 గంటలకు జరిగింది. ప్రవీణ్ వాహనం వెంబడి వెళ్లిన వాహనాలను పరిశీలించాం. ఈ కేసులో సుమారు 100 మందిని విచారించాం. 400సీసీ ఫుటేజీలను పరిశీలించాం. దూరం నుంచి వస్తుండడం, హెడ్‌లైట్ లేకుండా కుడి వైపున సిగ్నల్ లైట్‌తో అజాగ్రత్తగా ప్రయాణించడం వల్ల ప్రమాదం జరిగింది' అని ఐజీ వివరించారు.

ఇక్కడితో కేసు ముగిస్తున్నాం

'ప్రవీణ్ బావ శామ్యూల్ వాలెస్ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాం. కేసు తీవ్రత దృష్ట్యా అనుభవం గల అధికారులతో సిట్ వేసి 14 రోజుల్లో వేగంగా దర్యాప్తు చేశాం. ప్రవీణ్ కుటుంబ పరువును కాపాడాల్సిన బాధ్యత సమాజంపై కూడా ఉంది. అందువల్ల కొన్ని విషయాలు వెల్లడించలేం. వదంతులు వ్యాప్తిచేసిన 11 మందిపై కేసులు పెట్టి ఒకరిని అరెస్టు కూడా చేశాం. ఈ కేసు దర్యాప్తును ఇక్కడితో ముగిస్తున్నాం. అనుమానాలపై ఎవరి వద్దనైనా ఆధారాలు ఉంటే అందజేసి సహకరించాలని కోరాం. గురువారం వరకు గడువు ఇచ్చినా ఎవరూ ఇవ్వలేదు' అని ఐజీ తెలిపారు.

రూ. 2,842 మద్యం కొనుగోలు

'పాస్టర్ ప్రవీణ్ మార్గమధ్యంలో నాలుగుసార్లు ఆగి మొత్తం రూ.2,842 విలువ చేసే మద్యం కొనుగోలు చేశారు. 24న మధ్యాహ్నం 12.24 గంటలకు హైదరాబాద్ సిటీలోని సవేరా లిక్కర్ మార్ట్‌లో రూ.950 మద్యం కొన్నారు. మధ్యాహ్నం 3.02కు కోదాడలోని శ్రీఆదిత్య వైన్స్‌లో రూ.670, సాయంత్రం 4.56కు విజయవాడ దగ్గర రూ.872, రాత్రి 10.12 గంటలకు ఏలూరులోని నిపస్స్ టానిక్ వైన్స్‌లో రూ.350మద్యం కొన్నారు' అని తెలిపారు.

బుల్లెట్‌పై ఎందుకు వచ్చారంటే..

'రాజమహేంద్రవరం రూరల్‌లోని నామవరంలో బైబిల్ కాలేజీ నిర్మాణానికి ప్రవీణ్ 510 గజాల స్థలం కొనుగోలు చేశారు. నిర్మాణ పనుల నిమిత్తం లాలాచెరువులోని ఒక గదిని కూడా అద్దెకు తీసుకున్నారు. కాలేజీ నిర్మాణ అవసరాలకు బుల్లెట్‌ని రాజమహేంద్రవరంలో ఉంచడానికి ఆయన హైదరాబాద్ నుంచి దానిపై బయల్దేరారు' అని ఐజీ చెప్పారు.

హత్య కోణంలోనూ దర్యాప్తు చేశాం

'ప్రవీణ్‌ను హత్య చేశారని, మృతదేహాన్ని తీసుకొచ్చి పడేశారని అనుమానాలు వ్యక్తం చేసిన వారెవరూ తగిన ఆధారాలు సమర్పించలేదు. ఆ కోణంలోనూ దర్యాప్తు చేశాం. దర్యాప్తుపై ప్రవీణ్ భార్య సహా కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయలేదు. పోలీసులపై వారికి విశ్వాసం ఉంది. సామాజిక మాధ్యమాల ద్వారా ఎవరైనా ఊహాగానాలు, వదంతులు వ్యాప్తి చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవు' అని ఐజీ హెచ్చరించారు.

జీజీహెచ్ వైద్యురాలి అతి!

- పోలీసులు కొట్టలేదని గోరంట్లే చెప్పినా.. అరికాలు, మోకాలు చూపించాలని హడావుడి

గుంటూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి(జీజీహెచ్)లో వైద్యపరీక్షలు నిర్వహించే సమయంలో హైడ్రామా చోటు చేసుకున్నట్లు తెలిసింది. అక్కడ పనిచేసే ఓ వైద్యురాలు అతిగా వ్యవహరించినట్లు సమాచారం. టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై తమ సమక్షంలోనే దాడికి యత్నించిన మాధవ్‌ను పోలీసులు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ మాజీ మహిళా మంత్రి బంధువైన వైద్యురాలు అత్యుత్సాహం ప్రదర్శించారని.. తనను పోలీసులు కొట్టలేదని ఆయనే స్వయంగా చెప్పినా.. పోలీసులు కొట్టారా అని న్యాయాధికారి మాదిరిగా అడిగారు. అరికాలు చూపించు.. మోకాళ్లు చూపించాలని గుచ్చిగుచ్చి అడగడం పోలీసులను విస్మయానికి గురిచేసింది. పోలీసులను ఇరికించేందుకు యత్నిస్తున్నారని గ్రహించిన నిఘా వర్గాలు విషయాన్ని ఎస్పీ సతీశ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాయి. దీంతో ఆయన జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి విషయం చెప్పినట్లు తెలిసింది. సూపరింటెండెంట్ జోక్యం చేసుకోవడంతో ఆమె మాధవ్, ఆయన అనుచరులకు వైద్య పరీక్షలు పూర్తిచేసి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సందర్భంలో ఆయన్ను జీజీహెచ్‌లో వైద్య పరీక్షలకు తరలించడం.. అరికాళ్లు, శరీరంపై కమిలిన గాయాలు ఉన్నప్పటికీ దెబ్బలు లేవని నాటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి నివేదిక ఇవ్వడం తెలిసిందే.


12 మంది పోలీసు సిబ్బందిపై వేటు

గోరంట్ల మాధవ్ వ్యవహారంలో పోలీసు ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. ప్రాథమిక నివేదిక ఆధారంగా 12 మంది పోలీసు అధికారులు, సిబ్బందిపై వేటువేశారు. మాధవ్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి మరీ పోలీసులు, వారి అదుపులో ఉన్న నిందితుడిపైనా దాడికి దిగడం ద్వారా పోలీసు శాఖకు సవాల్ విసిరారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆయనపై కఠినంగా వ్యవహరించాల్సిందిపోయి పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు. వైసీపీ వారితో ఒకరిద్దరు లోపాయకారీ సంబంధాలు నెరుపుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో గుంటూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బి సీతారామయ్యను వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. వెంటనే రాష్ట్ర హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని డీజీపీ ఆదేశించారు. అలాగే మాధవ్‌కు వైద్య పరీక్షల నిర్వహణ, బందోబస్తుకు నియమితులైన 11 మంది అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేశారు. వీరిలో అరండల్‌పేట సీఐ వీరాస్వామి, నగరంపాలెం ఎస్సై రామాంజనేయులు, పట్టాభిపురం ఎస్సై రాంబాబు, ఏఎస్సైలు ఏడుకొండలు (అరండల్‌పేట), ఆంథోని (అరండల్‌పేట), హెడ్ కానిస్టేబుల్ రాజేష్ (నగరంపాలెం), కానిస్టేబుళ్లు తులసి నారాయణ, మోషే (పట్టాభిపురం), నగరంపాలెంకు చెందిన ప్రేమ్‌కుమార్, వెంకట స్వామి, మహేష్‌రావు తదితరులు ఉన్నారు. కాగా.. గుంటూరు ఎస్పీని శనివారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయానికి పిలిపించినట్లు సమాచారం. రెండ్రోజుల పరిణామాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మతాల మధ్య జగన్ చిచ్చు

- విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కుట్ర
- టీటీడీ గోశాలపై భూమన అసత్య ఆరోపణలు
- భక్తులెవరూ వీటిని నమ్మొద్దు : టీడీపీ

అమరావతి/అనంతపురం/తిరుమల/ఓర్వకల్లు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందేందుకు జగన్ రెడ్డి కుట్ర చేస్తున్నారని, అందులో భాగంగానే టీటీడీ గోశాలపై ఆ పార్టీ నేత భూమన కరుణాకర్ రెడ్డి అసత్య ఆరోపణలు చేశారని పలువురు టీడీపీ నేతలు, టీటీడీ బోర్డు సభ్యులు ఆరోపించారు. ప్రజలు ఈ అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోరారు. జగన్ తన పత్రికలో తప్పుడు రాతలు రాయిస్తూ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చేందుకు భూమన కుట్రలు చేస్తున్నారన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూస్తున్న వైసీపీ నేతలపై పోలీసులు నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా తప్పుడు ప్రచారాలతో మత విద్వేషాలను రెచ్చగొట్టాలన్నదే వైసీపీ కుట్ర అని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి విమర్శించారు. మనుగడ కోల్పోతున్న పార్టీని కాపాడుకునేందుకు నిత్యం ఏదో ఒక బూటకపు ప్రచారంతో వైసీపీ పబ్బం గడుపుకొంటోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కరుణాకర్ రెడ్డి ప్రెస్‌మీట్‌లో చూపించిన ఆవుల ఫొటోలు ఇక్కడివి కావన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా భూమన మాట్లాడుతున్నారని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపడ్డారు. ఆరోపణలు నిరూపిస్తే తాను తన పదవులకు రాజీనామా చేస్తానని, లేకుంటే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోవాలని భూమనకు సవాల్ విసిరారు. టీటీడీ గోశాలపై భూమన చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గోశాలకు వస్తే వాస్తవాలను చూపిస్తామని, ఎప్పుడు వస్తారో చెబితే తాను కూడా వస్తానని సవాల్ విసిరారు. దారుణ ఓటమి చవిచూసిన తర్వాత కూడా ఫేక్‌పార్టీ వైసీపీ ఫేక్ ప్రచారాలను మానుకోలేకపోతోందని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ విమర్శించారు.



ప్రజలను మోసగించేలా కుట్ర: బీఆర్ నాయుడు

'గోసేవ అంటేనే గోదేవి సేవ. ఈ పవిత్రమైన సేవపై రాజకీయ లబ్ధి కోసం మచ్చలేసే ప్రయత్నాలను భక్తులందరూ తిరస్కరించాలి' అని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. 'టీటీడీ గోశాలలో గోవులు మృతి చెందాయంటూ భూమన అవాస్తవాలు, కల్పిత ఆరోపణలు ప్రచారం చేయడం అత్యంత విషాదకరం. టీటీడీ బోర్డు చేపడుతున్న కార్యక్రమాల పట్ల కంటకింపుతో ఈ తరహా చర్యలకు దిగడం బాధాకరం. అనారోగ్యం, వృద్ధాప్యం, ప్రమాదాల వంటి కారణాల వల్ల గోవులు చనిపోయే అంశాన్ని రాజకీయంగా ప్రచారానికి వాడుకోవడం అధర్మం. ఇతర ప్రాంతాల్లో చనిపోయిన గోవుల ఫొటోలను టీటీడీ గోశాలకు చెందినవిగా చిత్రీకరించి ప్రజలను మోసగించేందుకు చేస్తున్న కుట్ర ఇది' అని బీఆర్ నాయుడు పేర్కొన్నారు.



విద్యార్థులకు సీఎం అభినందనలు

ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. గత దశాబ్ద కాలంలో ఉత్తీర్ణతలో అద్భుతమైన మెరుగుదల కనిపించడం ఆనందంగా ఉందన్నారు. తరగతుల వారీగా వాట్సాప్ గ్రూపులు, కేర్‌టేకర్ సిస్టమ్ వంటి గేమ్ ఛేంజింగ్ సంస్కరణలను విద్యారంగంలో తీసుకురావడం వల్లే విద్యార్థులు అద్భుతాలు ఫలితాలు సాధించారని చంద్రబాబు పేర్కొన్నారు.

ఇంటర్‌లో భారీగా పెరిగిన ఉత్తీర్ణత

సెకండియర్‌లో 83%.. ఫస్టియర్‌లో 70% మంది పాస్.. గత పదేళ్లలోనే అత్యధికం

- టాప్‌లో కృష్ణా... అట్టడుగున అల్లూరి జిల్లా
- రెండు సంవత్సరాల్లోనూ బాలికలదే పైచేయి
- సత్తా చాటిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. రెండో సంవత్సరం 83శాతం, మొదటి సంవత్సరం 70శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలను మంత్రి లోకేశ్ శనివారం ఉదయం 11గంటలకు విడుదల చేశారు. గత పదేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా అత్యధిక ఉత్తీర్ణత శాతం ఈ ఏడాదే నమోదైంది. ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు నమోదు చేశారు. రెండు సంవత్సరాల్లోనూ బాలుర కంటే బాలికలే అత్యధికంగా ఉత్తీర్ణత సాధించి సత్తా చాటుకున్నారు. ద్వితీయ సంవత్సరంలో 80శాతం మంది బాలురు, బాలికలు 84శాతం, ప్రథమ సంవత్సరంలో బాలురు 66శాతం, బాలికలు 75శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గ్రూపుల వారీగానూ ఈసారి ఉత్తమ ఫలితాలే వచ్చాయి. జిల్లాల వారీగా సెకండ్ ఇయర్ ఫలితాల్లో 93శాతం ఉత్తీర్ణతతో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. గుంటూరు (91%), ఎన్టీఆర్ (89%) జిల్లాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక మొదటి సంవత్సరం ఫలితాల్లో కూడా తొలి మూడుస్థానాల్లో వరుసగా కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలే ఉండటం విశేషం. ఇక సెకండ్ ఇయర్‌లో 73శాతంతో అల్లూరి సీతారామరాజు జిల్లా, ఫస్ట్ ఇయర్‌లో 54 శాతంతో చిత్తూరు జిల్లా అట్టడుగు స్థానాల్లో నిలిచాయి. ఇంటర్ ఒకేషనల్ ఫస్ట్ ఇయర్‌లో 62శాతం, సెకండ్ ఇయర్‌లో అత్యధికంగా 77శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తంగా అన్ని యాజమాన్యాల కాలేజీల్లోనూ గతేడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం భారీగా పెరిగింది.

మే 12 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను మే 12 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు తెలిపింది. అలాగే అవే తేదీల్లో విద్యార్థులు ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలకు కూడా హాజరుకావచ్చని పేర్కొంది. ఈ నెల 15 నుంచి 22లోగా సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువుగా పేర్కొది. అలాగే ఈ నెల 13 నుంచి 22 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని వెల్లడించింది.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల సత్తా

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. గత దశాబ్దకాలంలో ఎన్నడూలేని విధంగా ఉత్తమ గణాంకాలు నమోదయ్యాయి. ఫస్టియర్ పరీక్షలకు 50,314 మంది హాజరవగా 23,799 మంది(47%) పాస్ అయ్యారు. అలాగే రెండో సంవత్సరంలో 39,783 మందికిగాను 27,276 మంది(69%) ఉత్తీర్ణులయ్యారు. 2014 నుంచి పరిశీలిస్తే ప్రభుత్వ కాలేజీలకు ఇవే అత్యుత్తమ గణాంకాలు. 2024లో ఫస్టియర్‌లో కేవలం 38శాతం మంది, సెకండియర్‌లో 58శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదం చేశాయి. ఈ ఏడాది నుంచి ఇంటర్ బోర్డు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేస్తోంది. మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించింది. 217 కాలేజీలకు ప్రిన్సిపాళ్లను నియమించింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా ఏ,బీ,సీ కేటగిరీలుగా వర్గీకరించి వెనకబడిన వారిపై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ చర్యలతో ప్రభుత్వ కాలేజీల్లో ఉత్తమ ఫలితాలు నమోదయ్యాయి. ఈ విభాగంలో రెండో సంవత్సరంలో పార్వతీపురం మన్యం (81%), గుంటూరు(76%), అన్నమయ్య (76%)తో టాప్‌లో ఉండగా... విశాఖపట్నం(55%), అనకాపల్లి (61%), బాపట్ల(63%) అట్టడుగున ఉన్నాయి.

2014 నుంచి ఇంటర్ ఫలితాలు... (ఉత్తీర్ణత %)

సంవత్సరం	ప్రథమ	ద్వితీయ
2014	59	66
2015	63	67
2016	68	69
2017	64	73
2018	62	69
2019	60	68
2020	59	59
2021 (కరోనా వల్ల పరీక్షలు రద్దు)		
2022	54	61
2023	61	72
2024	67	78
2025	70	83

మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ఇంటర్ విద్యా సంవత్సరం ప్రారంభమైంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టిన వెంటనే జూనియర్ కాలేజీలపై సమీక్షించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు బ్యాగులు, నోట్‌బుక్స్ కూడా ఇచ్చారు. దీంతో అడ్మిషన్లు కూడా పెరిగాయి. 15వేల మంది అదనంగా ప్రభుత్వ కాలేజీల్లో చేరారు. ఉత్తీర్ణత శాతం కూడా పెరిగింది.

ఫెయిలైనవారు నిరాశ పడొద్దు

ఇంటర్ ఫలితాలపై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఇంటర్ ఫలితాలలో గత పదేళ్లలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైనందుకు ఆనందంగా ఉంది. ప్రత్యేకించి ప్రభుత్వ, ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో మెరుగుదల కనిపించింది. ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు నిరాశ చెందకండి. దీనిని ఒక అడుగుగా భావించి మరింత కృషి చేసి మరింత బలంగా తిరిగి రావాలని కోరుకుంటున్నాం. ప్రతి విద్యార్థికి శుభాకాంక్షలు' అని లోకేశ్ పేర్కొన్నారు.

అన్ని సబ్జెక్టుల్లో 98 శాతం.. ఇంగ్లీషులో 5 మార్కులే..!

విజయవాడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరంలో 98 శాతం మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం సంస్కృతం (98), మ్యాథ్స్ 2ఏ (73), మినహా మిగిలిన అన్ని సబ్జెక్టుల్లోనూ 100 శాతం మార్కులొచ్చాయి. కానీ.. సెకండియర్ ఇంగ్లీషులో మాత్రం 5 మార్కులే వచ్చాయి. దీంతో ఆ విద్యార్థిని ఫెయిల్ అయింది. విజయవాడ పటమటకు చెందిన దండే రాజేశ్వరి.. నారాయణ ఏసీఈసీ క్యాంపస్‌లో ఇంటర్ చదివింది. ఫస్టియర్‌లో ఆమెకు 98 శాతం మార్కులు వచ్చాయి. ఇంగ్లీషులో 94 మార్కులు సాధించింది. సంస్కృతంలో 99, గణితం 1(ఎ)లో 75, 1(బీ)లో 75, ఫిజిక్స్‌లో 60, కెమిస్ట్రీలో 58 మార్కులు సాధించింది. కానీ.. సెకండియర్‌లో సంస్కృతంలో 98, గణితం 2(ఎ)లో 73, 2(బి)లో 75, ఫిజిక్స్‌లో 60, కెమిస్ట్రీలో 60 మార్కులు సాధించింది. ఇంగ్లీషులో మాత్రం ఐదు మార్కులే వచ్చినట్టు చూపించింది. దీంతో మొత్తం 892 మార్కులు సాధించినప్పటికీ ఆమె ఫెయిల్ అయింది. బాగా చదివే ఆమెకు ఇంగ్లీషులో ఐదు మార్కులే రావడంతో కన్నీరుమున్నీరవుతోంది.



సెకండియర్ ఇంగ్లిష్‌లో 5 మార్కులే రావడంతో ఫెయిల్ అయినట్టు చూపుతున్న మార్కుల లిస్టు

ఇద్దరు ఫస్టియర్ విద్యార్థుల బలవన్మరణం

బండిఆత్మకూరు, నెల్లూరురూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఫెయిలైన ఇద్దరు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. కర్నూలు జిల్లా బండిఆత్మకూరు ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న పెద్ద మౌళాలి కుమారుడు చిన్నమస్తాన్ నంద్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ హెచ్‌ఈసీ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో చిన్నమస్తాన్ ఫెయిల్ అయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాలెంలో మరో ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి ఎంపీసీలో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ విద్యార్థి ఇంట్లోనే ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు.

న్యాయ వ్యవస్థలో జవాబుదారీతనం పెంచాలి

- ఏబీఏపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో వక్తల పిలుపు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థను మరింత పరిపుష్ఠం చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అఖిల భారతీయ అధివక్త పరిషత్(ఏబీఏపీ) జాతీయ కార్యవర్గ సమావేశాలు శనివారం ఘనంగా ప్రారంభయ్యాయి. గుంటూరు జిల్లా, చిన్నకాకానిలో నిర్వహించిన సమావేశాలకు అండమాన్ నికోబార్‌తో సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 175 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అదేవిధంగా రాష్ట్రానికి చెందిన పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. సమావేశాలను ప్రారంభించిన ఏబీఏపీ జాతీయ అధ్యక్షుడు కేఎస్ మూర్తి మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థను మరింత పరిపుష్ఠం చేయడంతోపాటు జవాబుదారీతనం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ న్యాయవాది పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు మాట్లాడుతూ.. వృత్తిపరమైన నిబద్ధతను ప్రతి ఒక్కరూ ఆకళింపు చేసుకోవాలని సూచించారు. అనంతరం, ఏబీఏపీ కేంద్ర కార్యాలయం కార్యదర్శి సంతోశ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి, సుప్రీంకోర్టు న్యాయవాది దివ్వెల భరత్‌కుమార్ పలు అంశాలపై మాట్లాడారు. ఏపీ హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం భగభగ

వాయవ్య గాలులతో వేడెక్కిన వాతావరణం

- రావిపాడులో 43.7, దరిమడుగులో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత
- నేడు 97 మండలాల్లో వడగాడ్పులు

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కోస్తాతోపాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో శనివారం ఎండ మండిపోయింది. వాయవ్య గాలులతో వాతావరణం వేడెక్కింది. ప్రధానంగా మధ్య కోస్తాలో మధ్యాహ్న సమయంలో వడగాడ్పులు వీచాయి. పగటి ఉష్ణోగ్రతలు మూడు నుంచి ఏడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. 119 ప్రాంతాల్లో 41 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పల్నాడు జిల్లా రావిపాడులో 43.7, ప్రకాశం జిల్లా దరిమడుగులో 43.4, బాపట్ల జిల్లా ఇంకొల్లులో 43, తిరుపతి జిల్లా రేణిగుంటలో 42.8, తూర్పుగోదావరి జిల్లా చిన్నాయిగూడెంలో 42.6, జంగమహేశ్వరపురంలో 41.8, బాపట్లలో 41.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 22 ప్రాంతాల్లో తీవ్రంగా, 73 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. ఆదివారం ఏలూరు, భీమడోలు, జీకొండూరు మండలాలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లోని 30 మండలాల్లో తీవ్రంగా, శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు 67 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో ఎండ తీవ్రత పెరుగుతుందని వాతావరణ నిపుణుడు తెలిపారు.

విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- తూర్పుగోదావరి జిల్లాలో ఘటన

కోరుకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కాపవరంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని రైస్ మిల్లు వద్ద శనివారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానిక గణపతి రైస్‌మిల్లులో శనివారం ధాన్యం లోడు చేసే కన్వర్ట్ బెల్ట్‌ను ట్రాలీపై తీసుకువెళుతుండగా సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు ట్రాలీ చివర భాగం తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై రైసుమిల్లు కార్మికులు ఆకుల శ్రీరాం(నాని)(30), జాజుల వెంకన్న (58), పలసాల సత్యనారాయణ (55) అక్కడికక్కడే మృతి చెందారు.

కియలో ఇంటి దొంగలు?

- ఐదేళ్లుగా మాయమవుతున్న ఇంజన్లు
- ఏ-1గా పరిశ్రమ ఉద్యోగి పఠాన్ సలీం
- మాయమైన ఇంజన్ల విలువ 23.50 కోట్లు

హిందూపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కియ పరిశ్రమలో కారు ఇంజన్ల మాయం ఇంటి దొంగల పనేనని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. ఈ కేసులో సంస్థ ఉద్యోగి పఠాన్ సలీంను ఏ-1గా చేర్చిన పోలీసులు, దర్యాప్తును వేగవంతం చేశారు. గతేడాది డిసెంబరు 12న పటాన్ సలీం తను విధులు నిర్వహించే చోట కాకుండా, మరోచోట సంచరించినట్లు కియ అధికారులు గుర్తించారు. ఇంజన్ షాప్ మొబిస్ గేట్ వద్ద అనధికారిక వాహనాలు సంచరించే సమయంలో అతను వెళ్లిరావడం సీసీ కెమెరాల్లో రికార్డయింది. దీంతో అధికారులు అంతర్గత పరిశీలన జరిపారు. హుండాయ్ మోటార్ ఇండియా(హెచ్ఎంఐ) ఇంజన్లను తీసుకెళ్లే దృశ్యాలు, వాటి రికార్డుల్లో తేడాలను గుర్తించారు. ఈ ఏడాది జనవరిలో చేపట్టిన వార్షిక లెక్కల పరిశీలనలో 940 ఇంజన్లు తక్కువ రావడంతో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. అక్రమాలను నిగ్గుతేల్చాలని కోరుతూ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ విభాగం అధిపతి సాయి నందన్ గతనెల 19న కియ ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేసింది. పఠాన్ సలీంను అదుపులోకి తీసుకున్న పోలీసులు, మొత్తం కుట్రను ఛేదించే పనిలో నిమగ్నమయ్యారు. సీసీ ఫుటేజీతో పాటు కియ రికార్డులను పరిశీలించి, అక్రమార్కులను గుర్తించే దిశగా సిట్ అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు.

ఆ ఇంజన్లు ఏమయ్యాయి?

మాయమైన ఒక్కో ఇంజిన్ విలువ రూ.2.50 లక్షలు అని సమాచారం. ఈ లెక్కన కియకు రూ.23.50 కోట్లు నష్టం జరిగింది. ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరగడాన్ని పరిశ్రమ నిర్వాహకులు జీర్ణించుకోలేకపోతున్నారు. సాధ్యమైనంత త్వరగా బాధ్యులను పట్టుకోవాలని పోలీసులను కోరడంతో డీజీపీ కార్యాలయమే దగ్గరుండి ఈ కేసును పర్యవేక్షిస్తోంది. సిట్ అధికారులు తమిళనాడు సహా వేర్వేరు రాష్ట్రాలకు వెళ్లి అనుమానితులను పట్టుకుంటున్నారు. మాయమైన ఇంజన్లు ఎక్కడకు చేరాయని ఆరా తీస్తున్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రచారకర్తగా గుకేష్



హైదరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భారత చెస్ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజును తమ విద్యాసంస్థల ప్రచారకర్త(బ్రాండ్ అంబాసిడర్)గా నియమించామని శ్రీచైతన్య విద్యాసంస్థ తెలిపింది. చిన్న వయస్సులోనే గుకేష్ సాధించిన అసాధారణ విజయాలు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని శ్రీచైతన్య విద్యాసంస్థల సీఈవో సుష్మ బొప్పన ఒక ప్రకటనలో తెలిపారు. గుకేష్ ప్రేరణతో తమ విద్యార్థులు మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తారన్న విశ్వాసం ఉందని పేర్కొన్నారు. బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక కావడంపై గుకేష్ దొమ్మరాజు సంతోషం వ్యక్తం చేశారు. చదరంగంలో విజయానికి ముందస్తు ప్రణాళిక, వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ ఎంతో కీలకమని, పోటీ పరీక్షలకూ ఇదే విధానం అవసరమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.